సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 163

సోమవారం 27-2-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



ఆసీస్ అమ్మాయిల 'సిక్సర్'
ఆరోసారి టి20 వరల్డ్ కప్ కైవసం ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం - 12లో



విశ్రాంత జీవనం.. హాయిగా!
సరైన ఆర్థిక ప్రణాళికతోనే వృద్ధాప్యంలో ప్రశాంతత - 13లో



ఈ-సంజీవనితో డిజిటల్ విప్లవం
భారత్‌లో డిజిటల్ విప్లవం సత్తా చాటుతోందని.. ఈ-సంజీవని యాప్ ఇందుకు నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



ఇటలీ తీరంలో విషాదం
ఇటలీ సముద్ర జలాల్లో వలసదారులు ప్రయాణిస్తున్న చెక్క పడవ మునిగిపోగా.. 58 మృతదేహాలను వెలికి తీశారు.
వివరాలు 6లో ▸



ఈశాన్యంలో నేడే పోలింగ్
ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయాల్లోని శాసనసభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది.
వివరాలు 6లో ▸



త్వరలో మరో జోడో యాత్ర!
అరుణాచల్‌ప్రదేశ్ నుంచి గుజరాత్‌లోని పోరుబందర్ వరకు మరో పాదయాత్ర చేపట్టే ఆలోచనలో ఉన్నట్టు కాంగ్రెస్ వెల్లడించింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ధర్మ ప్రచార కేంద్రంగా 'అరసవల్లి'



హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని.. అరసవల్లి సూర్య క్షేత్రం ధర్మ ప్రచార కేంద్రంగా విరాజిల్లే అవకాశముందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. పీఠాధిపతి హోదాలో ఆయన తొలిసారి శ్రీకాకుళంలోని అరసవల్లి ఆదిత్యుడిని దర్శించుకున్నారు.
వివరాలు 14లో ▸

నాటు పడవ బోల్తా



సరదాగా చెరువులో విహరించాలన్న యువకుల సంతోషం ప్రాణాల మీదకు తెచ్చింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తోడేరు కొత్త చెరువులో నాటు పడవ బోల్తా పడటంతో ఆరుగురు గల్లంతయ్యారు. నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైనవారి కోసం ఈతగాళ్లు, పోలీసులు గాలిస్తున్నారు.
వివరాలు 2లో ▸

కంటైనర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్



కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా ఏపీసీపీడీసీఎల్.. విజయవాడ సమీపంలోని గొల్లపూడి శ్రీనివాస నగర్‌లో కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించింది. మార్చి నెలలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
వివరాలు 14లో ▸

ఆరోగ్య సేవలు సూపర్

ఏపీలో గ్రామీణ పీహెచ్‌సీల పనితీరు అద్భుతం

పార్లమెంట్‌కు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

- నూటికి నూరు శాతం కేంద్రాలు 24 గంటల పాటు సేవలు
- 1,142 గ్రామీణ పీహెచ్‌సీల్లో నిర్విరామంగా వైద్యం అందుబాటులో
- దేశంలో 45.1 శాతం పీహెచ్‌సీల్లో మాత్రమే 24 గంటలు సేవలు
- రాష్ట్రంలో మూడేళ్లలో ప్రజా వైద్య రంగంలో పెను మార్పులు
- రూ.16 వేల కోట్లతో ఆస్పత్రుల ఆధునికీకరణ, భారీగా మౌలిక వసతులు, కొత్త మెడికల్ కాలేజీలు
- 11,480 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు
- కొత్తగా 304 పీహెచ్‌సీలు.. మరో 179 కేంద్రాల పనులు పురోగతిలో
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 47 వేలకుపైగా వైద్య పోస్టుల భర్తీ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) నిరంతర సేవలతో అద్భుతమైన పనితీరు కనపరుస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. రాష్ట్రంలో నూటికి నూరు శాతం గ్రామీణ పీహెచ్‌సీలు 24 గంటలూ పని చేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు వందకు వంద శాతం 24 గంటలపాటు పనిచేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందని పేర్కొంది. ఆ తరువాత స్థానంలో సిక్కిం నిలిచింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ తరహాలో నూటికి నూరు శాతం పీహెచ్‌సీలు నిరంతరం సేవలందించడం లేదని
మిగతా 2వ పేజీలో ▸

ఏపీ స్ఫూర్తితో సాగుతాం

వైగా-2023 అంతర్జాతీయ సదస్సులో కేరళ మంత్రి ప్రసాద్

- ఏపీ తరహాలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ తీసుకొస్తున్నాం
- కౌలురైతుల కోసం సీసీఆర్సీ చట్టం కూడా..
- ఆర్బీకేల తరహాలో వన్‌స్టాప్ సెంటర్లు
- సెమినార్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ స్టాల్

2లో

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో

సిసోడియా అరెస్ట్



రాజ్‌ఘాట్ నుంచి సీబీఐ కార్యాలయానికి వెళుతున్న సిసోడియా

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాను ఆదివారం సీబీఐ అరెస్ట్ చేసింది. కీలకమైన అంశాలపై సిసోడియా సరైన వివరణ ఇవ్వకుండా తప్పించుకున్నందునే అరెస్ట్ చేశామని సీబీఐ అధికారులు వెల్లడించారు. కాగా, తనపై మోపిన తప్పుడు ఆరోపణలపై జైలుకు వెళ్లేందుకైనా భయపడేది లేదని, తాను జైలుకెళ్లినా మద్దతుదారులు తన కుటుంబానికి అండగా నిలుస్తారని సిసోడియా అరెస్ట్ అనంతరం పేర్కొన్నారు.

- వివరాలు 6లో

శ్రీశైల మల్లికార్జునుడి సేవలో సీజేఐ

- సతీసమేతంగా మల్లన్నకు రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహణ
- స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన సీజేఐ దంపతులు
- వారితో పాటు మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన జస్టిస్ నరసింహ దంపతులు

- వివరాలు 2లో



మల్లన్న ఆలయంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు

ఏపీతో ఎంతో లాభం

జీఐఎస్ నేపథ్యంలో రాష్ట్రంలో అవకాశాలపై విస్తృత ప్రచారం

- 974 కి.మీ సుదీర్ఘ తీరప్రాంతంతో తూర్పు దేశాలకు ముఖద్వారం
- అందుబాటులో 6 పోర్టులు.. అదనంగా మరో 4 పోర్టుల నిర్మాణం
- 6 ఎయిర్‌పోర్టులకు అదనంగా మరో రెండు ఎయిర్‌పోర్టుల నిర్మాణం
- చౌక ధరకే తక్షణం అందుబాటులో 46,555 ఎకరాల భూమి
- వరుసగా మూడేళ్లుగా సులభతర వాణిజ్య ర్యాంకుల్లో మొదటి స్థానం
- జనాభాలో 70 శాతం మంది యువతే
- 11.43 శాతం వృద్ధితో రూ.7,46,913 కోట్లకు చేరిన జీఎస్‌డీపీ
- 2021-22లో దేశంలోనే అత్యధికంగా 12.78 శాతం పారిశ్రామిక వృద్ధిరేటు
- పరిశ్రమలకు చేయూతనిచ్చే విధంగా రంగాల వారీగా ప్రత్యేక పాలసీలు



సాక్షి, అమరావతి: విశాఖలో వచ్చే నెల 3, 4వ తేదీల్లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)-2023 ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా కలిగే లాభాల గురించి రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పిస్తోంది. ఇందుకోసం అడ్వాంటేజ్ ఏపీ పేరుతో ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఏర్పాటు చేయడమే కాకుండా దేశ వ్యాప్తంగా పలు మెట్రో నగరాల్లో సన్నాహక సదస్సులు నిర్వహించింది. రాష్ట్రంలో ఉన్న వసతులు, పెట్టుబడులు పెట్టడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ఇన్వెస్టర్లకు వివరించింది. ఏకంగా 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు..
మిగతా 3వ పేజీలో ▸

జీఐఎస్‌తో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం

- సదస్సుకు 7,500 మంది ప్రతినిధుల నమోదు
- 25 దేశాల నుంచి ప్రతినిధుల రాక
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

3లో

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి!

ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు పూర్తయ్యి.. ఇప్పటికీ అదే అడ్రస్‌లో ఉన్నా కూడా కార్డును అప్‌డేట్ చేసుకోవాల్సిందేనని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఏపీలో మొత్తం 5,19,98,236 మందికి ఆధార్ కార్డులుండగా.. వీరిలో 1,65,47,906 మంది పదేళ్లలో ఒక్కసారి కూడా కార్డును అప్‌డేట్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు 27, 28 తేదీల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- వివరాలు 2లో

14న దేశవ్యాప్తంగా నిరసనలు

నవంబర్ 3న ఉద్యోగుల ఛలో ఢిల్లీ

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి
- పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి
- అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ సుభాష్ లాంబా డిమాండ్

- వివరాలు 3లో


పెట్టుబడి సాయంతో రైతులకు భరోసా

- రేపు మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా సాయం పంపిణీ
- 51.12 లక్షల మందికి రూ.1,090.76 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం
- అదే రోజు రైతన్నలకు రూ.76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత

2లో

ఇక్కట్లు ఉండవిక..

చప్పట్లే!



గోదావరి తీరంలో భారీ వాటర్ గ్రిడ్

- రూ.1,400 కోట్ల వ్యయంతో మూడు జిల్లాల్లో 1,250 గ్రామాలకు మంచినీరు
- 26 మండలాల్లో 18.50 లక్షల మందికి మేలు
- చెంతనే గోదావరి ఉన్నా.. సముద్ర తీరంలో మంచినీటికి ఇక్కట్లు
- విజ్జేశ్వరం జలాశయం నుంచి భారీ పైపులైన్ల ఏర్పాటు
- 30 నెలల కాల వ్యవధిలో ప్రాజెక్టు పూర్తి
- పశ్చిమ గోదావరి, రాజమండ్రి జిల్లాల్లో సర్వే పనులు ప్రారంభం
- ఏప్రిల్ మొదటి వారం నుంచి నిర్మాణ పనులు



పశ్చిమగోదావరి జిల్లాలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సర్వే చేస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు : సముద్రతీర ప్రాంతంలో తాగునీటి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వతంగా చెక్ పెడుతోంది. దశాబ్దాలుగా గోదావరి చెంతనే ఉన్నా తీర ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు ఉప్పుకయ్యలుగా మారి తాగునీరు దొరకని పరిస్థితి. వీటికి పరిష్కారం చూపేలా కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో భారీ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును రూపొందించారు. దీని ద్వారా రాజమండ్రి జిల్లా, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాలోని కొన్ని మండలాలు కలుపుకుని మొత్తం 26 మండలాల్లోని 1,250 గ్రామాలకు రక్షిత మంచినీరు అందించనున్నారు. రూ.1,400 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టును కేంద్రం రూ.700 కోట్లు, రాష్ట్రం రూ.700 కోట్ల నిధుల భాగస్వామ్యంతో నిర్మించనున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సముద్ర తీరప్రాంతంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర చేసిన సమయంలో నరసాపురం మొదలుకుని నిడదవోలు వరకు అనేకమంది తాగునీటి ఇబ్బందుల గురించి ఆయనకు విన్నవించారు. దీంతో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

ఏప జిల్లాలకు మేలు అంటే..

రాజమండ్రి జిల్లాలోని నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం, ఉండి, తాడేపల్లిగూడెం, ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, దెందులూరు, కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరులో అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు దీని ద్వారా సురక్షిత తాగునీరు అందనుంది. నాలుగు జిల్లాల్లోని 26 మండలాల్లో 1,250 గ్రామాలకు చెందిన 18.50 లక్షల మందికి దీని ద్వారా తాగునీరు అందుతుంది. ఈ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా దీనికి శాశ్వత పరిష్కారం లభించనుంది.

ఇచ్చిన మాటకు కట్టుబడి వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడంతో పాటు రెండునెలల క్రితం నరసాపురంలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రూ.1,400 కోట్లతో రూపొందించిన ప్రాజెక్టు టెండర్లను మేఘా కంపెనీ రివర్స్ టెండర్ల ద్వారా దక్కించుకుంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.45.75 కోట్లు ఆదా అయింది. ప్రస్తుతం మేఘా కంపెనీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో రాజమండ్రి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో చేపట్టిన సర్వే ప్రక్రియ తుదిదశకు చేరింది. విజ్జేశ్వరం వద్ద ర్యాపిడ్ సాల్ట్ ఫిల్టర్‌తో పాటు మూడు జిల్లాల్లో 62 హెడ్ వాటర్ ట్యాంకులు, పైపులైన్లను ఏర్పాటుచేసే ప్రాంతాలను ఖరారుచేశారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి పనులు ప్రారంభించనున్నారు.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా..

ఇప్పటికే అధికారులు విజ్జేశ్వరం మొదలుకుని కృష్ణా జిల్లాలోని చివరి గ్రామాల వరకు సర్వే పూర్తిచేశారు. ప్రధానంగా విజ్జేశ్వరం జలాశయం వద్ద ఇన్‌టేక్ వెల్‌కమ్ పంప్ హౌస్‌ను నిర్మించే ప్రాంతాన్ని గుర్తించారు. అక్కడే ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్లు, సంపులతో భారీ పంప్‌హౌస్‌ను నిర్మించి నాలుగు జిల్లాల్లో గుర్తించిన 62 ఓవర్‌హెడ్ ట్యాంకులకు గోదావరి జలాలను శుద్ధిచేసి తరలిస్తారు. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. మొత్తంగా 396.517 కిలోమీటర్ల మేర భారీ పైపులను ఏర్పాటుచేసి వాటికి అనుసంధానంగా 2,102.623 కిలోమీటర్ల పైపులను ఏర్పాటు చేస్తారు. 30 నెలల కాలవ్యవధిలో పూర్తయ్యే ఈ ప్రాజెక్టును తరువాత 12 ఏళ్ల పాటు నిర్వాహణ బాధ్యతలు కూడా మేఘా కంపెనీవే.

తుది దశలో సర్వే

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సర్వే పనులు పూర్తయ్యాయి. 30 నెలల కాలంలో పనులు పూర్తిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. తాగునీటి ఎద్దడికి వాటర్ గ్రిడ్ ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పనులు శరవేగంగా జరిగేందుకు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం.
– పి. ప్రశాంతి, జిల్లా కలెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా

తాగునీటి కష్టాలకు పరిష్కారం

రూ.1,400 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాలతో పాటు ఏలూరుకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.
– వై. ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్, ఏలూరు జిల్లా

ఇదండీ సంగతి



కంగ్రాట్స్! మీ మనసులోని మాటను మీరు చెప్పకుండా ఆయనతో చెప్పించారు!!


శ్రీశైల మల్లికార్జునుడి సేవలో సీజేఐ


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న జస్టిస్ నరసింహ దంపతులు

శ్రీశైలం టెంపుల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులకు, జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులకు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం రత్నగర్భగణపతిని దర్శించుకున్నారు. స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు, ఫలపుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి.. మల్లికాగుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీభ్రమరాంబాదేవిని దర్శించుకుని కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద ఉన్న ఆశీర్వచన మండపంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులకు, జస్టిస్ నరసింహ దంపతులకు వేదపండితులు, అర్చకస్వాములు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, తెలంగాణ రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన, కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు, కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతో గవర్నర్ భేటీ





సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఢిల్లీ పర్యటనకు వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మాజీ రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా జస్టిస్ నజీర్‌కు అభినందనలు తెలిపారు.

పెట్టుబడి సాయంతో రైతులకు భరోసా

రేపు మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా సాయం పంపిణీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కింద 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడో విడత సాయం పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో 50,92,579 మంది రైతు కుటుంబాలకు రూ.5,853.74 కోట్ల మేర సాయం జమ చేయగా.. మూడో విడతగా 51,12,453 మందికి రూ.1,090.76 కోట్ల పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తారు. కాగా, గతేడాది మాండూస్ తుపాన్ వల్ల పంట నష్టపోయిన రైతు కుటుంబాలకు రూ.76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని వారి ఖాతాలకు జమ చేయనున్నారు. 2019–20లో 46.69 లక్షల మందికి రూ.6,173 కోట్లు, 2020–21లో 51.59 లక్షల మందికి రూ.6,928 కోట్లు, 2021–22లో 52.38 లక్షల మందికి రూ.7,016.59 కోట్లు జమ చేశారు. కాగా, 2022–23లో మొదటి విడతగా మే నెలలో 50,10,275 మందికి రూ.7,500 చొప్పున రూ.3,757.70 కోట్లు, రెండో విడతగా అక్టోబర్‌లో రూ.4 వేల చొప్పున రూ.2,096.04 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. తాజాగా మూడో విడతగా 51,12,453 మందికి రూ.1,090.76 కోట్లు జమ చేయనున్నారు. ఈ ఏడాది లబ్ధి పొందిన వారిలో భూ యజమానులు 48,97,551 మంది, కౌలుదారులు 1,23,871 మంది, ఆర్‌ఓఎఫ్‌ఆర్ సాగుదారులు 91,031 మంది ఉన్నారు. తాజా సాయంతో కలిపితే ఇప్పటివరకు 51.12 లక్షల మందికి రూ.27,062.09 కోట్ల మేర పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందజేసినట్టవుతుంది.

91,237 మందికి రూ.76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం ఎప్పటికప్పుడే ఇవ్వాలన్న సంకల్పం మేరకు గతేడాది డిసెంబర్‌లో మాండూస్ తుపాన్‌తో పంటలు దెబ్బతిన్న 91,237 మంది రైతులకు రూ.76.99 కోట్ల నష్టపరిహారాన్ని కూడా రైతు భరోసా సాయంతోపాటే రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. మాండూస్ తుపాన్ కారణంగా 78,597 మంది రైతులకు చెందిన 53,685.24 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 12,640 మంది రైతులకు చెందిన 6,764.92 హెక్టార్లలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు లెక్కతేల్చారు. వీటిలో ప్రధానంగా 25,762 హెక్టార్లలో వరి, 15,606 హెక్టార్లలో మినుము, 5,527 హెక్టార్లలో పశుగ్రాసం, 5,257 హెక్టార్లలో పొగాకు, 5,593 హెక్టార్లలో మిరప పంటలున్నాయి. గత మూడున్నరేళ్లలో అకాల వర్షాలు, వరదలు, తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న 21.31 లక్షల మంది రైతులకు రూ.1,834.80 కోట్లు జమ చేశారు. తాజాగా జమ చేయనున్న మొత్తంతో కలిపి 22.22 లక్షల మందికి రూ.1,911.79 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించినట్టవుతుంది.

చెరువులో నాటు పడవ బోల్తా

- ఆరుగురు గల్లంతు.. నలుగురు సురక్షితం
- చిమ్మచీకట్లోనూ కొనసాగుతున్న గాలింపు
- రంగంలోకి దిగిన గజఈతగాళ్లు, అగ్నిమాపక శాఖ, పోలీసులు
- కేరళ నుంచి స్వగ్రామానికి బయల్దేరిన మంత్రి కాకాణి

పొదలకూరు: సరదాగా చెరువులో విహరించాలన్న యువకుల సంతోషం విషాదంగా మారింది. ఒక గ్రామానికి చెందిన పది మంది యువకులు నాటు పడవలో చెరువులో షికారుకెళ్లి ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా బయటపడగా, ఆరుగురు గల్లంతయ్యారు. ఈ ఘోర దుర్ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు కొత్త చెరువులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని గ్రామస్తులందరూ చెరువు వద్దకు చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వివరాలివీ..

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరుకు చెందిన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అట్లా శ్రీనాథ్ (16), మన్నూరు కళ్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాడి సురేంద్ర (16), ఏనుగు విష్ణు (18), ఎ. కిరణ్ (18), ఒంటేరు మహేంద్ర (20), ఒంటేరు మహేష్ (19) సా.5.30 గంటల ప్రాంతంలో చెరువులో నాటు పడవలో షికారుకెళ్లారు. చెరువు మధ్యలోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ. కిరణ్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మిగిలిన ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ సమాచారం తెలుసుకున్న పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్కే కరీముల్లా గజఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన యువకుల ఆచూకీ దొరకలేదు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

హుటాహుటిన తోడేరుకు మంత్రి కాకాణి

మరోవైపు..కేరళ పర్యటనలో ఉన్న మంత్రి కాకాణి సమాచారం తెలిసిన వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. రాత్రికి హైదరాబాద్ చేరుకుని రోడ్డుమార్గంలో తోడేరుకు బయల్దేరారు. చీకట్లో ఓ వైపు గాలింపు చేపడుతూనే మరోవైపు గాలింపు కొనసాగించేందుకు జనరేటర్ తెప్పిస్తున్నారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎస్పీ సీహెచ్ విజయారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి!

అది తీసుకుని పదేళ్లయి, ఇప్పటికీ అదే అడ్రస్‌లోనే ఉన్నా అప్‌డేట్ తప్పనిసరి

- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం లేఖ.. గెజిట్ నోటిఫికేషన్ జారీ
- రాష్ట్రంలో ఆధార్ పొందిన వారు 5.19 కోట్ల మంది
- పదేళ్లలో ఒక్కసారీ అప్‌డేట్ చేసుకోని వారు 1.65 కోట్ల మంది
- కాకినాడ జిల్లాలో వీరు అత్యధికం, బాపట్ల జిల్లాలో అత్యల్పం
- నేడు, రేపు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపుల నిర్వహణ

సాక్షి, అమరావతి: 'ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు పూర్తయి.. ఇప్పటికీ అదే అడ్రస్‌లో ఉన్నా మీరు విధిగా మీ ఆధార్ కార్డును అదే అడ్రస్ ప్రూఫ్‌తో అప్‌డేట్ చేసుకోవాల్సిందే'.. అంటూ ఆధార్ కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ స్పష్టంచేస్తోంది. ఈ విషయమై ఇప్పటికే అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు సైతం రాసింది. ఈ మేరకు ఆధార్ కార్డు జారీ చట్టంలోనూ మార్పులు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా ఇచ్చింది. 'ఆధార్‌ను ఇప్పుడు అనేక ప్రభుత్వ సేవలు పొందేందుకు ఉపయోగిస్తున్నారు. ఆధార్ కార్డు బయోమెట్రిక్ ప్రామాణీకంతోనే సంబంధిత వ్యక్తి గుర్తింపు రుజువుగానూ మారింది. ఎలాంటి సేవలను పొందాలన్నా ప్రతి ఒక్కరూ తమ తాజా వివరాలను యూఐడీఏఐకు సమర్పించాల్సి ఉంటుంది. పదేళ్ల క్రితం ఆధార్‌ను పొందిన వారు, ఇప్పటికీ అదే చిరునామాలో నివసిస్తున్నందునో, లేదా వారి కుటుంబ సభ్యుల వివరాల్లో ఎలాంటి మార్పు లేకపోవడంతో దానిని అప్‌డేట్ చేయకపోవచ్చు. కానీ, సరైన ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయడం ద్వారా వారి చిరునామాను మళ్లీ ధృవీకరించుకోవాలి'.. అంటూ ఆధార్ కార్డు జారీలో కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనపై కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి అలెక్స్ కుమార్ శర్మ ఇప్పటికే అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో స్పష్టంచేశారు. ఆధార్ అప్‌డేట్ సమయంలో ప్రతి ఆధార్ కార్డుదారుడు తమ చిరునామా ధృవీకరణ పత్రంతో పాటు ఫొటో ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



రాష్ట్రంలో అప్‌డేట్ కాని కార్డులు 1.65 కోట్లు..

2022 డిసెంబరు 31 నాటికి రాష్ట్రంలో మొత్తం 5,19,98,236 మందికి ఆధార్ కార్డులు జారీ అయ్యాయి. అయితే, వీరిలో 1,65,47,906 మంది ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నిబంధన మేరకు ఆధార్‌కార్డు పొందిన పదేళ్లలో కనీసం ఒక్కసారి తమ అడ్రస్ వివరాలను అప్‌డేట్ చేసుకోని వారుగా యూఏఐడీఏ గుర్తించింది. రాష్ట్రంలో ఈ కొత్త నిబంధన ప్రకారం ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారు అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18 లక్షల మందికి పైగా ఉండగా, అత్యల్పంగా బాపట్ల జిల్లాలో 1.78లక్షల మంది ఉన్నట్లు తేల్చారు.

ప్రత్యేక క్యాంపులు

ఆధార్ కార్డుల జారీలో ఎప్పటికప్పుడు కొత్తగా వస్తున్న మార్పులకు అనుగుణంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఆధార్ సేవలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. బ్యాంకు లేదా ప్రత్యేక ఆధార్ కార్డు జారీ కేంద్రాలు ఉండే పట్టణాలతో పాటు ఎంపిక చేసుకున్న 2,377 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ ఆ ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరోవైపు.. ఇప్పటి 15 ఏళ్లలోపు, 15–17 ఏళ్ల మధ్య వయస్సున్న వారి బయోమెట్రిక్ వివరాల అప్‌డేట్ కోసం పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రతినెలా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది. అయితే, కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నిబంధన ప్రకారం అన్ని వయస్సుల వారు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి వీలుగా ఆయా సచివాలయాల్లో ఈ నెల 27, 28 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు వెల్లడించారు. ఇక రాష్ట్రంలో గ్రామాల వారీగా పదేళ్ల పూర్తయినా ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను కూడా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు ఇప్పటికే యూఐడీఏఐ నుంచి సేకరించి, ఆ వివరాలను కూడా జిల్లాలకు పంపినట్టు అధికారులు తెలిపారు.

పదేళ్లు పూర్తయినా ఒక్కసారి కూడా తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోని వారు..

జిల్లా	అప్‌డేట్ కానివారు
కాకినాడ	18,09,043
శ్రీకాకుళం	15,77,129
శ్రీ సత్యసాయి	12,07,399
అనంతపురం	11,32,391
అంబేడ్కర్ కోనసీమ	10,03,473
కర్నూలు	8,80,073
తూర్పుగోదావరి	8,16,786
చిత్తూరు	7,53,290
తిరుపతి	7,40,845
ప్రకాశం	6,27,717
నెల్లూరు	5,18,559
అనకాపల్లి	4,79,143
విజయనగరం	4,63,552
విశాఖపట్నం	4,48,348
నంద్యాల	4,18,000
పశ్చిమ గోదావరి	3,85,678
కృష్ణా	3,81,700
అన్నమయ్య	3,80,052
పల్నాడు	3,68,629
వైఎస్సార్	3,61,523
అల్లూరి సీతారామరాజు	3,59,780
పార్వతీపురం మన్యం	3,55,307
ఏలూరు	3,40,504
ఎన్టీఆర్	2,80,898
గుంటూరు	2,79,101
బాపట్ల	1,78,986
మొత్తం	1,65,47,906

ఏపీ స్ఫూర్తితో సాగుతాం

- ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ తెస్తున్నాం
- కౌలురైతుల కోసం సీసీఆర్సీ చట్టం కూడా..
- ఆర్బీకేల తరహాలో వన్‌స్టాప్ సెంటర్లు
- వైగా–2023 అంతర్జాతీయ సదస్సులో కేరళ మంత్రి ప్రసాద్
- సెమినార్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ స్టాల్


ఏపీ వ్యవసాయ శాఖ తరఫున ఏర్పాటు చేసిన స్టాల్‌ను తిలకిస్తున్న కేరళ వ్యవసాయ శాఖ మంత్రి ప్రసాద్ తదితరులు

సాక్షి, అమరావతి: గ్రామ స్థాయిలో రైతులకు సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని కేరళ వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ ప్రశంసించారు. ఏపీ స్ఫూర్తితో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సాగుదారుల హక్కు చట్టం (సీసీఆర్సీ) తీసుకొచ్చేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆర్బీకేల తరహాలో వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్ల ఏర్పాటు దిశగా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా ఆదాయం పొందడంపై వైగా–2023 ఇంటర్నేషనల్ సెమినార్ కేరళలోని తిరువనంతపురంలో ఆదివారం ప్రారంభమైంది. వారం రోజుల పాటు జరగనున్న సెమినార్‌ను ఏపీ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ వ్యవసాయ శాఖల మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.ప్రసాద్, చందర్ కుమార్ ప్రారంభించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో ఏపీ దూసుకెళుతోందని ఈ సందర్భంగా కేరళ వ్యవసాయ శాఖ మంత్రి కొనియాడారు. ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో అందిస్తున్న సేవలు అద్భుతమన్నారు. ల్యాబ్ టూ ల్యాండ్ కాన్సెప్ట్ కింద ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలను అధ్యయనం చేస్తున్నామని, తమ రాష్ట్రంలోనూ ఆచరణలోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీఎం జగన్ ఆలోచనల ఫలితమే ఆర్బీకేలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, ఆయన ఆలోచనల నుంచి పుట్టినవే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలని సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆర్బీకేల ద్వారా పాడి, మత్స్య,డెయిరీ, బ్యాంకింగ్ సేవలన్నీ అందిస్తున్నామన్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన ఇన్‌పుట్స్ అందించేందుకు నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ నెలకొల్పామన్నారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఆక్వా రంగానికి సబ్సిడీ విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఉచిత పంటల బీమా, వడ్డీలేని పంట రుణాలు, సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ), రైతు క్షేత్రం వద్దే పంట ఉత్పత్తుల కొనుగోలు చేపట్టామన్నారు. రైతులను ఆదుకునేలా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆకట్టుకున్న ఏపీ స్టాల్

వైగా–2023 ఇంటర్నేషనల్ సెమినార్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్బీకే నమూనాతో పాటు వ్యవసాయ–అనుబంధ రంగాలలో తీసుకొచ్చిన సంస్కరణలు, గ్రామ స్థాయిలో అందిస్తున్న సేవలను కళ్లకు కట్టినట్టుగా స్టాల్ ద్వారా ప్రదర్శించారు. సెమినార్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల మంత్రులు, ముఖ్య కార్యదర్శులు ఏపీ స్టాల్‌ను సందర్శించి ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో మంత్రి కాకాణితో పాటు ఏపీ ఉద్యాన, మార్కెటింగ్ శాఖ కమిషనర్లు డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్, రాహుల్ పాండే, ఏపీసీడ్స్ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు సూపర్

▶ మొదటి పేజీ తరువాయి

ఇటీవల తెలిపింది.

ఏపీలో 100 శాతం.. దేశంలో 45.1 శాతం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా అవన్నీ నూటికి నూరు శాతం 24 గంటలు పని చేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. సిక్కింలో 24 పీహెచ్‌సీలుండగా 24 గంటల పాటు సేవలందిస్తున్నాయి. ఇక దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 24,935 పీహెచ్‌సీలుండగా 11,250 పీహెచ్‌సీలు మాత్రమే (45.1 శాతం) 24 గంటలు పని చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు, సేవలను మెరుగుపరచేందుకు ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్‌– 2022ను నిర్దేశించినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. ఇందులో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, డయాగ్నస్టిక్స్, పరికరాలు, మందులు తదితరాలకు సంబంధించిన నిబంధనలున్నాయి. అందుకు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది.

మూడున్నరేళ్లలో పెను మార్పులు..

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడున్నరేళ్లలో ప్రజారోగ్య రంగంలో పెను మార్పులు చోటు చేసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2019 – 20 నుంచి 2021 – 22 మధ్య మూడేళ్లలో ఏపీలో పెద్ద ఎత్తున ఆస్పత్రులు ఏర్పాటైనట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. రాష్ట్రంలో 11,480 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. దేశంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా సబ్ హెల్త్ సెంటర్లున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 20,781 సబ్ హెల్త్ సెంటర్లు ఉండగా రాజస్థాన్‌లో 13,589 సబ్ హెల్త్ సెంటర్లున్నాయి. ఇక ఏపీలో మూడున్నరేళ్లలో కొత్తగా 304 పీహెచ్‌సీలు ఏర్పాటు కాగా మరో 179 కేంద్రాల పనులు ఇప్పటికే ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి.



47 వేలకుపైగా పోస్టుల భర్తీ

రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణ పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న శ్రద్ధకు కేంద్ర ప్రభుత్వ గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు చొప్పున డాక్టర్ల సేవలను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న విషయం విదితమే. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీ లేకుండా రికార్డు స్థాయిలో 47 వేలకుపైగా పోస్టులను వైద్య ఆరోగ్యశాఖలో భర్తీ చేశారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలను మారుస్తూ పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణంతో పాటు ఇప్పటికే సేవలందిస్తున్న వైద్య కళాశాలల ఆధునీకరణ చేపట్టారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, కేన్సర్ ఆస్పత్రి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16,222.85 కోట్లను వ్యయం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆధ్వర్యంలోని వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులను కేటాయించడంతోపాటు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ ప్రజలకు ఆరోగ్య బీమాను కల్పిస్తున్నారు.

గ్రామీణ పీహెచ్‌సీల్లో 24 గంటలు సేవలందిస్తున్న ప్రధాన రాష్ట్రాలు ఇలా

రాష్ట్రం పేరు	పీహెచ్‌సీల సంఖ్య	24 గంటల సేవలందిస్తున్న పీహెచ్‌సీలు	శాతం
ఆంధ్రప్రదేశ్	1142	1142	100
సిక్కిం	24	24	100
మణిపూర్	74	72	97.3
తమిళనాడు	1422	1316	92.5
త్రిపుర	108	93	86.1
జార్ఖండ్	291	216	74.2
మిజోరం	57	41	71.9
మధ్యప్రదేశ్	1266	791	62.5
చండీగఢ్	770	477	61.9
హరియాణ	394	242	61.4
ఉత్తరప్రదేశ్	2919	1775	60.8
తెలంగాణ	578	285	49.3
పంజాబ్	422	206	48.8
కర్ణాటక	2138	904	42.3
బిహార్	1492	630	42.2
రాజస్తాన్	2133	810	38.0
గుజరాత్	1474	504	34.2
పశ్చిమబెంగాల్	915	229	20.0
కేరళ	780	159	20.4
మహారాష్ట్ర	1853	248	13.4

'ఈనాడు' తప్పుడు రాతలపై నిరసన జ్వాలలు



కర్నూలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనాడుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నేతలు.. పత్రిక ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం


విశాఖలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు


ఒంగోలులో ఈనాడు ప్రతులకు నిప్పు పెడుతున్న విద్యార్థి విభాగం నాయకులు


గుంటూరులో ఈనాడుకు వ్యతిరేకంగా ప్లకార్డులతో విద్యార్థుల నిరసన

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

- జిల్లా కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసనలు
- కర్నూలులో ర్యాలీ.. కుప్పంలో ప్రతుల దహనం
- విజయవాడ, విశాఖలో ఈనాడుకు వ్యతిరేకంగా నినాదాలు
- ఆ పత్రికను బహిష్కరించాలని వివిధ సంఘాల నేతల పిలుపు
- సోషల్ మీడియా యుగంలో రామోజీ పప్పులుడకవని ధ్వజం

సాక్షి, అమరావతి: లేనిది ఉన్నట్లు.. ఉన్నది లేనట్లుగా చూపి జర్నలిజం విలువలను మంటగలుపుతోన్న 'ఈనాడు' తీరును అందరూ వ్యతిరేకించాలని ప్రజాస్వామ్యవాదులు పిలుపు నిచ్చారు. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా, కొట్టారని పాత ఫొటోలతో ప్రజలను మోసం చేసిన ఈనాడు దిగజారుడు పాత్రికేయ విలువలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఆదివారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, వివిధ సంఘాల నేతలు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈనాడు తీరును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈనాడు దినపత్రిక విషపు, అబద్ధపు వార్తల నుంచి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నేత పానుగంటి చైతన్య మాట్లాడుతూ.. రోజూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం కక్కుతూ తప్పుడురాతలు ప్రచురిస్తూ రామోజీరావు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పేద ప్రజల అభివృద్ధి కోసం సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వ్యతిరేక వార్తలు రాయడం రామోజీ దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. ఇలాంటి అబద్ధపు వార్తలు ప్రచురిస్తున్న రామోజీరావు వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు వార్తలు ప్రచురిస్తున్న ఈనాడు పత్రికను బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రామోజీ క్షమాపణ చెప్పాలి

కర్నూలు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నేతల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొండారెడ్డి బురుజు వద్ద ఈనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేసి, అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట, కడప సెవన్ రోడ్స్ సెంటర్‌లో, సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈనాడు పత్రిక ప్రతులను తగులబెట్టారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనాడు దిగజారుడు రాతల పట్ల నిరసన తెలిపారు. ఒంగోలులో నిరసన కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్‌ను గద్దె దించి చంద్రబాబుకు పట్టం కట్టడంలో సక్సెస్ అయిన రామోజీ ఆటలు.. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో సాగవని.. ఇప్పుడు ఆయన పప్పులు ఉడకవని ధ్వజమెత్తారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద, గుంటూరు నగరంలోని లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈనాడు తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఏలూరు పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఈనాడు వైఖరిని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. విశాఖపట్నం జిల్లా ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విజయనగరంలో రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని ఊళ్లలోనూ ఈనాడు చేసిన తప్పునకు రామోజీ క్షమాపణ చెప్పాలని ప్రజలు, విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

విద్యపై ఏపీ ప్రభుత్వం కృషి అభినందనీయం

- విద్యపై ఎంత ఖర్చుపెట్టినా నష్టం ఉండదు
- జర్మనీ దేశ మాజీ ఎంపీ, మాజీ మేయర్ డాక్టర్ గుజ్జుల రవీంద్ర



గుజ్జుల రవీంద్రను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: విద్యాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం చేస్తోన్న కృషి అభినందనీయమని జర్మనీలోని బ్రాండెన్‌బర్గ్ మాజీ ఎంపీ, అట్‌ల్యాండ్స్‌బగ్ మాజీ మేయర్ డాక్టర్ గుజ్జుల రవీంద్ర అన్నారు. పల్నాడు జిల్లా నడికుడి మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి నివాసంలో రవీంద్ర దంపతులను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం కలిసి సన్మానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. విద్యపై ఎంత ఖర్చు పెట్టినా ఎప్పటికీ వృథా కాదన్నారు. ఇప్పటికిప్పుడు ఫలితాలు రాకపోయినా రానున్న రోజుల్లో వచ్చే ఫలాలను ప్రజలు అనుభవిస్తారని చెప్పారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా ప్రభుత్వం తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. పుట్టిపెరిగిన ఊరితోపాటుగా ఉమ్మడి ఏపీలో తమవంతు సామాజిక సేవ, విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లో తమ ట్రస్ట్ ద్వారా అంగన్‌వాడీ అనే ప్రాజెక్ట్‌ను చేపట్టామని, ఏపీలో కూడా ఇటువంటి ప్రాజెక్ట్‌లు చేపడతామని వెల్లడించారు. రవీంద్ర సతీమణి, అట్‌ల్యాండ్స్‌బగ్ డిప్యూటీ మేయర్ గాబ్రియేల్ మాట్లాడుతూ..దేశంలోని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించటం అభినందనీయమన్నారు.

లోకేశ్ పిల్లిబిత్తిరిగాడు

- వీరి వల్ల కాదనే జూనియర్ ఎన్టీఆర్‌ని పిలుస్తున్నారు
- మంత్రి ఆర్‌కే రోజా



సాక్షి, తిరుపతి: లోకేశ్ పిల్లిబిత్తిరిగాడు అని మంత్రి ఆర్‌కే రోజా ఎద్దేవా చేశారు. తిరుపతిలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్రకు జనాలు రావడానికే భయపడుతున్నారని, యువత పారిపోతున్నారని చెప్పారు. పాదయాత్రలో పది మంది నాయకులు లేరు.. అది ఫెయిల్యూర్ యాత్ర అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నందమూరి కుటుంబం గుర్తుకురాలేదని, కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే వారు గుర్తుకొస్తారని విమర్శించారు. చంద్రబాబు, లోకేశ్‌లు టీడీపీని లాక్కున్న దొంగలని, ఆ పార్టీ పెట్టిన వ్యక్తి మనవడిని లోకేశ్ ఆహ్వానించడం దారుణమన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ వల్ల ఉపయోగం లేదనే జూనియర్ ఎన్టీఆర్‌ను పిలుస్తున్నారని విమర్శించారు. టీడీపీతో ఉండాలని పవన్ కళ్యాణ్‌ను ఆంధ్రజ్యోతి ద్వారా బ్లాక్ మెయిల్ చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు వెయ్యి కోట్లకు అమ్ముడు పోయే నేత అని రాస్తున్నా.. పవన్ ఎందుకు స్పందించడం లేదని, చెప్పు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. నాడు పీఆర్పీని ఆకాశానికి ఎత్తి, ఆపై విషపు రాతలు రాసినట్టుగానే.. జన సేన విషయంలోనూ చేస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా వివరించారు. చంద్రబాబు, లోకేశ్‌లకు దమ్ముంటే చిత్తూరు జిల్లా నుంచి పోటీ చేయాలని ఆమె సవాల్ విసిరారు.

బెంగళూరులో వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

- 6 కిటికీల అద్దాలు పాక్షికంగా ధ్వంసం
- కేసు నమోదు చేసిన పోలీసులు



పగిలిన ఓ బోగీ అద్దం

కృష్ణరాజపురం (బెంగళూరు): బెంగళూరులో గుర్తుతెలియని దుండగులు చెన్నై– మైసూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పైన రాళ్లు విసరడంతో అద్దాలు పగుళ్లు ఇచ్చాయి. శనివారం రాత్రి 10:30 గంటలకు ఈ ఘటన జరిగింది. చెన్నై నుంచి బెంగళూరుకు వస్తున్న రైలు కృష్ణరాజపురం, కంటోన్మెంట్ రైల్వే స్టేషన్ల మధ్య దుండగులు రాళ్లను విసరడంతో 6 కిటికీల అద్దాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో రైలు సుమారు 90 కి.మీ.వేగంతో ప్రయాణిస్తోంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. రైలు సిబ్బంది సమాచారం ఇవ్వడంతో రైల్వే, స్థానిక పోలీసులు గాలింపు చేపట్టగా దుండగులు దొరకలేదు. కేసు విచారణలో ఉంది.

కూరగాయలకు భారీ డిమాండ్



2030 నాటికి దేశంలో 32 మిలియన్ టన్నుల కొరత

- అప్పటికి డిమాండ్ 192 మిలియన్ టన్నులు
- ఉత్పత్తి అయ్యేది 160 మిలియన్ టన్నులే
- 2030 నాటికి 9.9 మిలియన్ టన్నుల పండ్ల కొరత
- మాంసం 1.2 మిలియన్ టన్నుల కొరత
- చేపలు, పాలు, గుడ్లకు కొరత లేదు
- నాబార్డు పరిశోధన అధ్యయన నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో కూరగాయలకు డిమాండ్ భారీగా పెరగనుంది. 2030 నాటికి దేశంలో కూరగాయల కొరత ఏర్పడుతుందని, దేశంలో అవసరాలకు తగినంతగా ఉత్పత్తి ఉండదని జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు) అధ్యయన నివేదిక వెల్లడించింది. అలాగే మాంసం, పండ్లకు కూడా స్వల్పంగా కొరత ఏర్పడుతుందని పేర్కొంది. 2030 నాటికి దేశంలో పెరుగుతున్న జనాభాకు తగినట్లు కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్లు, పాలు ఉత్పత్తి పెరుగుతుందా లేదా అనే అంశంపై నాబార్డు అంచనా వేసింది. పంట తరువాత వృథాను కూడా తీసివేసిన తరువాత డిమాండ్, లభ్యతను లెక్కగట్టింది. 2030వ సంవత్సరానికి దేశంలో కూరగాయల డిమాండ్ 192 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని, అయితే లభ్యత 160 మిలియన్ టన్నులు మాత్రమే ఉంటుందని అంచనా వేసింది. అంటే ఏకంగా 32 మిలియన్ టన్నుల కూరగాయల కొరత ఉంటుంది. అప్పటికి దేశంలో 103 మిలియన్ టన్నుల పండ్లు అవసరమైతే 93.1 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతాయని తెలిపింది. 9.9 మిలియన్ టన్నుల పండ్ల కొరత ఏర్పడుతుందని పేర్కొంది. ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో 5.54 శాతం వాటాతో భారతదేశం రెండో స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. ఎగుమతులు చేసినప్పటికీ, చేపల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధిని సాధిస్తుందని చెప్పింది. 2030 నాటికి చేపల డిమాండ్ 11.1 మిలియన్ టన్నులు ఉంటుందని, ఉత్పత్తి అంతకంటే కొంచెం ఎక్కువగా 11.9 మిలియన్ టన్నులు ఉంటుందని వెల్లడించింది. గుడ్లు 5.8 మిలియన్ టన్నులు డిమాండ్ ఉండగా లభ్యత 5.9 మిలియన్ టన్నులు ఉంటుందని పేర్కొంది. అదేవిధంగా పాలకు కొరత ఉండదని, అవసరానికంటే పాల ఉత్పత్తి ఎక్కువే ఉంటుందని వివరించింది. మాంసం అవసరానికంటే లభ్యత 1.2 మిలియన్ టన్నులు తక్కువ ఉంటుందని నివేదిక తెలిపింది. రైతులు పండించిన పంటలకు రవాణా వ్యయం తగ్గించేందుకు మార్కెటింగ్‌లో సమష్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. సన్న, చిన్న కారు రైతులతో సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించింది. కాంట్రాక్టు వ్యవసాయాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రైతులకు మంచి ధరలకు హామీ లభిస్తుందని నివేదిక పేర్కొంది. వివిధ సమస్యలను అధిగమించేలా ఒప్పంద వ్యవసాయం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని నివేదిక సూచించింది.

2030 నాటికి వివిధ ఆహార ఉత్పత్తుల డిమాండ్, లభ్యత, వ్యత్యాసం (మిలియన్ టన్నుల్లో..)



వస్తువు	డిమాండ్	లభ్యత	వ్యత్యాసం
కూరగాయలు	192	160	- 32
పండ్లు	103	93.1	- 9.9
పాలు	170.4	179.2	+ 8.8
మాంసం	9.2	8	- 1.2
గుడ్లు	5.8	5.9	+ 0.1
చేపలు	11.1	11.9	+ 0.8

గురుకులాల్లో ఆరోగ్య పరీక్షలు

- విద్యార్థులకు సత్వర చికిత్స
- పోషకాహార లోపం, రక్తహీనత నివారణ చర్యలు
- నేత్ర, దంత, మానసిక వైద్య సేవలు



గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు విద్యార్థులకు మేలు చేస్తున్నాయి. విద్యార్థులకు ప్రతి వారం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు వారి ఆరోగ్య సమస్యల్ని గుర్తించి సత్వర చికిత్సను అందిస్తున్నారు. పేద పిల్లలు కావడంతో పోషకాహారం అందక రక్తహీనత వంటి సమస్యలతో బాధపడే వారిని గుర్తించి చికిత్సను అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ 185 గురుకులాల్లో విద్యార్థులకు ఎనీమియా, పోషకాహార లోపానికి సంబంధించిన వైద్య పరీక్షలు పూర్తి చేశారు. మరోవైపు విద్యార్థుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా పోషక విలువతో కూడిన ప్రత్యేక మెనూను అమలు చేస్తున్నారు. దృష్టిలోపంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. వైఎస్సార్ కంటి వెలుగు బృందాలతో ఇప్పటివరకు 91 గురుకులాల్లో నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో కంటి సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. మిగిలిన గురుకులాల్లోనూ నేత్ర పరీక్షలను కొనసాగిస్తున్నారు. దంత సమస్యలను గుర్తించేందుకు ఇప్పటివరకూ 68 గురుకులాల్లో పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. మిగిలిన వాటిలోనూ దంత పరీక్షలు కొనసాగుతున్నాయి. కౌమార దశలోని బాలికలకు సమాజంలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలపై అవగాహన కల్పించేలా 'వాయిస్ ఫర్ గరల్స్ సంస్థ' ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన 800 మంది బాలికలకు ఇప్పటికే ఈ శిక్షణ పూర్తి చేశారు. విద్యార్థులలో మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి వీలుగా బోధన, బోధనేతర సిబ్బందికి ముంబైకి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

గురుకులాల్లో విద్యతోపాటు వైద్యం.. పోషకాహారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గురుకులాల్లో చదివే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పేద పిల్లల పెద్ద చదువులకు వారధిగా నిలుస్తున్న అంబేడ్కర్ గురుకులాల్లో విద్యతోపాటు వైద్యం, పోషకాహారం అందించేలా ప్రత్యేక దృష్టి సారించాం. ప్రధానంగా నేత్ర, దంత, పోషకాహార లోపం, రక్తహీనత, మానసిక వైద్య సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆడ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి తగిన అవగాహన కల్పించి చైతన్యం తెచ్చేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

ఏపీతో ఎంతో లాభం

▶ మొదటి పేజీ తరువాయి

సహజ వనరులను వినియోగించుకోవడం ద్వారా నిర్వహణ వ్యయం ఏ విధంగా తగ్గనుందన్న విషయాన్ని జీఐఎస్‌లో ప్రధానంగా వివరించనుంది. మలేషియా, సింగపూర్ వంటి తూర్పు దేశాలకు ముఖ ద్వారంగా ఆంధ్రప్రదేశ్ అత్యంత సమీపంగా ఉండటంతో తీర ప్రాంత వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కీలక ప్రాజెక్టులను చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశాఖలో మేజర్ పోర్టుతో పాటు గంగవరం పోర్టు, కాకినాడ పోర్టు, కాకినాడ యాంకరేజ్ పోర్టు, రవ్వ క్యాపిటివ్ పోర్టు, కృష్ణపట్నం పోర్టుతో కలిపి ఆరు పోర్టులు నిర్వహణలో ఉన్నాయి. ఇప్పుడు వీటికి అదనంగా సుమారు రూ.30,000 కోట్లతో మూడు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తోంది. రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడుల్లో రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా పోర్టుల నిర్మాణం చేపట్టగా, కాకినాడ గేట్‌వే పోర్టు పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మరో పోర్టు నిర్మాణం చేపడుతోంది. ఈ పోర్టులను జాతీయ రహదారులు, రైల్వే లైన్లతో అనుసంధానం చేయడమే కాకుండా పోర్టు సమీపంలోనే పరిశ్రమలు ఏర్పాటయ్యేలా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఆరు ఎయిర్‌పోర్టులు.. గన్నవరం, విశాఖ, రాజమండ్రి, కర్నూలు, కడప, తిరుపతిలకు అదనంగా భోగాపురం, రామాయపట్నం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి పూనుకుంది. తద్వారా వేగంగా ఎగుమతులు, దిగుమతులతో పాటు లాజిస్టిక్ వ్యయాలు భారీగా తగ్గనున్నాయి.

చౌక ధరలకే వేల ఎకరాలు

తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత చౌకగా వేలాది ఎకరాల భూములు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, చెన్నై–బెంగళూరు, బెంగళూరు–హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. ఈ మూడు కారిడార్లలో పలు చోట్ల ప్రభుత్వం అన్ని మౌలిక వసతులతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఈ కారిడార్ల పరిధిలో 46,555 ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయి. విశాఖ–చెన్నై కారిడార్ పరిధిలో అచ్యుతాపురం, నక్కపల్లి, కడప, చిత్తూరు నోడ్స్‌ను అభివృద్ధి చేస్తుండగా, చెన్నై–బెంగళూరు కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద, బెంగళూరు–హైదరాబాద్ కారిడార్ పరిధిలో ఓర్వకల్లు వద్ద భారీ పారిశ్రామిక పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేసిన కడప నోడ్‌లో ఎకరం రూ.12 నుంచి రూ.15 లక్షలకే లభిస్తుందనే విషయాన్ని విశాఖ సమ్మిట్‌లో ప్రధానంగా వివరించనుంది.

రంగాల వారీగా ప్రత్యేక పాలసీలు

రాష్ట్రంలోని 5 కోట్ల జనాభాలో 70 శాతం మంది యువతీ యువకులే. అమెరికాలో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో 25 శాతం మంది తెలుగు మాట్లాడే వారే. ఈ లెక్కన పుష్కలంగా నైపుణ్యం ఉన్న మానవ వనరులు ఎంతగా అందుబాటులో ఉన్నాయనేది స్పష్టమవుతోంది. దీనికి తోడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండటం ప్రధానంగా ఇన్వెస్టర్లు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం. 2021–22లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ (జీఎస్‌డీపీ) 11.43 శాతం వృద్ధితో రూ.7,46,913 కోట్లకు చేరింది. ఇదే సమయంలో రాష్ట్ర పారిశ్రామిక రంగంలో 12.78 శాతం వృద్ధి నమోదైంది. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ సమర్థ పరిపాలనను తెలియజేస్తున్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం 2023–28 నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించడంతోపాటు వివిధ రంగాలను ప్రోత్సహించే విధంగా ప్రత్యేక పాలసీలను తీసుకొచ్చింది. లాజిస్టిక్ పాలసీ 2022–27, రెన్యువబుల్ ఎనర్జీ ఎక్స్‌పోర్ట్ పాలసీ 2020–25, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రమోషన్ పాలసీ–22, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ పాలసీ 2020–25, టూరిజం పాలసీ 2020–25, ఏపీ రిటైల్ పార్క్ పాలసీ 2021–26.. ఇలా అనేక పారిశ్రామిక పాలసీను ప్రవేశపెట్టింది. వీటన్నింటి దృష్ట్యా పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా తగిన రాష్ట్రమని విశాఖ సమ్మిట్‌లో ప్రభుత్వం వివరించనుంది.

జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న భూములు

■ జిల్లా ■ అందుబాటులో ఉన్న భూమి (ఎకరాల్లో)

జిల్లా	భూమి (ఎకరాల్లో)
శ్రీకాకుళం	1,311
విజయనగరం	319
విశాఖపట్నం	1,754
అనకాపల్లి	8,380
కాకినాడ	400
ఏలూరు	431
ఎన్టీఆర్	1,048
కృష్ణ	700
పల్నాడు	177
బాపట్ల	65
ప్రకాశం	1,419
నెల్లూరు	1,154
వైఎస్సార్	6,211
తిరుపతి	12,399
చిత్తూరు	1,493
అన్నమయ్య	1,061
శ్రీ సత్యసాయి	2,745
అనంతపురం	1,058
కర్నూలు	3,794

జీఐఎస్‌తో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం



జీఐఎస్ సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, అధికారులు

సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ (జీఐఎస్)తో రాష్ట్ర ముఖచిత్రం మారనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఇప్పటివరకు 25 దేశాలకు చెందిన 7,500 మంది పారిశ్రామిక దిగ్గజాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక దిగ్గజాలు ముఖేష్ అంబానీ, అదానీ, టాటా, బిర్లా, జీఎంసీ గ్రూపుల అధినేతలు కూడా హాజరుకానున్నారని వెల్లడించారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో మార్చి 3, 4 తేదీల్లో జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ ఈ సదస్సుతో రూ.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. సుదీర్ఘమైన తీరప్రాంతం, విశాఖ వంటి ప్రశాంతమైన నగరం, అందుబాటులో ఉన్న యువత వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేలా చేస్తాయని వివరించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పరిశ్రమలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్, డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

మీ దస్తావేజు.. మీరే సొంతంగా..

స్వయంగా తయారు చేసుకునేలా పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం

- త్వరలో అందుబాటులోకి తెస్తున్న రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆన్‌లైన్‌లోనే స్టాంప్ డ్యూటీ చెల్లింపు, స్లాట్ బుకింగ్
- ఆ ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేగంగా రిజిస్ట్రేషన్
- సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా మారుస్తున్న రిజిస్ట్రేషన్ల శాఖ
- ప్రజలకు సమయం ఆదా, మధ్యవర్తుల ప్రమేయానికి తెర
- దస్తావేజుల్లో తప్పులు, అవకతవకలకు ఆస్కారం ఉండదు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ల విధానం మరింత సులభతరం కానుంది. ఎవరి దస్తావేజును వారే తయారు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పబ్లిక్ డేటా ఎంట్రీ విధానాన్ని అందుబాటులోకి తేనుంది. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తోంది. ప్రస్తుతం ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం వినియోగదారులు డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడాల్సి వస్తోంది. వారి వద్ద దస్తావేజుల్లో తమ రిజిస్ట్రేషన్ వివరాలు (ఆస్తి వివరాలు, కొనుగోలుదారు, విక్రయదారు, ఆధార్ నెంబర్లు తదితరాలు) నమోదు చేసుకుని ప్రభుత్వానికి చలానాలు కూడా వారి ద్వారానే చెల్లించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వస్తున్నారు. అక్కడ ఆ డాక్యుమెంట్‌ను పరిశీలించి రిజిస్టర్ చేస్తున్నారు. ఈ క్రమంలో డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం అధికంగా ఉండడంతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ఉపయోగపడుతుందని రిజిస్ట్రేషన్ల శాఖ సీఏఆర్‌డీ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) డీఐజీ రవీంద్రనాథ్ వివరించారు. దీనివల్ల డాక్యుమెంట్ రైటర్ల వద్దకు వెళ్లకుండా 'ఐజీఆర్ఎస్' వెబ్‌సైట్‌లో స్వయంగా తమ డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు. ఎవరి రిజిస్ట్రేషన్ డేటాను వారే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపులు

రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీల చలానాలు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించే సౌలభ్యం కల్పించనున్నారు. ప్రస్తుతం ఇందుకు మూడు రకాల చలానాలు బ్యాంకులో కట్టాల్సి వస్తోంది. ఈ మూడింటిని కలిపి ఒకేసారి ఆన్‌లైన్‌లో చెల్లించే వీలు కల్పించనున్నారు. అనంతరం ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ సమయాన్ని ఎంపిక చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్, పేమెంట్ రశీదుతో జారీ చేసే యూనిక్ ఐడీతో నిర్దేశిత సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే పరిశీలించి ఆధార్ వెరిఫికేషన్ చేస్తారు. సంబంధిత వ్యక్తుల ఫొటోలు, వేలిముద్రలు తీసుకుని ఒరిజినల్ పత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కోసం 45 నిమిషాలు పడుతుండగా పబ్లిక్ డేటా ఎంట్రీ, ఆన్‌లైన్‌లోనే చెల్లింపుల ద్వారా 10 నిమిషాల్లో పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఒకవేళ డేటా ఎంట్రీ అనంతరం ఏమైనా సరిదిద్దుకోవాలన్నా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుంది.

నేరుగా వచ్చినా రిజిస్ట్రేషన్లు..

డేటా ఎంట్రీ, స్లాట్ బుకింగ్ లేకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వారికి కూడా రిజిస్ట్రేషన్ చేస్తారు. వీరి డేటా ఎంట్రీని అక్కడి సిబ్బంది చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లను పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారానే చేస్తున్నారు. ఈ డేటా ఎంట్రీని మున్సిపల్ శాఖ చేస్తున్నా అదే విధానంలో సాధారణ రిజిస్ట్రేషన్లకు వర్తించేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నారు. వివాహాల రిజిస్ట్రేషన్లను కూడా ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు. ఇది మంచి ఫలితం ఇవ్వడంతో సాధారణ రిజిస్ట్రేషన్లకు వర్తింపచేస్తున్నారు.

పబ్లిక్ డేటా ఎంట్రీతో పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు



పబ్లిక్ డేటా ఎంట్రీ వల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్ల విధానం పారదర్శకంగా ఉంటుంది. ప్రజలు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. దళారుల ప్రమేయం, అవకతవకలకు ఆస్కారం ఉండదు. తక్కువ సమయంలో ఎక్కువ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయవచ్చు. త్వరలో ఈ విధానాన్ని అందుబాటులోకి తెస్తాం.

– వి.రామకృష్ణ, కమిషనర్, ఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

14న దేశవ్యాప్తంగా నిరసనలు



మాట్లాడుతున్న సుభాష్‌లంబా. పక్కన ఉద్యోగ సంఘాల నాయకులు

సాక్షి, అమరావతి/కృష్ణలంక (విజయవాడ తూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 14న దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) చైర్మన్ సుభాష్ లాంబా తెలిపారు. అలాగే, పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా నవంబర్ 3న 'ఛలో ఢిల్లీ' నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడ ఎంబీ భవన్‌లో ఆదివారం ఏఐఎస్‌జీఈఎఫ్, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, కార్మికుల సమాఖ్య సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నవంబర్ 3న అన్ని రాష్ట్రాల నుంచి ఉద్యోగులు ఢిల్లీ వెళ్లి భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ విధానంతో ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వారికి లీజుకిచ్చేలా ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, దీనివల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్‌స్టేషన్లను ప్రైవేటు వారికి అప్పగించాలని చూస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒకసారి గెలిస్తేనే వారికి పెన్షన్ ఇస్తున్నారని, సుదీర్ఘకాలం ప్రభుత్వంలో పనిచేసిన ఉద్యోగులకు మాత్రం పెన్షన్‌ను తొలగించాలని చూడడం అన్యాయమని.. అందుకే వీటికి వ్యతిరేకంగా మార్చి 14న దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతామన్నారు. ఏఐఎస్‌జీఈఎఫ్ జనరల్ సెక్రటరీ శ్రీకుమార్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం అమలుచేయడం అప్రజాస్వామికమని, అమానుషమని అన్నారు. సదస్సుకు ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీ ఎన్జీఓ సంఘ ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ హృదయరాజు, ఏఐఎస్‌జీఈఎఫ్ కన్వీనర్ ఎం.రాజ్యలక్ష్మి, సభ్యురాలు శాంతిశ్రీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఉద్యమం

- మార్చి 9 నుంచి ఏప్రిల్ 4 వరకు కార్యాచరణ
- ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెల్లడి



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సిద్ధపడుతున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈ నెల 27 నుంచి సంఘాల మద్దతు కూడగడతామని, మార్చి 9 నుంచి ఉద్యమ కార్యాచరణ ప్రారంభించి దశల వారీగా ఏప్రిల్ 4 వరకు కొనసాగిస్తామని తెలిపారు. ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో జరిగిన ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి 9, 10 తేదీల్లో ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని, 13, 14 తేదీల్లో కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. 15, 17, 20 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద మహా ధర్నాలు, 21న సెల్‌డౌన్, 24న రాష్ట్రస్థాయిలో అన్ని కమిషనర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ఏప్రిల్ 1న పదవీ విరమణ చేసిన కుటుంబాలు, అతి తక్కువ పెన్షన్ పొందుతున్న ఉద్యోగుల కుటుంబాలు, సీపీఎస్ ఉద్యోగులను కలుస్తామని చెప్పారు. ఏప్రిల్ 3న ఛలో కలెక్టరేట్ల ద్వారా ఉద్యోగుల సమస్యలతో గ్రీవెన్స్ డే నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. అలాగే, ఏప్రిల్ 5న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగులకు చాలా అన్యాయం జరిగిందన్నారు. పదవీ విరమణ చేసిన, మృతి చెందిన ఉద్యోగులకు ఎలాంటి ఆర్థికపరమైన బెనిఫిట్స్ అందడంలేదని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణంనాయుడు పాల్గొన్నారు.



దేన్నయినా గతం నుంచి చూడవద్దు.
భవిష్యత్ కోణంలో చూడాలి.
– ఓషో

సాక్షి
సోమవారం, ఫిబ్రవరి, 27

బౌద్ధసాగరం

దేనికైనా మధ్యేమార్గంలో పోవాలంటారు పెద్దలు. అతివాదాలు ప్రపంచానికి వినాశనకరం. ఈ మధ్యేమార్గం బౌద్ధం నుంచి ప్రజల్లోకి వచ్చిన భావధార. ఇంతకీ మధ్యేమార్గం అంటే ఏమిటి? మధ్యమాప్రతిపద్ అని సంస్కృతంలో, మజ్జిమాపతిపదా అని పాళీలో పిలిచే ఈ మార్గం 'రెండు అంత్యాలను వదిలి, ఆ అంత్యాన్నో ఈ అంత్యాన్నో కౌగిలించుకోకుండా, అంటే మరీ అతికి పోకుండా, మధ్య దారిలో పోవాలని చెబుతుంది.' 'సత్యం, ఆ అంత్యంలోనో, ఈ అంత్యంలోనో కాక మధ్యలో ఉంటుందనే భావనను బౌద్ధ సిద్ధాంతాలకు అన్వయించడం జరిగిం'దని విశదీకరిస్తుంది 'మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు'. దీన్ని కూర్చినవారు అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి.

మధ్యేమార్గం మన జీవితాలకు ఒక సంయమనాన్ని ఇస్తే, మరి ఆ సంయమనం సాధించడానికి కావాల్సిన ఉపకరణం– ధ్యానం. ఆ ధ్యానంలో రకరకాల మార్గాలున్నాయి, రకరకాల తుది ఫలితాలున్నాయి. బుద్ధుడి ద్వారా ప్రపంచానికి అందిన ఒక ధ్యాన ప్రక్రియ– విపశ్యన. 'ఇది ఎరుక, అప్రమత్తత, జాగరూకత, పరిశీలనల మీద ఆధారపడినది.' ఇది ఉనికిలో ఉన్న మిగిలిన ధ్యానాలకు భిన్నం. సమాధి స్థితిలో మనస్సు 'అనేక మార్మిక స్థితులను చేరుతుంది. కానీ ప్రపంచాన్ని యథాతథంగా చూడలేడు. కాని బుద్ధునికి కావలసింది ప్రపంచాన్ని యథాతథంగా చూడగలగడం ...(అందుకే) విపశ్యనను కనిపెట్టాడు. విపశ్యన అంటే, మనస్సును పూర్తిగా విముక్తం చేసి, వస్తువుల యథార్థ స్థితికి తీసుకెళ్లి, తద్వారా నిర్వాణానికి చేర్చే అంతర్జ్ఞ' అని చెబుతుంది ఇదే మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు. ఇది ఒక విశ్లేషణాత్మక విధానం. 'దుఃఖాన్ని, రూపారూప ప్రపంచంలో ఆత్మలేని తనాన్ని ఎరుకపరిచేది ఈ జ్ఞానం'.

2008లో వెలువడిన ఈ మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువులో ఇంకా ఇలాంటి ఎన్నో మాటలకు, రీతులకు అర్థాలు, వివరాలు తెలుస్తాయి. రెండు అట్టల నడుమ బౌద్ధ మహాసాగరాన్ని ఇముడ్చుకున్న గ్రంథం ఇది. పదం పదంలో జ్ఞాన పథం! తెలిసీ అసత్యం పలకడానికి ఎవరైనా సిగ్గుపడాలనీ, అలాగే పర్యాలోచన(రిఫ్లెక్షన్) చేసి కర్మలను పరిశుద్ధం కావించుకోవాలనీ రాహులునికి బుద్ధుడు బోధించింది రాహులోవాద సూత్రం. 'ఏ ధర్మమూ, వస్తువూ అదే విధంగా ఏ రెండు క్షణాల పాటు ఉండదు' అని చెప్పేది క్షణికవాదం. యోగ అంటే, కాడి కిందకు తేవటమే. 'ఎలాగైతే కాడికి పూన్చిన ఎద్దులు నియమబద్ధంగా నడుస్తాయో, అలాగే యోగం మనిషి మనస్సును సంయమిస్తుంది'. ఇక పవిత్రాక్షరం ఓమ్ తాంత్రిక బౌద్ధంలో శూన్యతను సూచిస్తుంది. అయితే ఈ గ్రంథం వట్టి ప్రతి పదార్థాల పదకోశం కాదు. ఇది బౌద్ధ సూత్రాలను, శాస్త్రాలను, సిద్ధాంతాలను, పారిభాషిక పదాలను గణనీయంగా వివరిస్తుంది. కొత్తగా బౌద్ధాన్ని తెలుసుకోగోరేవారికీ, అవగాహన చేసుకోగోరేవారికీ ఇది ఒక కరదీపిక. 'ఇటువంటి బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు తెలుగులో– బుద్ధుని కాలంలోనే బౌద్ధం ఆంధ్రదేశంలో ప్రవేశించినా, క్రీ.పూ. 300ల నుంచి క్రీ.శ. 700ల వరకు, వేయి సంవత్సరాల పాటు, ఆంధ్రదేశాన్ని దున్ని వేసినా– ఒక్కటీ వెలువడలేదు' అని ప్రకాశకులు (మిసిమి ప్రచురణలు) ఆశ్చర్యం వ్యక్తం చేస్తూనే, 'తెలుగులో వెలువడిన ప్రథమ మహా బౌద్ధ విజ్ఞాన నిఘంటువు' ఇదని ఘనంగా ప్రకటించారు. అయితే, 'నేను త్రిపిటకాచార్యుడను కాను. అంతకంటె బౌద్ధ వాఙ్మయ మహాధ్యక్షుడను అసలే కాను. ఒక సామాన్య బౌద్ధ విద్యార్థిని. అలాగే ఈ ప్రయత్నం చేశాను... ఆ మహా సముద్రంలోని జ్ఞాన జలాన్ని నా 'బుడ్డి చెంబు' పట్టినంత మేరకే గ్రహించాను' అని వినయంగా చెప్పుకొన్నారు కూర్పరి అన్నపరెడ్డి. నిఘంటువు ముందు 'మహా' అని చేర్చడం కూడా, బౌద్ధ సంప్రదాయాన్ని(ఉదా: మహా నిదాన సుత్త, మహా పదాన సుత్త) పాటించాలనే కోరికతో చేశానని చెప్పినప్పటికీ ఇది 'మహా' అని చేర్చడానికి తగినదే!

బౌద్ధానికి సంబంధించిన అనేక గ్రంథాలను తెలుగులో వెలువరించిన అరుదైన రచయితగా కూడా అన్నపరెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇందులో అనువాదాలు, పరిశోధనలు, స్వతంత్ర రచనలు ఉన్నాయి. మానవీయ బుద్ధ, బుద్ధ దర్శనం, బుద్ధుని దీర్ఘ సంభాషణలు, బుద్ధుని సూత్ర సముచ్చయం, తెలుగులో బౌద్ధం, ఆచార్య నాగార్జునుడు, మహోన్నత బుద్ధుడు, నలభై రెండు ప్రకరణాల సూత్రం, బుద్ధుని ధర్మం– శిష్యులు, పోషకులు లాంటి పుస్తకాలను వెలువరించారు.

1933 ఫిబ్రవరి 22న మహాశివరాత్రి పర్వదినాన గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరులో దిగువ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు అన్నపరెడ్డి. లెక్చరర్‌గా పనిచేశారు. 'చదివింది తత్వశాస్త్రం. బోధించింది సమాజశాస్త్రం. రాసింది మనోవిజ్ఞాన శాస్త్రం. అభిమాన విషయం సాహిత్యం, గ్రంథ రచన'. 1996 నుంచి 2011 వరకు 'మిసిమి' మాసపత్రికకు సంపాదకులుగా పనిచేశారు. చాలామంది సాధారణ తెలుగు పాఠకులకు సిగ్మండ్ ఫ్రాయిడ్ ఆయన ద్వారానే పరిచయం. మేధావుల మెతకలు, అస్తిత్వవాదం ఆయన ఇతర రచనలు. 'చింతనాగ్ని కొడిగట్టిన వేళ' ఆయన ఆత్మకథ. బౌద్ధమతం అవలంబించిన తర్వాత తన పేరును బుద్ధఘోషుడు అని పెట్టుకున్నారు. ఆ పేరుతో రచనలు చేశారు. కానీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగానే ఎక్కువమందికి పరిచితుడు. 2021 మార్చ్ 9న ఆయన మరణించారు. ఇది ఆయన జయంతి, వర్ధంతుల ఉమ్మడి సందర్భం. కొంతమంది తాము బతికి ఉన్నంతకాలం సెలయేళ్లలా ప్రవహిస్తారు. వారి దగ్గరికి ఎప్పుడు సమీపించినా మెదడుకు ఇంత జ్ఞానతడి చేసుకుని రావొచ్చు. అలాంటి ఒక తెలుగు సెలయేరు అన్నపరెడ్డి!

అంతరాత్మను తట్టి లేపే కథనం

కామెంట్



కరణ్ థాపర్


ఈ కథనం 75 సంవత్సరాల తర్వాత కూడా మన అంతరాత్మను తట్టిలేపుతుంది. 1947 మండువేసవి కాలంలో ఇది జరిగింది. దేశవిభజన తీసుకొచ్చిన ఉన్మాద హత్యల కారణంగా భావోద్వేగాలు తీవ్రస్థాయిలో ఉన్నరోజులవి. అలాంటి సమయంలో ఇంట్లో పనిచేస్తున్న ఒక మనిషిని, కేవలం తన మతం కారణంగా మృత్యువు ముంగిట నిల్చున్నప్పుడు ఎంతో సమయస్ఫూర్తితో ఒక మహిళ కాపాడిన కథనం ఇది. ఆ సంఘటనను దాటేసిన చాలా రోజులకు అది నవ్వులాట కథనంగా మారిపోవచ్చుగాక! కానీ ఆ క్షణంలో ముచ్చెమటలు పట్టించిన రోజు ఎవరి జీవితంలోనూ రాకూడదు.

మా 'మమ్మీ' (అమ్మ; బిమ్లా థాపర్) ఈరోజు బతికి ఉంటే ఆమెకు 106 సంవత్సరాలు ఉండేవి. తన 98 సంవత్సరాల వయసులో 2015లో చనిపోయింది. ఆమె జయంతి అని ఆమె గురించి నేను రాయడం లేదు. చాలా విభిన్నమైన కారణం రీత్యా నేను ఈ కథనం రాస్తున్నాను. ఆమె జీవితంలో తప్పకుండా గుర్తుంచుకోవలసిన కథ ఉంది. అది కాలం ఎంతగా మారిపోయిందో చెప్పే శక్తిమంతమైన చిత్రణ. 75 సంవత్సరాల తర్వాత కూడా అది మన అంతరాత్మను తట్టిలేపుతుందని నేను భావిస్తున్నాను.

1947 మండువేసవి కాలంలో ఇది జరిగింది. ఆ సమయంలో ఆర్మీ బ్రిగేడియర్ అయిన మా నాన్న (జనరల్ ప్రాణ్‌నాథ్ థాపర్) మిలిటరీ ఆపరేషన్స్, ఇంటెలిజెన్స్ విభాగం డైరెక్టర్‌గా బాధ్యతల్లో ఉండేవారు. ఆ రోజుల్లో ఆ స్థాయి ఉద్యోగం విలాసవంతమైన బంగ్లాను తీసుకొచ్చేది. అయితే ఆ ఇల్లు సొగసు ఏమిటంటే– దేశవిభజన తీసుకొచ్చిన ఉన్మాద హత్యల కారణంగా పేరుకుపోయిన హంతక భావోద్వేగాలతో పోల్చిచూసినప్పుడు, దానికి పూర్తి విరుద్ధంగా ఎకరాల పొడవునా గుల్‌మహర్ చెట్లతో చుట్టి ఉండే అలంకరించిన పచ్చిక బయళ్లతో కూడి ఉండేది. సిక్కు 'జత్తాలు' అని పిలువబడే వాళ్లు... ముస్లింలపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఢిల్లీ వీధుల్లో వీరంగమాడేవారు. అవి నిజంగానే మంచిరోజులు కావు.

అప్పట్లో నా తల్లితండ్రుల వద్ద ఒక ముస్లిం బేరర్ ఉండేవాడు. అనేక సంవత్సరాలుగా అతను వారితో ఉంటూ వచ్చాడు. అతడి పేరు ఫజల్ కరీమ్. ఆనాటి పరిస్థితులను చూసి ఫజల్ కరీమ్ భీతిల్లిపోవడం అర్థం చేసుకోదగినదే. మా కాంపౌండులో ఒక చివరన ఉండే క్వార్టర్లలో కంటే మా ఇంటిలోనే అతడు ఉండేలా అమ్మ ఏర్పాటు చేసింది. అతడి మతం గురించిన వివరాలను దాచి ఉంచాలని ప్రతి ఒక్కరినీ అమ్మ హెచ్చరించింది. ఫజల్ ఒక ముస్లిం అని ఎవరికీ చెప్పేవారం కాదు.

ఒకరోజు మధ్యాహ్నం తర్వాత, అంటే భోంచేసి అందరూ విశ్రాంతి తీసుకునే వేళ, ఎవరో మా ఇంటి తలుపు తట్టారు. అమ్మ స్వయంగా వెళ్లి తలుపు తీసింది. చేతుల్లో ఆయుధాలు, కళ్లలో ఆగ్రహం



ప్రదర్శిస్తున్న కొంతమంది మగవాళ్లు ఇంటి వరండాలో నిలబడి ఉండటం చూసింది. ''బీబీజీ! ఈ ఇంట్లో ఒక ముస్లింను మీరు దాచి ఉంచుతున్నట్లు మేము నమ్ముతున్నాము. అతడిని మాకు అప్పగించండి'' అని వారు డిమాండ్ చేశారు. తామేం మాట్లాడుతున్నదీ వారికి బాగా తెలుసు అన్నట్లుగా వారి మాటల ధ్వని ఉంది. ఆ మనిషిని ఎలాగైనా పట్టుకోవాలన్న పట్టుదల వారిలో కనబడింది.

ఇలాంటిదేదో జరుగుతుందని ఫజల్ కరీమ్ ఎప్పుడూ భయపడేవాడు. ఇప్పుడు ఆ క్షణం రానేవచ్చింది. అప్పుడు అమ్మకు 30 సంవత్సరాల వయస్సు మాత్రమే. ఇలాంటి పరిస్థితి ఆమె ఊహించినది కాదు. కానీ ఆమె సహజాత గుణం ఆ సమస్యకు పరిష్కారం కనుగొంది. ''అవును. మా దగ్గర ఒక ముస్లిం బేరర్ ఉండేవాడు. కానీ అతడు వెళ్లిపోయి చాలా కాలమైంది'' అని అమ్మ అబద్ధమాడింది. అయితే తన మాటలను వాళ్లు నమ్మరని గ్రహించిన అమ్మ ఇలా చెప్పింది: ''కావాలంటే మీరే వెనుక ఉన్న క్వార్టర్లలో వెళ్లి చూసుకోండి. మీకు తోడుగా మా మనిషిని ఒకరిని పంపుతాను.''

ఇంటి ముందు తలుపు వెనకాల దాక్కుని ఉన్న ఫజల్ కరీమ్ ఈ సంభాషణ వింటూ భయంతో వణికిపోయాడు. తాను ఎవరికీ కనిపించకుండా ఉన్నప్పటికీ, ఆ క్షణంలో అతడి మనసులో ఎలాంటి భావాలు కలుగుతున్నాయో మనం ఊహించుకోవచ్చు.

ఉన్నట్లుండి అమ్మ కరీం కేసి చూస్తూ, అతడిని ''చున్నీ లాల్'' అని పిలిచింది. అప్పటికప్పుడే అతడి పేరును అమ్మ అలా మార్చేసింది. ''ఫజల్ కరీమ్ తన ఇంటికి వెళ్లిపోయాడంటే వీళ్లు నమ్మడం లేదు. నువ్వు వాళ్లను క్వార్టర్ల వద్దకు తీసుకెళితే, వాళ్లే స్వయంగా చూస్తారు కదా!''

వారితో వెళుతూ ఫజల్ తప్పకుండా వణికిపోయి ఉంటాడు. ఆ సమయంలో అతడు ఏం మాట్లాడి ఉంటాడు, లేదా అతడు ఎలా స్పందించి ఉంటాడు అని నాకు ఎవరూ చెప్పలేదు. కానీ చున్నీ లాల్ వాళ్లతో వెళ్లాడు. అతడితో కలిసి క్వార్టర్ వద్దకు వెళుతున్న ఆ క్రూరమైన, ఆగ్రహోదగ్రులైన మనుషులు తమ ముందు జరుగుతున్న ఈ నాటకం గురించి కనీసం ఊహించి ఉండరు. ఒకరి తర్వాత ఒకరుగా వారు క్వార్టర్లను తనిఖీ చేశారు. తర్వాత వారు మళ్లీ మా ఇంటివద్దకు వచ్చి అమ్మకు సలామ్ చెప్పి వెళ్లిపోయారు. అది చున్నీ లాల్‌కు మృత్యువు దాదాపుగా దగ్గరిదాకా వచ్చిన క్షణం. కానీ అతడు సురక్షితంగా తప్పించుకున్నాడు.

ఈ కథలో మలుపు ఏమిటంటే, అప్పటినుంచీ అతడి పేరు చున్నీ లాల్‌గా మారిపోయింది. 1960ల ప్రారంభం వరకు అతడు మా అమ్మానాన్నల వద్దే ఉండిపోయాడు. అయితే నాన్న అఫ్గానిస్తాన్ రాయబారిగా నియమితులు కావడంతో అతడు తన గ్రామానికి వెళ్లిపోయాడు. అయితే నా సోదరీమణులకు, నాకు ఎప్పుడూ అతడు చున్నీ లాల్‌గానే తెలుసు. నిజానికి, అతడు కూడా తనను అలాగే చెప్పుకొనేవాడు. తర్వాత ఫక్కున నవ్వేసి, తన పేరు ఎలా మారిపోయిందనే కథను చెప్పేవాడు. తనలో భయాలు తొలగిపోయాక, అది అతడికి ప్రీతిపాత్రమైన కథగా మారిపోయింది.

ఈ కథ నుంచి నేను నీతిని వెలికి తీయాలనుకోవడం లేదు. నేనలా చేసి ఉంటే అది అహంకారం, గర్వం కలయికలా ఉండేది. దానికి బదులుగా ఎల్.పి.హార్ట్‌లీ రాసిన నవల 'ద గో–బిట్వీన్'లోని ప్రారంభ వాక్యాలను గుర్తు తెచ్చుకుని ఈ కథనాన్ని ముగించనివ్వండి. 'గతం అనేది ఒక పరాయి దేశం. వాళ్లు అక్కడ పనులను భిన్నంగా చేస్తారు.' మనలో కొందరం ఇంకా గతంలోనే జీవించడానికి ప్రాధాన్యం ఇవ్వడానికి ఇదే కారణమా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వాస్తవం



ఆయుధ సంపత్తి కోసం ఒకే దేశం మీద మరీ ఎక్కువగా ఆధారపడిన దేశం, కచ్చితంగా ఐక్యరాజ్యసమితిలో దానికి వ్యతిరేకంగా ఓటు వేయలేదు.

– ప్రసేన్‌జిత్ దత్తా, కాలమిస్ట్

గొప్ప శాస్త్రం



నేననుకోవడం వంట అనేది ఎంత సంక్లిష్ట అంశం అనేది జనాలు తగినంతగా గుర్తించినట్టు అనిపించదు. వందల రకాలు టెక్నిక్కులు, వేలాది పదార్థాలు, రకరకాల ఫ్లేవర్లు, అబ్బో... అత్యంత సంక్లిష్ట శాస్త్రాల్లో ఒకటి.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

పరిష్కారాలు లేవు



బిల్ గేట్స్, టోనీ బ్లెయిర్, క్లాస్ ష్వాబ్– వీళ్లెవరూ ఎన్నికైనవాళ్లు కాదు. అయినప్పటికీ స్థిరంగా తమ అనేక ఎజెండాలను ప్రజా విధానాల్లోకి చొప్పిస్తున్నారు. విశాల ప్రయోజనాల కోసం వాళ్లు పరిష్కారాలను సూచిస్తున్నారనుకునేవాళ్లు అర్థం చేసుకోవాల్సింది– వాళ్లే ఆ సమస్యలో భాగం!

– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

అర్థవంతమైన శ్రమ



కష్టాలు, సమస్యలు, నమ్మకద్రోహాలు ఉన్నప్పటికీ చేయాల్సిన మంచిపని చేయండి. ఒకరోజు, భగవంతుడు మీకోసం వాటన్నింటినీ ఎలా అనుసంధానిస్తాడంటే– అదంతా అర్థవంతం అయిపోతుంది. అప్పటిదాకా సహనం వహించండి.

– ముఫ్తి మెంక్, మతగురువు

దురాశ నడుపుతోంది



ఖాలిస్తాన్ పేరుతో ఇండియాకు వ్యతిరేకంగా వేర్పేటువాదాన్నీ, హింసనూ ప్రోత్సహిస్తున్నవారికి పాకిస్తాన్ నిజమైన ఉద్దేశాలు తెలియదు లేదా అర్థం చేసుకోవడం లేదు. వాళ్లను వాడుకుంటున్నారని ఖాలిస్తానీలకు తెలుసు. కానీ పేరు, కీర్తి, ధనం కోసం దురాశ వారిని నడిపిస్తోంది.

– అమర్ జీత్ సింగ్, మాజీ దౌత్యాధికారి

లోతైన సమస్య



పంజాబ్‌లోని ఘటనల వెనుక పూర్తిగా విదేశీ హస్తం ఉందని నమ్మే భ్రాంతిమయ బీజేపీ మద్దతుదారులు కొన్ని రోజులు పంజాబ్‌లో ఉండి చూడాలి. 2019లో నేను ఒక నెల రోజులు పంజాబ్‌లో ఉన్నాను – ఏహ్యత కలిగిందనేది చిన్నమాట. మీరు ఊహించే దానికన్నా చీడ చాలా లోతుగా ఉంది. అది ఎప్పుడూ ఉంది.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

రాయడాన్ని గౌరవించండి




ప్రియమైన హిందీ సినిమా నిర్మాతల్లారా! రచయితలకు ఇవ్వాల్సింది చెల్లించండి. ఒరిజినల్ కథల కోసం చూడండి. రీమేకులు ఆపండి. స్క్రిప్టులు చదవడం అలవాటు చేసుకొని, 'నెరేషన్' సంస్కృతిని మానండి. నటులకు ఇవ్వాల్సినదానికన్నా ఎక్కువ ఇచ్చేసి మిగతా సాంకేతిక నిపుణులకు ఏమీలేకుండా చేసుకోవద్దు. రాయడం అనేది ప్రత్యేకమైన పని. రాయడం గురించి మీకు అంతా తెలుసనుకుంటే మీరే రాసుకోండి, రచయితలను తీసుకోకండి!

– దారాబ్ ఫారూఖీ, స్క్రీన్ రైటర్

సారాంశం
సరికొండ చలపతి

చైనా బ్యాచ్.. కన్యాశుల్కం



ఇది సీరియస్ విషయమో... సరదా అంశమో చివరిలో మాట్లాడుకుందాం.

ముందుగా సరదాగా మొదలుపెడదాం.

నిజానికి చైనా బ్యాచ్‌లర్స్ గురించి మాట్లాడుకోవాలి.. ఇండియాలోని బ్యాచ్‌లర్ తన యాంగిల్‌లో చెబుతున్న 'భోజరాజు కథ' ముందుగా విందాం. ఇందులో కాస్త కడుపుమంట కనిపిస్తుంది.

భోజరాజీయం కథ ఇదీ..

ఓ పేద బ్రాహ్మణుడు. చదువు సంధ్యాలేదు. ఇల్లూవాకిలీ లేవు.

ఏమీ లేని వారికి పిల్లనెవరిస్తారు. అందుకే సత్రాల్లో కాలక్షేపం చేస్తూ, ఊరూరూ తిరుగుతూ కాశీ చేరాడు. అక్కడే కాలక్షేపం చేస్తున్నాడు. ఇప్పుడు మోదీ పీఎం అయ్యాక బాగా డెవలప్ చేసినట్టున్నారు కానీ, అప్పుడంత సీన్ లేనట్లుంది. భోజనానికి ఢోకాలేకుండా కొంతకాలం నడుస్తోంది. విభూది పూసుకుని శివావతారంలో దేశ సంచారం చేసే బృందమొకటి కనిపించింది. వారితోపాటు కలిసి తిరుగుతూ, వారు ప్రయాగ యాత్రకు వెళుతుంటే వారితో పాటు ప్రయాగకు చేరాడు.

ఏమీ పాలుపోక, చేసేదేమీ లేక అక్కడ పుష్కరిణి నది వద్ద కూచున్నాడు. ఇంతలో అక్కడికి నలుగురు అమ్మాయిలు వచ్చారు. చాలా అందగత్తెలు. నలుగురు మాట్లాడుకుంటూ నదిలోకి దూకారు. ఇదంతా మనవాడు గమనిస్తున్నాడు.

ఒకమ్మాయి.. నాకు నవ మన్మథాకారుడు, చక్రవర్తి భర్తగా కావాలి..అని చెప్పుకుంటూ దూకింది

మరొకామె.. నాకు కండల వీరుడు కావాలి.. అన్నది.

ఇంకొకామె.. నాకు కవీశ్వరుడు భర్తగా రావాలి అని కోరుకున్నది.

చివరి అమ్మాయి.. వచ్చే జన్మలో నాకు సంగీత లలిత కళా వల్లభుడు భర్తగా కావాలి అనుకుంటూ దూకేసింది. 'ఈ జన్మలో ఇలాంటివి సాధ్యం కాదు..వచ్చే జన్మలోనైనా సాధ్యపడేలా చెయ్యి దేవుడా..' అంటూ ప్రార్థిస్తూ, ఇలా అయితే వచ్చే జన్మలో తప్పక సిద్ధిస్తుంది అనుకుంటూ ఆనందంగా దూకేశారు.

ఇదంతా వింటున్న మన హీరో బుర్ర పాదరసంలా పని చేసింది.

వచ్చే జన్మలో ఆ నలుగురు నాకు భార్యలు కావాలి అంటూ తానూ దూకేశాడు. ఆ తర్వాత జన్మలో మనవాడు భోజరాజుగా జన్మించాడు. వారందరూ అన్ని లక్షణాలు, ఐశ్వర్యం, రాజ్యం ఉన్న భోజరాజుకు భార్యలయ్యారు ఇదీ కథ.

కడుపు మంట ఇదీ..

'...ఇప్పుడు యూత్ అంతా భోజరాజులయితే కానీ పెళ్లి అయ్యేట్లు లేదు. కనీసం ఆ కాలంలో ఒక్కొక్క వరుడిలో ఒక్కో క్వాలిటీ అడిగారు. కానీ, ఈ తరం అమ్మాయిలు అన్ని లక్షణాలూ ఒక్కడిలోనే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. అందగాళ్లు, ఎన్ఆర్ఐ సంబంధాలు, హై ఎడ్యుకేషన్లు, లక్షల్లో ప్యాకేజీలు, కార్లు, ట్రిపుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్లు.. ఒక్కటేమిటి అన్నీ..'

'..ఇప్పుడు నాకు 33 సంవత్సరాలు వచ్చాయి.. ఎన్నో సంబంధాలు పోయాయి.. నెత్తి మీద అరెకరం మిగిలింది.. క్యాంపస్ సెలెక్షన్లు, సంపన్న సంబంధాలు పోను మా లాంటి థర్టీ ప్లస్ గాళ్లం 'లెఫ్ట్ ఓవర్'లాగా మిగిలిపోయాం,. ఏ మ్యాట్రిమోనీకి పోయినా.. ఎంత ఏజీ, ఎంత ప్యాకేజీ, వెనుక ఎంత బ్యాగేజీ అని అడుగుతున్నారు. ఇక ఈ జీవితానికి ఇంతే..' – సోషల్ మీడియాలో ఓ బ్యాచ్‌లర్ సోదరుడి బాధ.

....

మరి చైనా కథేంటీ అంటారా... ఇండియాలోని పెళ్లికాని ప్రసాదులకే ఇన్ని బాధలుంటే మనకు మించిన జనాభా ఉన్న... చైనాలో బ్యాచ్‌లర్స్ బాధ ఇంత కన్నా ఎక్కువ.

అక్కడో వరుడు అచ్చంగా కోటి రూపాయలకు పైగా వధువుకు 'కన్యాశుల్కం' సమర్పించుకున్నాడు. కన్యాశుల్కం అంటే తెల్సుగా.. మన దగ్గర వరకట్నానికి రివర్స్. అక్కడ కన్యాశుల్కం బాగా పెరుగుతోంది. మార్కెట్‌లో లక్షలు పలుకుతోందట!

....

కరోనా వైరస్‌లాగా చైనా నుంచి కన్యాశుల్కం మనదేశానికి పాకుతుందేమోనని మన యూత్, పెళ్లి కాని ప్రసాద్‌ల బ్యాచ్.. చైనా బ్యాచ్‌ను చూసి బెంబేలెత్తుతున్నారని సోషల్ మీడియా భోగట్టా.

చైనా బ్యాచ్... 'కన్యాశుల్కం'

చైనాలో చాలా కాలంగా కన్యాశుల్కం ఆచారం ఉంది.. కానీ అది నామ్‌కేవాస్తే లాగా ఉండేది. కమ్యూనిస్టు పాలనలో కూడా అది విజృంభిస్తూనే ఉంది. ఈ కన్యాశుల్కం 60–70వ దశకంలో మంచాలు, పరుపులు లాంటి చిన్న చిన్న గిఫ్టుల నుంచి, 80వ దశకంలో టీవీలు, ఫ్రిజ్‌ల దాకా చేరింది, 1990లలో అక్కడ ఆర్థిక సంస్కరణల అమలు మొదలయ్యాక, కన్స్యూమరిజం పెరగడం, ఆర్థిక అంతరాలు పెరగడంతోపాటు లైంగిక వివక్ష పెరగడంతో కన్యాశుల్కం రాకెట్ వేగం అందుకుంది. కార్లు, రియల్ ఎస్టేట్ దాకా పోయింది.. ఇప్పుడు పురుషులు వధువుకు, వధువు కుటుంబానికి కానుకల రూపంలో లక్షల రూపాయలు ఇవ్వాల్సి వస్తోందట. కార్లు లాంటి వాహన రూపంలో, ఆస్తుల రూపంలో సమర్పించుకుంటున్నారు. దీన్నే 'బ్రైడ్ ప్రైస్' అంటున్నారు. ఈ సంప్రదాయం ఎక్కువగా చైనా గ్రామీణ ప్రాంతంలో కనిపించేది. ఇప్పుడు సిటీలకు కూడా బాగా పాకుతోంది. ఇటీవల ఓ వధువు కుటుంబం కోటి రూపాయలకు పైగా డిమాండ్ చేయడం, అది మీడియాలో బాగా చర్చ కావడంతో అందరి దృష్టి చైనా బ్యాచ్‌లర్ల కష్టాలపై పడింది. చివరికి చైనా కమ్యూనిస్టు పార్టీ కూడా దీనిపై దృష్టి పెట్టడం దీని సీరియస్‌నెస్‌కు అద్దం పడుతోంది.

చైనా 'వన్' వే..

చైనా ఏది చేసినా కరోనా స్థాయిలోనే చేస్తుంది. జనాభా పెరిగిపోతోందన్న ఆందోళనతో దశాబ్దాల పాటు ఒకే బిడ్డను కనాలన్న 'వన్ చైల్డ్' పద్ధతిని చాలా సీరియస్‌గా ఇంప్లిమెంట్ చేసింది. ఇండియాలో లాగానే... మగబిడ్డ కావాలనే సెంటిమెంట్ చైనా సమాజంలో కూడా ఉంది. దానితో వారు కనే ఒక్క బిడ్డను మగబిడ్డను కనడానికే ఆసక్తి చూపారు. ఇది తీవ్ర లింగ వివక్షకు దారితీసి లింగ నిష్పత్తిని దారుణంగా దెబ్బతీసింది. మగబిడ్డ కావాలనే ఆకాంక్ష వల్ల అమ్మాయిల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2017లో చేసిన ఒక సర్వేలో 100 మంది పెళ్లికాని పురుషులకు 66 మంది పెళ్లి కాని స్త్రీలే ఉన్నట్లు తేలింది.

చైనాలో 1986 నుంచి ప్రతి మ్యారేజ్‌ను రిజిస్టర్ చేయాలన్న రూల్ తెచ్చారు. ఈ లెక్కల ప్రకారం 2021లో 76 లక్షల పెళ్లిళ్లు రిజిస్టర్ అయ్యాయి. పెళ్లిళ్లు చేసుకునే వారి సంఖ్య బాగా తగ్గింది. రిజిస్ట్రేషన్ తప్పనిసరి అనే నిబంధన వచ్చాక అతి తక్కువ పెళ్లిళ్లు అయిన ఏడాది ఇదే. యువత లేట్‌గా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. మ్యారేజ్ ఏజ్ పెరిగింది. ఒంటరిగా ఉండిపోతున్న అబ్బాయిల సంఖ్య పెరుగుతోంది. తద్వారా కన్యాశుల్కం పెరుగుతోంది. అక్కడ అన్నీ ఆర్థిక హంగులున్న భోజరాజులకు మాత్రమే పెళ్లిళ్లు అయ్యే పరిస్థితి వచ్చింది. ఇలాంటి పరిస్థితి ఇక్కడా వస్తుందేమోనని చైనా బ్యాచ్‌ను చూసి మన ఇండియా బ్యాచ్ బ్యాచ్‌లర్ల భయం..

ఎంకరేజ్ 'వ్యాక్సిన్'....

పైన చెప్పిన కారణాలు, వన్‌చైల్డ్ సిస్టమ్‌తో జనాభా తగ్గిపోవడంతో వన్‌చైల్డ్ పద్ధతికి చైనా స్వస్తి పలికింది. అయినా 2022లో చైనా జనాభా తగ్గింది. ప్రపంచానికి భిన్న పోకడ ఇది. ఇది తమ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందేమోనన్న కంగారు పడుతున్న చైనా సర్కారు ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని ఎంకరేజ్ చేస్తోంది. మ్యారేజ్ చేసుకున్న కొత్త దంపతులకు ఇప్పటిదాకా మూడు రోజులు పెయిడ్ లీవ్‌లు ఉండేవి. ఇప్పుడు వాటిని 30 రోజులకు పెంచారు.

....

ప్రపంచంలోనే రెండు అత్యంత ఎక్కువ జనాభా ఉన్న దేశాల్లో యువకులకు పెళ్లిళ్లు కావడం కష్టం అవుతోంది. పెళ్లి.. ఆర్థిక, సామాజిక సమస్యగా మారింది. పెళ్లి 'మార్కెట్' కావడంతో ..మార్కెట్‌లో నిలబడలేని ఎంతోమంది పెళ్లి కాకుండానే ఉండిపోతున్నారు. ప్యాకేజీల కోసం, విదేశాల్లో ఉద్యోగాల కోసం వెంపర్లాడుతున్నారు. చైనాలో పెరుగుతున్న కన్యాశుల్కం ఓ రకంగా అమ్మాయిలను మార్కెట్లో పెట్టడమే... అంగడి సరుకుగా మార్చడమే!

ఈ పరిస్థితి.. ఆడపిల్ల అమ్మ కడుపులో ఉండగానే సమాజం మూకుమ్మడిగా కత్తులు దూసినందుకు తగిలిన ఉసురు కాదా..?

.. ఇదీ సీరియస్ అంశం!

శౌచం

ఎవరికైనా ఎప్పుడైనా తప్పనిసరిగా ఉండవలసినది శౌచం. అంటే శుచిగా ఉండటం. ఎటువంటి మాలిన్యాలూ లేకుండా ఉండటం. శౌచం బాహ్యం, అంతరం కూడా. బాహ్య శౌచం పరిసరాలకీ, వ్యక్తికీ సంబంధించి ఉంటుంది. పరిసరాలు శుచిగా లేకపోతే ఏ పనైనా శ్రద్ధగా చేయటం కష్టం. చదువు, పరీక్షలు, పూజ వంటి అనేక సమయాల్లో... ఒంటి మీద ఈగలు, దోమలు వాలుతూ ఉంటే; దుర్వాసనలు గుప్పుమంటుంటే, చెవులు బద్దలయ్యే శబ్దాలు చీకాకు పెడుతుంటే దృష్టిని కేంద్రీకరించటం సాధ్యమా?

పరిసరాలు బాగుంటే చాలదు. మనిషి కూడా శుచిగా ఉండాలి. స్నానం చేస్తే బద్ధకం పోయి మెదడు చురుకుగా పని చేస్తుంది. ఉతికిన శుభ్రమైన వస్త్రాలతో ఉండాలి ఎప్పుడూ. నలిగిన, మాసిన బట్టలు చీకాకుని కలిగిస్తాయని పరిశోధకులు చెప్పిన మాట. అంతర శౌచం కూడా రెండు విధాలు – మనస్సుకూ, ఆత్మకూ సంబంధించి. పరిసరాలూ, దేహం శుచిగా ఉన్నా... మన సంతా గందరగోళంగా ఉంటే ప్రశాంతంగా పని చేయలేము. ముఖ్యంగా రాయటం, పూజ, ధ్యానం వంటివి చేయటం కుదరదు. కనుక ముందు శుభ్రం చేయవలసింది మనస్సుని. చెడు ఆలోచనలు రాకుండా జాగ్రత్త పడాలి. అవి మనసును కలుషితం చేసి, పనిని చెడగొడతాయి. చేసేది ధ్యానమో, పూజో అయితే అవే సిద్ధిస్తాయి.

జ్యోతిర్మయం

ఆత్మకి ఎటువంటి మాలిన్యం అంటదని భగవద్గీతాది ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. కాని, అది ఎన్నో దురాలోచనలు, దుష్టచర్యల ఫలితంగా దుమ్ముతో కప్పబడిన అద్దంలాగా అవుతుంది. పైన కప్పిన దుమ్ము పోరని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. ఎదుటివారికి మేలుకలగాలని కోరుకోవడం, సర్వజీవులకు సహాయం చేస్తూ ఉండటం, నచ్చిన దైవనామాన్ని మనసులో అనుకుంటూ ఉండటం వంటివి ఆత్మ శౌచానికి దోహదం చేస్తాయి.

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.అష్టమి తె.5.33 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి నవమి, నక్షత్రం: కృత్తిక ఉ.9.21 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: రా.1.54 నుండి 3.33 వరకు, దుర్ముహూర్తం: ప.12.34 నుండి 1.23 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, అమృతఘడియలు: ఉ.6.34 నుండి 8.11 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 6.01.

జీఐఎస్‌కు తెనాలి నుంచి పంచలోహ దేవతా విగ్రహాలు



విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న శిల్పి రామలింగేశ్వర కుమార్

తెనాలి: విశాఖలో మార్చి 3,4 తేదీల్లో జరగనున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్)–2023కు శిల్పకళలో ఖ్యాతిగాంచిన తెనాలి నుంచి దేవతా విగ్రహాలు తరలివెళుతున్నాయి. చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత ఆదేశాలతో పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పి అక్కల రామలింగేశ్వర కుమార్.. సమ్మిట్‌కు పలు దేవతల పంచలోహ విగ్రహాలను నెలరోజులుగా రూపొందించారు. వీటిలో సీతారాములు, వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి, వారాహి అమ్మవారు, శ్రీవారి పాదాలు ఉన్నాయి. అన్ని విగ్రహాలు 6 అంగుళాల ఎత్తులో, వారాహి అమ్మవారి విగ్రహాలు 3–4 అంగుళాల సైజులో తీర్చిదిద్దినట్లు శిల్పి చెప్పారు. వీటన్నిటినీ సోమవారం విశాఖకు తరలించనున్నారు.

మన దేశ గొప్పదనాన్ని చాటిచెప్పండి

- ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్‌లో మంత్రి ఆర్కే రోజా, ఎంపీ గురుమూర్తి




జెండా ఊపి విద్యార్థులను అరుణాచల్‌ప్రదేశ్‌కు పంపుతున్న మంత్రి ఆర్కే రోజా, ఎంపీ మద్దిల గురుమూర్తి

ఏర్పేడు: అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమానికి హాజరై మన రాష్ట్రం గొప్పదనాన్ని చాటి చెప్పాలని యువ జనాభివృద్ధి, క్రీడలు, సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో యువ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులను అరుణాచల్ ప్రదేశ్‌కు జెండా ఊపి పంపించారు. రోజా మాట్లాడుతూ.. మనదేశంలో విభిన్న ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాలు, చారిత్రక వ్యవహారాలు, ఆహారపు అలవాట్లను అన్ని ప్రాంతాల వారికి తెలియజేయాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతదేశం గొప్పదనం ఏమిటో, వివిధ రాష్ట్రాల ప్రత్యేకతలు ఏమిటో భావితరాలకు చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ.. చరిత్ర, ప్రాంత ప్రత్యేకతలు, సంప్రదాయాలన్నింటినీ ఇతర రాష్ట్రాల వారు తెలుసుకునేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. తెలుగు భాష గొప్పదనాన్ని చాటిచెప్పాలని సూచించారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్‌సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చిలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

- 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహణ



పుష్కరిణిలో తెప్పోత్సవ గోపురం


తిరుమల: మార్చి 3 నుంచి 7 వరకు తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరగనున్నాయి. 3న శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి అవతారంలో స్వామివారు తెప్పలపై పుష్కరిణిలో 3 చుట్లు తిరిగి భక్తులను కటాక్షిస్తారు. 4న రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి అవతారంలో 3 సార్లు విహరిస్తారు. 5న శ్రీభూ సమేతంగా స్వామివారు 3 సార్లు, 6న 5 సార్లు, 7న 7 సార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ కారణంగా ఆయా తేదీల్లో జరగనున్న ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది. కాగా, తిరుమలలో మార్చిలో జరిగే విశేష ఉత్సవాలను టీటీడీ ఆదివారం ప్రకటించింది. 3న శ్రీకులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 7న కుమారధార తీర్థ ముక్కోటి, 18న అన్నమాచార్య వర్ధంతి, 22న ఉగాది, శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం, 30న శ్రీరామ నవమి ఆస్థానం, 31న శ్రీరామ పట్టాభిషేకం ఆస్థానాన్ని టీటీడీ నిర్వహించనుంది.

సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 76,736 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.63 కోట్లు వేశారు. టైం స్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్‌ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



గుండెపోటు బాధితులకు
గోల్డెన్ చికిత్స



స్టెమీ ఇండియాతో వైద్య శాఖ ఒప్పందం

- టెలీమెడిసిన్ తరహాలో హబ్ అండ్ స్పోక్ విధానంలో అమలు
- వైద్యులు, సిబ్బందికి స్టెమీ ప్రొటోకాల్స్‌పై శిక్షణ
- స్టెమీ కార్యక్రమం కోసం క్యాథ్‌ల్యాబ్ ఉన్న ప్రభుత్వ బోధనాస్పత్రులు హబ్‌లుగా అభివృద్ధి
- ఇవిలేని చోట వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించడం కోసం ఉద్దేశించిన ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ (స్టెమీ) కార్యక్రమం అమలులోకి తీసుకుని రావడంలో భాగంగా స్టెమీ ఇ డియా సంస్థతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఒప్పందం చేసుకుంది. టెలీ మెడిసిన్ తరహాలో హబ్ అండ్ స్పోక్ విధానంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేయనున్నారు. ఈ క్రమంలో హబ్, స్పోక్‌లోని వైద్యులు, సిబ్బందికి స్టెమీ ప్రొటోకాల్స్‌పై స్టెమీ ఇండియా శిక్షణ ఇవ్వనుంది. స్టెమీ అంటే సాధారణ భాషలో గుండె రక్తనాళం 100 శాతం పూడుకుపోవడంతో వచ్చే గుండెపోటు అని అర్థం. ఇలాంటి సందర్భాల్లో రెండు, మూడు గంటల్లో లక్షణాలను గుర్తించి, ఆ పూడికను కరిగించే చికిత్స (థ్రాంబోలైసిస్ ఇంజక్షన్)ను ఇవ్వగలిగితే ప్రాణాలను కాపాడొచ్చు.

క్యాథ్‌ల్యాబ్ ఉన్న ఆస్పత్రులు హబ్‌లుగా అభివృద్ధి

స్టెమీ కార్యక్రమం కోసం క్యాథ్‌ల్యాబ్ ఉన్న ప్రభుత్వ బోధనాస్పత్రులను హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు బోధనాస్పత్రుల్లో క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం ఉంది. మిగిలిన ఆస్పత్రుల్లో క్యాథ్‌ల్యాబ్ సౌకర్యాన్ని ప్రభుత్వం సమకూర్చడానికి చర్యలు చేపట్టింది. ఈలోగా క్యాథ్‌ల్యాబ్ రహిత బోధనాస్పత్రులున్న చోట ఆ సౌకర్యం ఉన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల సేవలు వినియోగించుకోనున్నారు. జిల్లా ఆస్పత్రులు, 53 ఏరియా ఆస్పత్రులు స్పోక్‌లుగా వ్యవహరిస్తాయి. ఈ క్రమంలో హబ్‌కు రెండు గంటల ప్రయాణ దూరంలో ఉన్న జిల్లా, ఏరియా ఆస్పత్రులను అనుసంధానిస్తారు. ఈ ఆస్పత్రులకు ఛాతీనొప్పి, ఇతర గుండెపోటు లక్షణాలతో వచ్చిన వ్యక్తులకు వెంటనే టెలీ ఈసీజీ తీస్తారు. ఆ ఫలితం హబ్‌లో ఉన్న కార్డియాలజిస్ట్‌కు వెళ్తుంది. ఫలితాన్ని పరిశీలించి, గుండె రక్తనాళం ఎంత శాతం పూడుకుపోయింది? వెంటనే థ్రాంబోలైసిస్ అవసరమా? లేదా? అనేది కార్డియాలజిస్ట్ నిర్ధారిస్తారు. అనంతరం స్పోక్ కేంద్ర వైద్యుడిని అప్రమత్తం చేస్తారు. అవసరం మేరకు 'థ్రాంబోలైసిస్' ఇంజక్షన్ ఇస్తారు. దీంతో రోగి ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడతాడు. అనంతరం చికిత్స కోసం హబ్‌కు/సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలిస్తారు.

త్వరలో వైద్యులు, సిబ్బందికి శిక్షణ

స్టెమీ ఇండియాతో ఒప్పందం చేసుకున్నాం. త్వరలో వైద్యులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు మొదలవుతాయి. హబ్‌లో ఉండే కార్డియాలజిస్ట్, సిబ్బంది, స్పోక్‌లోని జనరల్ ఫిజీషియన్ ఇతర సిబ్బంది విధులు, కర్తవ్యాలు, స్టెమీ ప్రొటోకాల్స్‌పై శిక్షణ ఉంటుంది. అదే విధంగా స్పోక్స్‌కు స్టెమీ కిట్‌ల పంపిణీ చేపడతాం. వీలైనంత త్వరగా స్టెమీ కార్యక్రమం ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం.

– డాక్టర్ వినోద్‌కుమార్, డీఎంఈ, కమిషనర్ ఏపీవీవీపీ

కురుక్షేత్రలో ముగిసిన లక్ష చండీ మహా యజ్ఞం

- యజ్ఞం నిర్వహణ దేశానికి శుభదినమన్న స్వరూపానందేంద్ర



చండీమాతకు హారతి అందజేస్తున్న స్వరూపానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణలోని కురుక్షేత్రలో 16 రోజులపాటు జరిగిన లక్ష చండీ మహా యజ్ఞం ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. యజ్ఞ భూమిలో ఉదయం పరివార దేవతలకు హవనాలను, ప్రాయశ్చిత్త హోమాలను చేపట్టారు. అతిరుద్ర, చండీ ప్రధాన హోమ గుండాల వద్ద బలిహరణ కార్యక్రమాన్ని చేపట్టి మహా పూర్ణాహుతి క్రతువుని నిర్వహించారు. అనంతరం గుంతీ మాత ఆశ్రమ ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రహాలను యాగ జలాలతో సంప్రోక్షణ చేశారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ..ఈ భూమండలంపై లక్ష చండీ మహా యజ్ఞం జరిగిన తొలి ప్రాంతంగా కురుక్షేత్రలోని గుంతీ గ్రామం చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. లోక కల్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు రాజుల కాలంలో చేపట్టినట్లు చరిత్ర ద్వారా తెలుసుకున్నామని, ఇప్పుడు కళ్లారా చూశామని తెలిపారు. భారతావనికి కచ్చితంగా శుభ దినం కాగలదని ఆకాంక్షించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ ఇది మహత్తర యజ్ఞమని అభివర్ణించారు. గుంతీమాతను సత్కరించి శారదామాత విగ్రహాన్ని బహూకరించారు. యజ్ఞాన్ని నిర్విఘ్నంగా పూర్తిచేసిన నితి, కమల్‌ను సత్కరించారు. చండీమాతకు మహా మంగళ హారతి ఇచ్చారు. కాగా, యజ్ఞం ముగియడంతో పీఠాధిపతులు రుషికేష్ వెళ్లారు. మార్చి 2 వరకు అక్కడే ఉండి తదుపరి తిరుపతి వెళ్లి అక్కడి నుంచి విశాఖ చేరుకుంటారని పీఠం ప్రతినిధులు తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లలో ఆర్టీఈ చట్టం కింద
1వ తరగతిలో ప్రవేశాలు

- మార్చి 18 నుంచి రిజిస్ట్రేషన్లకు అవకాశం
- ఉత్తర్వులు జారీచేసిన పాఠశాల విద్యాశాఖ



సాక్షి, అమరావతి: విద్యాహక్కు (ఆర్టీఈ) చట్టం కింద రాష్ట్రంలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో 2023–24 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపుపై ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఈమేరకు జీవో 24ను విడుదల చేశారు. ఐబీ (అంతర్జాతీయ), ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ స్కూళ్లన్నిటిలోను విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను అర్హులైన పేదలకు కేటాయించాల్సి ఉంటుంది. ఈ సీట్లకు సంబంధించి మార్చి 4న ప్రవేశాల క్యాలెండర్‌తో సహా నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆయా ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూళ్లు మార్చి 6 నుంచి 16 వరకు సంబంధిత వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి సంబంధిత వెబ్‌సైట్ విండో మార్చి 18నుంచి అందుబాటులోకి రానుంది. ఏప్రిల్ 7వ తేదీవరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థుల ఎంపిక ఏప్రిల్ 9 నుంచి 12 వరకు చేపడతారు. మొదటి విడత కేటాయింపు ఏప్రిల్ 13న ఉంటుంది. విద్యార్థులు ఏప్రిల్ 15 నుంచి 21వ తేదీలోపు ఆయా స్కూళ్లలో చేరికలను ఖరారు చేసుకోవాలి. అనంతరం రెండోవిడత సీట్ల కేటాయింపు ఏప్రిల్ 25న చేపడతారు. ఈ విద్యార్థులు ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీలోపు ఆయా స్కూళ్లలో చేరాలి. రిజిస్ట్రేషన్లను హెచ్‌టీటీపీఎస్://సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్‌లో నమోదు చేయాలి. ఈ ప్రైవేటు స్కూళ్లలో ఆర్టీఈ చట్టం కింద ప్రవేశాలకు సంబంధించి సమస్యలు తలెత్తితే 14417 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలి. ప్రవేశాలకు సంబంధించిన మార్గదర్శకాలను, విధివిధానాలను జీవోలో వివరించారు. ఈ స్కూళ్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒక్కో విద్యార్థికి పట్టణప్రాంతాల్లో రూ.8 వేలు, రూరల్‌లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100 చొప్పున చెల్లిస్తారని జీవోలో తెలిపారు. రాష్ట్రంలోని తమ పిల్లలను బడులకు (ప్రభుత్వ, లేదా ప్రైవేటు) పంపించే అర్హులైన పేద తల్లులందరికీ అమ్మ ఒడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. 75 శాతం, ఆపై హాజరు నిబంధన అమలు చేస్తూ పేద పిల్లలందరికీ అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లలో సీట్లు పొందే ఈ పిల్లలకు సంబంధించి ఆయా స్కూళ్లకు చెల్లించాల్సిన ఫీజును నిబంధనలను అనుసరించి అమ్మ ఒడిని అందుకున్న అనంతరం విద్యాసంవత్సరం చివరన ఆయా స్కూళ్లకు రీయింబర్స్ చేస్తారని జీవోలో పేర్కొన్నారు. అలా తల్లిదండ్రులు చెల్లించకపోతే ప్రభుత్వం ఆమొత్తాన్ని తదుపరి అమ్మ ఒడి నుంచి మినహాయించి స్కూళ్లకు చెల్లిస్తుందని తెలిపారు.

'బహుజనులకు సంక్షేమం అందకుండా చేస్తున్న బాబు'



తాడికొండ: అమరావతి పేరుతో సాగిన కుల దోపిడీకి అడ్డుకట్ట పడిందన్న బాధతోనే సంక్షేమం, అభివృద్ధిని బహుజనుల దరిచేరనీయకుండా చంద్రబాబు అడ్డుపడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 882వ రోజుకు చేరాయి. పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వికేంద్రీకరణ ద్వారా అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి పెద్దపీట వేసేందుకు సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల ఏర్పాటుకు ముందడుగు వేస్తే.. కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పాల్గొన్నారు.

సులువుగా అర్థమయ్యేలా ప్రచురణలు ఉండాలి

టీటీడీకి మంత్రి బుగ్గన సూచన



టీటీడీ అధికారులకు పలు సూచనలు చేస్తున్న మంత్రి బుగ్గన

తిరుపతి అలిపిరి (తిరుపతి జిల్లా): సనాతన హిందూ ధర్మం, భారతీయ సంస్కృతికి సంబంధించి టీటీడీ ప్రచురిస్తోన్న పుస్తకాలు నేటితరానికి కూడా సులువుగా అర్థమయ్యేలా ఉండాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సూచించారు. టీటీడీ ప్రచురణల విభాగం కార్యాలయంలో ఆదివారం ఆయన జేఈవో సదాభార్గవితో పాటు పలువురు ప్రముఖ సాహితీవేత్తలు, పండితులతో సమావేశం నిర్వహించారు. వివిధ భాషల్లో టీటీడీ ప్రచురిస్తోన్న పురాణాలు, గ్రంథాలు, హిందూ ధర్మ ప్రచారానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఇంతటి గొప్ప పని టీటీడీ మాత్రమే చేయగలదన్నారు. ఇలాంటి గ్రంథాలలోని భాషను సరళీకరించి ప్రతి ఒక్కరికీ సులువుగా అర్థమయ్యేలా ప్రచురించాలని కోరారు. డిజైన్, కంటెంట్ ప్రజెంటేషన్, అర్థ, తాత్పర్యాలు చెడిపోకుండా విషయాన్ని వాడుక భాషలో చెప్పడం వల్ల ప్రైవేట్ ప్రచురణ కర్తలకు పోటీగా టీటీడీ ప్రచురణలు విశేష ఆదరణ పొందుతాయని చెప్పారు. పలువురు పండితులు, సాహితీవేత్తలు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. జేఈవో సదాభార్గవి మాట్లాడుతూ..1200 దాకా పుస్తకాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి తీసుకుని వచ్చే ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ సాహితీవేత్తలు, పండితులు లక్ష్మీ నారాయణ, డాక్టర్ సుధ, పాతూరి నాగరాజు, సత్యమూర్తి, సుబ్రమణ్య శర్మ, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, సప్తగిరి పత్రిక ప్రధాన సంపాదకులు రాధా రమణ, సంపాదకులు చొక్కలింగం, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి రామరాజు, సప్తగిరి ఉపసంపాదకులు నరసింహాచార్య పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు.. ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

- మృతులలో ఇద్దరు మెడికోలు, ఒకరు ఇంజనీరింగ్ విద్యార్థి
- చిత్తూరు జిల్లాలో దుర్ఘటన...
- లారీ ఢీకొని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మరో ఇద్దరు విద్యార్థుల మృతి



శ్రీవికాస్‌రెడ్డి(ఫైల్) ప్రవీణ్‌కుమార్(ఫైల్) కల్యాణ్ (ఫైల్)

గుడుపల్లె(చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం చిన్నశెట్టిపల్లె వద్ద ఆదివారం వేకువజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైద్య విద్యార్థులు, మరో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందారు. గుడుపల్లె ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుబర్తి గ్రామానికి చెందిన సి.శ్రీవికాస్‌రెడ్డి (21), అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం రెడ్డివారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్ (24) కుప్పం పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. వీరికి మదనపల్లెలోని మిట్స్ కళాశాలలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన కల్యాణ్(20) స్నేహితుడు. కల్యాణ్ పిన్ని కుమారుడు సాయికృష్ణ తేజ కూడా కుప్పం పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కల్యాణ్ పీఈఎస్ కళాశాలకు వచ్చి సాయికృష్ణ తేజను కలిశాడు. ఆ తర్వాత తన స్నేహితులైన సి.శ్రీవికాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రూముకు వెళ్లాడు. ముగ్గురు కలిసి ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో తమ స్నేహితుని కారు తీసుకుని కుప్పానికి బయలుదేరారు. మార్గమధ్యంలో గుడుపల్లె మండలం చిన్నశెట్టిపల్లె వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టింది. అదే సమయంలో మరో లారీ వచ్చి కారును ఢీకొట్టడంతో సి.శ్రీవికాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కల్యాణ్ అక్కడికక్కడే మృతిచెందారు. గుడుపల్లె పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ముగ్గురు విద్యార్థుల మృతితో ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి.

ప్రాక్టికల్ పరీక్షలకు వెళుతూ మరో ఇద్దరు మృతి...

అయినవిల్లి: లారీ ఢీకొని ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు వెళుతున్న ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం జరిగింది. అంబాజీపేట మండలం ముక్కామల నందెపుపాలేనికి చెందిన నందెపు రాజేష్ (17), కొత్తపేట మండలం అల్లపల్లిపాలెం కండ్రిగకు చెందిన అల్లపల్లి నాగేంద్ర (17), రాకుర్తివారిపాలేనికి చెందిన కోటిపల్లి మోహన వీర వెంకట సాయికృష్ణ (18) అమలాపురంలో శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ముగ్గురూ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షకు బైక్‌పై బయలుదేరారు. అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం టి.సావరం వద్ద జమ్మిచెట్టు సమీపానికి వచ్చేసరికి వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నందెపు రాజేష్, అల్లపల్లి నాగేంద్ర అక్కడికక్కడే మృతిచెందారు. సాయికృష్ణ (18) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అయినవిల్లి ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

11వ అంతస్తు నుంచి దూకి యువతి ఆత్మహత్య

- పీయూసీ విద్యార్థిని ప్రకృతిగా గుర్తింపు

సాక్షి బెంగళూరు: బెంగళూరులో ఆదివారం రాత్రి పీయూసీ విద్యార్థిని అపార్ట్‌మెంట్ 11వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానిక చాలుక్య సర్కిల్ వద్ద హెచ్‌పీ–3 అపార్టుమెంట్ పైనుంచి దూకిన ఆమె పార్కింగ్ ప్రాంతంలోని కారుపైన పడి అక్కడికక్కడే మరణించింది. మృతురాలు సంజయనగరకు చెందిన ప్రకృతి (18)గా గుర్తించారు. యువతి తల్లి తేజు తన కుమార్తెను గుర్తుపట్టారు. డీసీపీ శ్రీనివాసగౌడ, హైగ్రౌండ్స్ పోలీసు స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. సోఫియా కాలేజీలో పీయూసీ రెండో ఏడాది చదువుతున్న ప్రకృతి ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె ఆ అపార్టుమెంట్ వాసి కాదని, బయట నుంచి వచ్చి ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. మృతదేహం వద్ద మొబైల్, రూ.300 నగదు లభించినట్లు డీసీపీ తెలిపారు.అపార్టుమెంట్ వద్ద రెండు నిమిషాలు అటు ఇటు తిరిగి తనకు తెలిసినవారు ఉన్నారని సెక్యూరిటీ గార్డుకు చెప్పి ఆమె లోపలికి వచ్చినట్లు చెప్పారు. అంతకుముందు ఇంకో అపార్టుమెంట్ వద్ద కూడా సంచరించిన ప్రకృతి.. ఆ అపార్టుమెంట్‌లోకి వెళ్లడం సాధ్యపడకపోవడంతో హెచ్‌పీ–3 అపార్టుమెంట్‌లోకి వచ్చినట్లు ఆయన తెలిపారు.

మనిషిలోని దివ్యత్వాన్ని మేల్కొల్పేదే క్రియా యోగ : స్వామి చిదానంద గిరి

సాక్షి, న్యూఢిల్లీ: మనిషిలోని దివ్యత్వాన్ని మేల్కొల్పడంలో క్రియా యోగ సాధన అద్భుత పాత్ర పోషిస్తుందని యోగధా తత్సంగ్ సొసైటీ ఆఫ్ ఇండియా–సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అధ్యక్షుడు శ్రీశ్రీ స్వామి చిదానంద గిరి చెప్పారు. జీవన గమనంలో తీవ్రమవుతోన్న ఆందోళన, ఆత్రుత, అసహనం వంటి రుగ్మతలను తొలగించి వాటి స్థానంలో సాత్విక గుణాలను వృద్ధి చేయడంలో క్రియాయోగ పాత్ర విశిష్టమైందన్నారు. ఆదివారం నోయిడాలోని యోగా తత్సంగ్ సొసైటీలో జరిగిన కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి వచ్చిన సొసైటీ సభ్యులు, ఆధ్యాత్మిక గురువులు, భక్తుల సమక్షంలో ఆయన ఉపన్యసించారు. శరీరం, మెదడు, మనస్సులను అనుసంధానించే క్రియాయోగ ద్వారా అనేక సంక్లిష్టతలు, ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కోవడం సులువవుతుందన్నారు. కనుబొమ్మల మధ్య దృష్టి కేంద్రీకరించి శ్వాస మీద ధ్యాసను నిలుపుతూ, దైవత్వంతో తన్మయత్వాన్ని ఆస్వాదిస్తూ సాగే ఈ ప్రక్రియతో మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన డయల్ 100

యర్రగొండపాలెం: ఆత్మహత్యకు యత్నించిన ఒకరిని పోలీసులు కాపాడిన సంఘటన ఆదివారం జరిగింది. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని వీరాయపాలేనికి చెందిన నల్లబోతుల వెంకయ్య అనే వ్యక్తి కుటుంబంలో తలెత్తిన సమస్యలను తట్టుకోలేక మనస్తాపం చెంది సమీపంలోని పొలాల్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ సమయంలో అతనే డయల్ 100కు ఫోన్ చేసి కుటుంబ సమస్యల కారణంగా తానే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పాడు. పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు.ఎస్‌ఐ కోటయ్య ఐటీ కోర్ టీం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వెంకయ్య ఉన్న లొకేషన్‌ను గుర్తించారు. వెంటనే వారు వీరాయపాలెం గ్రామ శివారులో ఉన్న బాధితుడి వద్దకు చేరుకున్నారు. అప్పటికే పురుగుల మందుతాగి ఉన్న వెంకయ్యని గ్రామస్తుల సహాయంతో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. డయల్ 100 కాల్‌కు సకాలంలో స్పందించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన ఎస్‌ఐ కోటయ్య, ఐటీ కోర్ ఎస్‌ఐ అజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు అహరోన్, రమేష్‌నాయక్‌లను ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని, మంత్రి పెద్దిరెడ్డి
- పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి , రీజనల్ కోఆర్డినేటర్, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు


సాక్షి, తిరుపతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపిస్తాయని ఆ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలపై వారు ఆదివారం తిరుపతిలో సమావేశం నిర్వహించారు. పార్టీ మద్దతు పలికిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. సీఎం జగన్ ప్రకటించిన అభ్యర్థుల విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నియోజకవర్గాలవారీగా ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారన్నారు. ప్రతి ఓటు పోలయ్యేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉదాసీనతకు తావు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

సార్వత్రిక ఎన్నికల్లోనూ మనమే..

వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని చెప్పారు. 18 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తే అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ క్రమంలోనే పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సునాయాసంగా విజయం సాధిస్తారని చెప్పారు. ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు సాగుతున్నా ప్రతిపక్షాల కళ్లకు కనిపించడంలేదని విమర్శించారు. కోవిడ్ సమయంలో ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి ఆర్కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, భరత్, ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కోనేటి ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నవాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నాగాలాండ్, మేఘాలయల్లో నేడే పోలింగ్



మేఘాలయలో తీగల వంతెనల మీదుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

షిల్లాంగ్/కొహిమా: నాగాలాండ్, మేఘాలయల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. రెండు రాష్ట్రాల్లో 552 మంది బరిలో ఉన్నారు. 34 లక్షలకు పైగా ఓటర్లు వారి భవితవ్యాన్ని నిర్దేశించనున్నారు. మేఘాలయాలో ఇప్పటిదాకా ఏ పార్టీకి పూర్తి మెజార్టీ దక్కలేదు. నాగాలాండ్‌లో ఏ పార్టీ అన్నిచోట్లా పోటీకి దిగలేకపోయింది!

కశ్మీర్ పండిట్లపై మళ్లీ దాడి

శ్రీనగర్: కశ్మీర్ లోయలో పండిట్లు లక్ష్యంగా మళ్లీ దాడులు మొదలయ్యాయి. పుల్వామా జిల్లా అచన్‌లో ఏటీఎం గార్డుగా పని చేస్తున్న సంజయ్ శర్మ అనే 40 ఏళ్ల కశ్మీరీ పండిట్‌ను ఉగ్రవాదులు ఆదివారం కాల్చి చంపారు. మార్కెట్‌కు వెళుతుండగా మాటు వేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఛాతీపై గుళ్ల వర్షం కురిపించారు. గతేడాది కశ్మీర్లో పౌరులపై 30 ఉగ్ర దాడులు జరగ్గా ముగ్గురు కశ్మీర్ పండిట్లు సహా 18 మంది మరణించారు.

స్కూటీని గుద్ది, 2 కి.మీ. లాక్కెళ్లి...

తాతా మనవళ్లను బలి తీసుకున్న ట్రక్కు

మహోబా(యూపీ): తాత, మనవడు వెళ్తున్న స్కూటీని ఓ ట్రక్కు ఢీకొట్టి, వారిని రెండు కిలో మీటర్ల దూరం వరకు లాక్కెళ్లింది. ఈ ఘటనలో తాత, మనవడు ప్రాణాలు కోల్పోయారు. యూపీలోని మహోబా జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. ఉదిత్ నారాయణ్ చౌరాసియా(66) అనే విశ్రాంత ఉపాధ్యాయుడు, ఆయన ఆరేళ్ల మనవడు మార్కెట్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్థానిక బిజనగర్ మలుపులో ప్రమాదం జరిగిందని సీఐ రామ్ పర్వేశ్ రాయ్ చెప్పారు. తాత, మనవడు సహా ట్రక్కు కింద ఇరుక్కుపోయిన స్కూటీని ట్రక్కు రెండు కిలోమీటర్ల దూరం లాక్కెళ్లింది. స్థానికులు ట్రక్కును అడ్డగించి ఆపేశారు. ఛిద్రమైన తాత, మనవడి మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టంకు పంపారు.

బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ...

ఓ మద్యం కుంభకోణం

ఇరు పార్టీల పోరాటానికి కేంద్ర బిందువు

ఢిల్లీ మద్యం కుంభకోణం. దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారిన వ్యవహారమిది. ఆమ్ ఆద్మీ పార్టీకి, కేంద్రంలోని అధికార బీజేపీకి మధ్య రగడ మరింత పెరగడానికి కారణమైన కేసు. దీనికి సంబంధించిన అరెస్టుల పరంపరలో భాగంగా తాజాగా ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా పేరూ చేరింది. అంతేగాక ఈడీ తన రెండో చార్జిషీట్‌లో ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేరును కూడా ప్రస్తావించింది! ఇంతకీ ఈ మద్యం కుంభకోణం కథా కమామిషు ఏమిటి...?

- సాక్షి, నేషనల్ డెస్క్



ఢిల్లీలో మద్యం దుకాణాలను ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేది. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2020లో నూతన మద్యం విధానాన్ని రూపొందించింది. 2021 నవంబర్‌లో దాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానంలో పలు మార్పులు చేశారు. మద్యం అమ్మకాలను ప్రభుత్వ పరిధి నుంచి తప్పించి, ప్రైవేట్ రిటైల్ వ్యాపారులకు కట్టబెట్టారు. ఢిల్లీని 32 జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో 27 దుకాణాలున్నాయి. ఒక్కో మున్సిపల్ వార్డులో 2–3 చొప్పున దుకాణాలు ఏర్పాటు చేశారు. కొత్త పాలసీ ప్రకారం మద్యాన్ని వినియోగదారులకు 'హోం డెలివరీ' చేయొచ్చు. తెల్లవారుజామున 3 గంటల వరకూ దుకాణాలు తెరిచి ఉంచొచ్చు. వినియోగదారులకు అపరిమితంగా డిస్కౌంట్లు ఇవ్వొచ్చు. అలాగే గరిష్ట అమ్మకం ధర కూడా ఉండదు. డిమాండ్‌ను బట్టి ఏ ధరకైనా అమ్ముకోవచ్చు.

ఇలా బయటపడింది...

2022 ఏప్రిల్‌లో ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వచ్చిన నరేశ్ కుమార్ కొత్త మద్యం విధానం ఫైళ్లను క్షుణ్నంగా అధ్యయనం చేశారు. "విధానం రూపకల్పన, అమల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు అనుచిత లబ్ధి చేకూర్చారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది" అని తేల్చారు. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక రూపొందించారు. విషయాన్ని అప్పట్లో ఎక్సైజ్‌తో పాటు 19 శాఖలను నిర్వహిస్తున్న ఢిల్లీ ఉపముఖ్యమంత్రి, మనీశ్ సిసోడియా దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్ నివేదికపై అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. మద్యం విధానంపై సీబీఐ విచారణకు 2022 జూలైలో ఆదేశాలు జారీ చేశారు. తర్వాత కొన్ని రోజులకే కొత్త విధానాన్ని రద్దు చేస్తున్నామని, పాత మద్యం విధానాన్నే అమలు చేస్తామని కేజ్రీవాల్ సర్కారు ప్రకటించింది. సీబీఐ దర్యాప్తు మాత్రం కొనసాగింది. సిసోడియాతో పాటు ఢిల్లీ ఎక్సైజ్ అధికారులు, ప్రైవేట్ మద్యం వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. 2022 ఆగస్టు 19న ఎఫ్ఐఆర్ నమోదైంది. సిసోడియా సహా మొత్తం 15 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో సీబీఐ చేర్చింది. తర్వాత కేసు దర్యాప్తును ఈడీ చేపట్టింది.

సీఎస్ నివేదికలో ఏముందంటే...

కొత్త మద్యం విధానం పేరిట మద్యం వ్యాపారంలో గుత్తాధిపత్యానికి తెరతీశారు. కొత్త విధానంలోని నిబంధనలనూ ఉల్లంఘించి కొన్ని కంపెనీలకు మద్యం లైసెన్సులు కట్టబెట్టారు. ఎల్జీ అనుమతి లేకుండానే విధానంలో సిసోడియా మార్పులు చేశారు. కరోనా వ్యాప్తి సాకుతో ప్రైవేట్ వ్యాపారులు చెల్లించాల్సిన రూ.144.36 కోట్ల లైసెన్స్ ఫీజును ఆయన మాఫీ చేశారు. పైగా ఒక్కో బీర్ కేసుపై చెల్లించాల్సిన రూ.50 ఇంపోర్ట్ పాస్ ఫీజునూ తొలగించారు. పైగా ప్రైవేట్ వ్యక్తులకు మేలు చేయడమే లక్ష్యంగా విదేశీ మద్యం ధరలను ఇష్టారాజ్యంగా సవరించారు.

ఎఫ్ఐఆర్‌లో ఏముందంటే...

మద్యం వ్యాపారుల నుంచి లంచాలు తీసుకొని అక్రమంగా ఎల్–1 లైసెన్సులు జారీ చేశారు. సిసోడియా సన్నిహితుడైన దినేశ్ అరోరాకు చెందిన రాధా ఇండస్ట్రీస్ బ్యాంకు ఖాతాకు ఇండో స్పిరిట్స్ సంస్థ ఎండీ సమీర్ మహేంద్రు కోటి రూపాయలు బదిలీ చేశారు. ఎల్–1 లైసెన్సులు పొందినవారు రిటైల్ వ్యాపారులకు క్రెడిట్ నోట్లు జారీ చేశారు. వీటిద్వారా ప్రజాప్రతినిధులకు ముడుపులు చేరవేయడమే వారి ఉద్దేశం. ఈ అక్రమాలు, లంచాల బాగోతం బయటపడకుండా లైసెన్స్‌దారులు తమ ఖాతా పుస్తకాల్లో తప్పుడు వివరాలు నమోదు చేశారు. మద్యం వ్యాపారుల నుంచి లంచాలు వసూలు చేసి ప్రజాప్రతినిధులకు చేరవేయడంలో సిసోడియా సన్నిహితులు అమిత్ అరోరా, దినేశ్ అరోరా, అర్జున్ పాండే కీలకంగా వ్యవహరించారు. సమీర్ మహేంద్రు నుంచి అర్జున్ పాండే 2 నుంచి 4 కోట్ల దాకా వసూలు చేశారు. ఎల్–1 లైసెన్స్ పొందిన మహాదేవ్ లిక్కర్స్ ప్రతినిధి సన్నీ మార్వాకు ఢిల్లీ ప్రభుత్వాధికారులతో సన్నిహిత సంబంధాలున్నాయి. వారికి తరచుగా లంచాలు ఇస్తుంటాడని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కొత్త మద్యం విధానం వల్ల ఢిల్లీ ఖజానాకు రూ.8,000 మేర నష్టం వాటిల్లిందని బీజేపీ ఎంపీ మనోజ్ ఆరోపించారు. కుంభకోణం విలువ రూ.10,000 కోట్లకు పైగానే ఉంటుందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా ఆరోపించడం తెలిసిందే.

సిసోడియా అరెస్ట్

8 గంటల విచారణ అనంతరం అదుపులోకి..

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి ఆప్ నేత మనీశ్ సిసోడియాను ఆదివారం సాయంత్రం సీబీఐ అరెస్ట్ చేసింది. అంతకుముందు ఆయన్ను 8 గంటలపాటు ప్రశ్నించింది. సీబీఐ నోటీసుల మేరకు సిసోడియా ఉదయం 11.12 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. విచారణలో భాగంగా సీబీఐ అధికారుల బృందం మద్యం విధా నంలో వివిధ కోణాలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దినేశ్ అరోరా తదితరులతో సంబంధాలు, వేర్వేరు ఫోన్ల నుంచి పంపించిన మెసేజీలపై ఆయన్ను గుచ్చిగుచ్చి ప్రశ్నించింది. 'సిసోడియా సమాధానాలతో సీబీఐ అధికారులు సంతృప్తి చెందలేదు. విచారణలో ఆయన సహకరించడం లేదు. కీలకమైన అంశాలపై సరైన వివరణ ఇవ్వకుండా తప్పించుకున్నారు. అందుకే అరెస్ట్ చేశారు' అని సీబీఐ అధికారులు చెప్పారు. ఆయన్ను మరింత లోతుగా ప్రశ్నించేందుకు కస్టోడియల్ దర్యాప్తు అవసరం ఉందని అధికారులు భావించారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 9 మంది అరెస్టైన విషయం తెలిసిందే.

అరెస్టుకు భయపడేదిలేదు

సీబీఐ కార్యాలయానికి రావడానికి ముందుగా సిసోడియా ఆదివారం ఉదయం రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అనంతరం భారీ సంఖ్యలో మద్దతుదారులతో కలిసి సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అధికారిక వాహనంలో నుంచే ఆయన మీడియాతో మాట్లాడారు. తనను అరెస్ట్ చేయవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. 'నాపై మోపిన తప్పుడు ఆరోపణలపై జైలుకు వెళ్లేందుకైనా భయపడేది లేదు. నా భార్య, నా కుటుంబం ఎల్లప్పుడూ నాకు మద్దతుగా నిలుస్తుంది. నేను జైలుకెళ్లినా నా మద్దతుదారులు నా కుటుంబానికి అండగా నిలుస్తారు' అని పేర్కొన్నారు. "మేం భగత్ సింగ్ అనుచరులం. భగత్ సింగ్ దేశం కోసం ప్రాణాలర్పించారు. ఆయనతో పోలిస్తే తప్పుడు ఆరోపణలపై నేను జైలుకు వెళ్లాల్సి రావడం చాలా చిన్న విషయం'అన్నారు. సిసోడియాను ప్రశ్నించడాన్ని నిరసిస్తూ సీబీఐ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన ఆప్ నేతలు సంజయ్ సింగ్, గోపాల్ రాయ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీబీఐ కార్యాలయం పరిసరాల్లో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. జేఎల్ఎన్ స్టేడియం రోడ్డులో మధ్యాహ్నం నుంచి బారికేడ్లు ఏర్పాటు చేశారు. మీడియా సహా అందరిపైనా ఆంక్షలు విధించారు. ఈ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్‌లో సిసోడియా ఒకటో నిందితుడిగా ఉన్నారు. 2022 అక్టోబర్ 17వ తేదీన సిసోడియాను సీబీఐ తొలిసారి ప్రశ్నించింది. ఆయనపై ఐపీసీ 120–బి(పనిష్మెంట్ ఆఫ్ క్రిమినల్ కాన్‌స్పిరసీ), 477ఏ(ఫాల్సిఫికేషన్ ఆఫ్ అకౌంట్స్)తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7(అధికారం దుర్వినియోగంతో అవినీతికి పాల్పడటం) కింద కేసులు పెట్టారు.

దుష్ట రాజకీయాల్లో భాగమిది: కేజ్రీవాల్

డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేయడం దుష్ట రాజకీయాలే కారణమని సీఎం కేజ్రీవాల్ చెప్పారు. మనీశ్ అమాయకుడు. రాజకీయంగా కక్ష సాధించేందుకే ఆయన్ను అరెస్ట్ చేశారు. ప్రజలెంతో ఆగ్రహంతో ఉన్నారు. ప్రజలు అన్ని విషయాలూ గమనిస్తున్నారు. ప్రతిదీ అర్థం చేసుకుంటున్నారు. దీనికి తగిన జవాబు ఇస్తారు. తాజా పరిణామంతో మేం మరింత బలంగా తయారవుతాం'అని ఆయన హిందీ ట్వీట్ చేశారు.

నియంతృత్వానికి పరాకాష్ట: ఆప్

సిసోడియా అరెస్టును నియంతృత్వానికి పరాకాష్టగా ఆప్ అభివర్ణించింది. 'ఉత్తమ విద్యా మంత్రి, మంచి వ్యక్తి అయిన సిసోడియాను అరెస్ట్ చేయడం సరికాదు. దీని వెనుకాల ఉన్న ప్రధాని మోదీని ఆ దేవుడు కూడా క్షమించడు. మీ నియంతృత్వానికి త్వరలో తెర పడక తప్పదు''అంటూ ఎంపీ సంజయ్ సింగ్ మండిపడ్డారు.



విచారణ కోసం సీబీఐ ఆఫీస్‌కు వెళ్తున్న సిసోడియా

త్వరలో మరో 'జోడో'!

ఈసారి తూర్పు నుంచి పశ్చిమానికి



ప్లీనరీలో పార్టీ నేతలనుద్దేశిస్తూ ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

- ఐదు సూత్రాల రాయ్‌పూర్ డిక్లరేషన్
- ముగిసిన 3 రోజుల కాంగ్రెస్ ప్లీనరీ
- అదానీపై రాహుల్‌గాంధీ నిప్పులు

నవా రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): అదానీ వ్యవహారంలో మోదీ సర్కారుపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నిప్పులు చెరిగారు. అధికార బీజేపీ నేతలు నిస్సిగ్గుగా అదానీ గ్రూపుకు ఏకంగా పార్లమెంటులోనే కొమ్ముకాస్తున్నారంటూ ధ్వజమెత్తారు. వ్యాపార మిషతో వచ్చి భారత్‌ను ఆక్రమించిన ఈస్టిండియా కంపెనీతో అదానీ గ్రూపును పోల్చారు! అక్రమ మార్గాల్లో భారీగా సంపద పోగేసి దేశానికి వ్యతిరేకంగా పని చేస్తోందని ఆరోపించారు. దీనిపై మోదీ స్పందనేమిటని పార్లమెంటులో విపక్షాలన్నీ నిలదీస్తే అది తప్ప అన్ని విషయాలపైనా మాట్లాడారంటూ ఎద్దేవా చేశారు. "దీనిపై నిజం వెలుగు చూసేదాకా అదానీ గ్రూపు వ్యాపార పద్ధతులు తదితరాలపై ప్రశ్నాస్త్రాలు సంధిస్తూనే ఉంటాం. అవసరమైతే పార్లమెంటులో వెయ్యిసార్లైనా దీన్ని ప్రస్తావిస్తాం'' అని స్పష్టం చేశారు. ఆదివారం రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ 85వ ప్లీనరీ మూడో రోజు ముగింపు సమావేశాలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. "అదానీకి ఒక్కటే చెప్పదలచా. ఆయన కంపెనీ దేశానికి నష్టం చేస్తోంది. దేశ మౌలిక వసతులన్నింటినీ చెరబడుతోంది'' అని తీవ్ర ఆరోపణలు చేశారు. "పోర్టులు తదితరాలతో పాటు దేశ సంపదను చెరబట్టిన కంపెనీకి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం మేం చేస్తున్న పోరాటమిది'' అని వ్యాఖ్యానించారు. "చరిత్ర పునరావృతమవుతోంది. అవసరమైతే మరోసారి మరో కంపెనీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుంది'' అని ప్రకటించారు.

కశ్మీరీల్లో దేశభక్తిని రగిల్చాం...

భారత్ జోడో యాత్ర ద్వారా జరిగిన 'తపస్సు' తాలూకు స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాహుల్ పిలుపునిచ్చారు. "అందుకు కావాల్సిన వ్యూహాలు రూపొందించండి. దేశమంతటితో పాటు నేను కూడా వాటిలో భాగస్వామిని అవుతా'' అని సూచించారు. తద్వారా త్వరలో మరో దేశవ్యాప్త యాత్ర ఉంటుందని సంకేతాలిచ్చారు. "జోడో యాత్రలో ప్రజలు లక్షలాదిగా పాల్గొన్నారు. యాత్ర పొడవునా నేనెంతో నేర్చుకున్నా. కన్యాకుమారిలో మొదలై కశ్మీర్ చేరేసరికి ఎంతగానో మారాను. మిగతా ప్రజలంతా ఆనందంగా ఉంటే కశ్మీరీలు మాత్రమే ఎందుకు బాధల్లో ఉన్నారని ఒక బాలుడు అడిగాడు. నా యాత్ర కశ్మీర్‌లో ప్రవేశించాక పోలీసు సిబ్బంది పత్తా లేకుండా పోయారు. కానీ ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు అంతటా వేలాదిగా కశ్మీరీలు త్రివర్ణం చేబూని నాతో పాటు నడిచారు. తానూ లాల్‌చౌక్‌లో జాతీయ జెండా ఎగరేశానని మోదీ చెప్పుకున్నారు. నాతోపాటు వేలాది మంది కశ్మీరీలు లాల్‌చౌక్‌లో జాతీయ పతాకాన్ని ఎగరేశారు. త్రివర్ణంపై కశ్మీరీల్లో ప్రేమను మోదీ తన వేధింపు చర్యల ద్వారా దూరం చేస్తే మేం దాన్ని వారిలో తిరిగి పాదుగొల్పాం. ఈ తేడాను ఆయన అర్థం చేసుకోలేకపోయారు'' అని కాంగ్రెస్ ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య చెప్పుకొచ్చారు.

సమైక్యంగా శ్రమిద్దాం... ఎన్నికల పరీక్ష నెగ్గుదాం

"కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్తాన్, తెలంగాణల్లో అసెంబ్లీ ఎన్నికలున్నందున ఈ ఏడాదంతా చాలా కీలకం. ఆ ఎన్నికల్లో విజయానికి సమైక్యంగా, క్రమశిక్షణతో కృషి చేయండి'' అని పార్టీ నేతలు, కార్యకర్తలకు రాయ్‌పూర్ ప్లీనరీ పిలుపునిచ్చింది. తద్వారా 2024 లోక్‌సభ ఎన్నికలకు చక్కని వేదిక సిద్ధం చేసుకుందామని పేర్కొంది. ఈ మేరకు ఐదు సూత్రాలతో రాయ్‌పూర్ డిక్లరేషన్‌ను ప్లీనరీ ఆమోదించింది. భావ సారూప్యమున్న పార్టీలతో నిర్మాణాత్మక ఉమ్మడి ప్రణాళికతో కలిసి పని చేసేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అందులో పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, అది ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ పేర్కొంది. "బీజేపీ, ఆరెస్సెస్‌లతో, వాటి మోసపూరిత రాజకీయాలతో ఎన్నడూ రాజీ పడని ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ నియంతృత్వానికి, మతవాద, ఆశ్రిత పెట్టుబడిదారీ పోకడలకు వ్యతిరేకంగా దేశ రాజకీయ విలువ పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటాం. నానాటికీ పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, సమాజంలో చీలిక తెచ్చే యత్నాలు, రాజకీయ నియంతృత్వాలపై రాజీలేని పోరాటం చేస్తాం. ఇందుకోసం భావ సారూప్య పార్టీలతో కలిసి పని చేస్తాం'' అని డిక్లరేషన్‌లో పేర్కొంది.

పాసీఘాట్ నుంచి పోరుబందర్ దాకా...!

తూర్పున అరుణాచల్‌ప్రదేశ్‌లోని పాసీఘాట్ నుంచి పశ్చిమాన గుజరాత్‌లోని పోరుబందర్ దాకా మరో దేశవ్యాప్త పాదయాత్ర చేసే యోచన ఉన్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. "భారత్ జోడో యాత్ర సక్సెస్‌తో పార్టీలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. మరో యాత్ర కోసం కార్యకర్తలు ఉవ్విళ్లూరుతున్నారు. అది జోడో యాత్రకు భిన్నంగా ఉంటుంది. దారి పొడవునా నదులు, దుర్గమారణ్యాలున్నందున చాలావరకు కాలినడకన, అక్కడక్కడా ఇతరత్రా సాగొచ్చు. జూన్‌కు ముందు గానీ, నవంబర్ ముందు గానీ కొత్త యాత్ర మొదలు కావచ్చు. కొద్ది వారాల్లో నిర్ణయం తీసుకుంటాం'' అని వివరించారు.

నియంతృత్వంపై పోరాడతాం: ఖర్గే

రాయ్‌పూర్: ప్రజాస్వామ్య పరిరక్షణకు, మోదీ సర్కారు నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే చెప్పారు. ఆదివారం రాయ్‌పూర్ శివార్లలో కాంగ్రెస్ ర్యాలీలో ఆయన మాట్లాడారు. "గౌతమ్ అదానీ సంపద అపారంగా పెరిగిపోవడం వెనక మర్మమేంటో ప్రధాని మోదీ మాకూ చెప్పాలి. ఒక్క వ్యక్తి కోసం దేశాన్ని తాకట్టు పెట్టారు'' అంటూ దుయ్యబట్టారు.

ఇటలీ సముద్ర జలాల్లో పడవ మునక



రోమ్: ఇటలీ సముద్ర జలాల్లో వలసదారులు ప్రయాణిస్తున్న ఒక చెక్క పడవ రెండు ముక్కలై నీళ్లల్లో మునిగిపోయింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో ఎందరో మరణించారు. ఇప్పటివరకు సహాయ సిబ్బంది 58 మృతదేహాలను వెలికి తీశారు. మరో 60 మంది ప్రాణాలు కాపాడారని స్టేట్ టీవీ వెల్లడించింది. ప్రమాదం జరిగినప్పుడు పడవలో 180 మందికి పైగా శరణార్థులున్నట్టుగా తీర ప్రాంత పట్టణమైన క్రోటోన్‌లో ఓడరేవు అధికారులు చెబుతున్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికుల్ని ఎక్కించడం వల్లే అయోనియాన్ సముద్రంలో ప్రయాణిస్తున్న పడవ ధ్వంసమై ఈ ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమికంగా తెలుస్తోంది.

యూఎస్ విమానం Vs చైనా యుద్ధ విమానం

వాషింగ్టన్: దక్షిణ చైనా సముద్రం మీద డ్రాగన్ దుందుడుకు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అమెరికా నిఘా విమానాన్ని చైనా జే–11 యుద్ధ విమానం వెంబడించడం కలకలం సృష్టించింది. గగనతలం నుంచి గగనతలంలో లక్ష్యాలను ఛేదించే క్షిపణులున్న ఈ విమానం పరాసల్ ద్వీప సమూహం దగ్గర అమెరికా పీ–8 పోసీడాన్ విమానాన్ని 21,500 అడుగుల ఎత్తులో వెంబడించింది. "చైనా గగన తలానికి 12 నాటికల్ మైళ్ల దాకా వచ్చారు. ఇంకా ముందుకొస్తే తీవ్ర పరిణామాలంటాయి'' అని హెచ్చరించింది. కాసేపటికే అమెరికా విమానం రెక్కలకు కేవలం కొన్ని వందల అడుగుల దూరం వరకు వెళ్లింది! ఇలా 15 నిమిషాలు వెంబడించాక వెనుదిరిగింది. పరాసల్ ద్వీపాలపై చైనా హక్కులను అమెరికా అంగీకరించడం లేదు. దీనిపై విభేదాలు నెలకొన్నాయి.

పాక్, చైనాలకు సాయం కట్: నిక్కీ హేలీ

వాషింగ్టన్: తాను అధికారంలోకి వస్తే అమెరికాను ద్వేషించే దేశాలకు ఆర్థిక సాయాన్ని పూర్తిగా నిలిపివేస్తానని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న ఇండియన్ అమెరికన్ నిక్కీ హేలీ చెప్పారు. చైనా, పాకిస్తాన్, ఇరాక్ వంటి దేశాలకు ఒక సెంట్ కూడా ఇవ్వనన్నారు. "చెడ్డ దేశాలకు అమెరికా ఇక మీదట ఎలాంటి సాయం చేయదు. మన మిత్రదేశాలు, మన శత్రువుల్ని కూడా తమ శత్రువులుగా చూసేవారికే ఏ సాయమైనా అందిస్తాం'' అని న్యూయార్క్ పోస్టు వ్యాసంలో రాసుకొచ్చారు.

పాక్‌లో వేతనాలు, బిల్లుల చెల్లింపులు బంద్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఆర్థిక కష్టాలతో షహబాజ్ షరీఫ్ సర్కారు అతలాకుతలమవుతోంది. ప్రభుత్వోద్యోగులు, సిబ్బంది వేతనాలు సహా అన్ని బిల్లుల చెల్లింపుల్ని నిలిపేసింది. తదుపరి ఉత్తర్వుల దాకా శాఖలు, డివిజన్లు అనుబంధ విభాగాల బిల్లులను క్లియర్ చేయొద్దని ఆదేశించింది. మరోవైపు అత్యవసరమైన మందులు కూడా దొరక్క రోగులు నరకం చూస్తున్నారు. అత్యవసర ఆపరేషన్లు కూడా ఆగిపోతున్నాయి!

పంజాబ్ జైల్లో ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు మృతి

అమృత్‌సర్: పంజాబ్‌లో తరన్‌తరన్ జిల్లా గోవింద్‌వాల్ సాహిబ్ సెంట్రల్ జైలులో ఖైదీల మధ్య జరిగిన గొడవలో ఇద్దరు గ్యాంగ్‌స్టర్లు మృతి చెందారు. వీరికి గాయకుడు సిద్ధు మూసేవాలా హత్యతోపాటు పలు కేసులతో సంబంధముందని అధికారులు తెలిపారు. ఈ కేసు నిందితులు మన్‌దీప్ సింగ్, మన్మోహన్ సింగ్, కేశవ్, మరికొందరు ఇదే జైల్లో ఉన్నారు. రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో మన్‌దీప్, మన్మోహన్ చనిపోగా కేశవ్ తీవ్రంగా గాయపడ్డాడని అధికారులు ఆదివారం చెప్పారు.

ఇ-సంజీవనితో డిజిటల్ విప్లవం: మోదీ



న్యూఢిల్లీ: భారత్‌లో డిజిటల్ విప్లవం తన సత్తా చాటుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇ–సంజీవని యాప్ దీనికి నిదర్శనమని చెప్పారు. ఆన్‌లైన్‌లో మెడికల్ కన్సల్టేషన్ చేసే ఈ యాప్ ద్వారా 10 కోట్ల మందికి పైగా లబ్ధి పొందారని తెలిపారు. ప్రతీ నెల చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ సాధారణ ప్రజలు, మధ్యతరగతి వారు, మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి ఈ యాప్ ప్రాణ రక్షణగా మారిందని చెప్పారు. ఈ యాప్ ఒక్కటి చూసి భారత్ డిజిటల్ పవర్ ఏంటో చెప్పవచ్చునని అన్నారు. ఒక డాక్టర్, ఒక రోగితో మాట్లాడిన ఆయన, ఇ–సంజీవని యాప్ ఎంత ఉపయోగకరమో వివరించారు. "ఇది మనం సాధించిన అతి పెద్ద ఘనత. భారత దేశ ప్రజలు టెక్నాలజీని మన జీవితంలో ఎలా భాగం చేసుకున్నారో చెప్పడానికి ఇది సజీవ సాక్ష్యం. కరోనా సమయంలో ఈ యాప్ ప్రజలందరికీ ఒక వరంలా మారడం మనం కళ్లారా చూశాము'' అని ప్రధాని చెప్పారు. ఇక నగదు చెల్లింపుల్లోనూ యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సరికొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. సింగపూర్‌కు చెందిన పేనౌకి కూడా యాక్సెస్ లభించడంతో రెండు దేశాల ప్రజల మధ్య కూడా డిజిటల్ చెల్లింపులు మరింత సులభతరంగా మారాయన్నారు. యూపీలో కొత్తగా నియమితులైన పోలీసులనుద్దేశించి మోదీ మాట్లాడారు. లక్నోలో ఉద్యోగ మేళాలో 9 వేల మందికి ఆయన నియామక పత్రాలిచ్చారు.

నేడు కర్ణాటకకు ప్రధాని

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం పర్యటించనున్నారు. రూ.450 కోట్లతో నిర్మించిన శివమొగ్గ విమానాశ్రయాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏడాది కర్ణాటకలో ప్రధాని పర్యటించడం ఇది ఐదోసారి!



బుల్లి రోబో టీచరమ్మ

చిన్నారుల మధ్య కనిపిస్తున్న ఈ బొమ్మ నిజానికి ఒక హ్యూమనాయిడ్ రోబో. పేరు శిక్షా. నాలుగో తరగతి విద్యార్థులకు సైతం పాఠాలు చెప్పగల సామర్థ్యం ఈ రోబోకు ఉంది. బెంగళూరులో ఓ పాఠశాలలో తీసిందీ ఫొటో.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
సోమవారం • 27 • ఫిబ్రవరి • 2023

ఉపరాష్ట్రపతి పుదుచ్చేరి పర్యటన రద్దు



సాక్షి, చెన్నై: ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ పుదుచ్చేరి పర్యటన రద్దయ్యింది. ఈనెల 28వ తేదీన పుదుచ్చేరి వర్సిటీలో పలు కార్యక్రమాలకు ఆయన హాజరు కావాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై పుదుచ్చేరి అధికారులు దృష్టి పెట్టారు. తొలిసారిగా తమ రాష్ట్రానికి వస్తున్న ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పుదుచ్చేరి సీఎం రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పర్యటన రద్దయినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు.


తనిఖీలు చేపడుతున్న పారా మిలిటరీ బలగాలు


ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న అధికారులు


మోడ్రన్ పోలింగ్‌బూత్

నేడే ఉప సమరం!



ఈరోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. అన్ని పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు, వీవీ ప్యాట్, కంట్రోలింగ్ పరికరాలు, ఓటింగ్‌కు అవసరమయ్యే అన్ని వస్తువులను ఇప్పటికే సిద్ధం చేశారు. నియోజకవర్గాన్ని నిఘా వలయంలోకి తీసుకొచ్చారు. దాడులకు పాల్పడినా, వాటిని ధ్వంసం చేసినా కఠిన చర్యలు తప్పవని ఈరోడ్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృష్ణన్ ఉన్ని హెచ్చరించారు.

- ఈరోడ్‌లో ఓటింగ్‌కు సర్వం సిద్ధం
- నిఘా నీడలో పోలింగ్ కేంద్రాలు
- తూర్పు నియోజకవర్గంలో భద్రత పెంపు
- ఈవీఎంలను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు
- ఎన్నికల అధికారి కృష్ణన్ ఉన్ని హెచ్చరిక


స్ట్రాంగ్ రూము ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

సాక్షి, చెన్నై: ఎమ్మెల్యే తిరుమగన్ ఈవేరా ఆకస్మిక మృతి కారణంగా ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో బై ఎలక్షన్ అనివార్యమైంది. ఈ మేరకు గత నెలలో ఉప ఎన్నికల నగారా మోగింది. తిరుమగన్ ఈవేరా తండ్రి ఈవీకేఎస్ ఇలంగోవన్ డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అన్నాడీఎంకే అభ్యర్థిగా తెన్నరసు, డీఎండీకే అభ్యర్థిగా ఆనందన్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా మేనకా నవనీతన్ బరిలో దిగారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు 77 మంది పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియడంతో ఆదివారం ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి కృష్ణన్ ఉన్ని, ప్రత్యేక పర్యవేక్షణాధికారి రాజ్‌కుమార్ యాదవ్, రిటర్నింగ్ అధికారి శివకుమార్ పర్యవేక్షణలో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలను మధ్యాహ్నం తర్వాత గట్టి భద్రత మధ్య తరలించారు.

2 వేల మందితో భద్రత..

నియోజకవర్గంలో 52 చోట్ల 238 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో 40 సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అలాగే దివ్యాంగుల కోసం 10 చోట్ల మోడరన్ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో 5 ఈవీఎంలు, వీవీ ప్యాట్, కంట్రోలింగ్ పరికరాన్ని అమర్చారు. ఓటింగ్‌కు అవసరమయ్యే అన్ని రకాల సామాగ్రిని పోలింగ్ బూత్ ఎన్నికల అధికారులు సిద్ధంగా ఉంచారు. పోలింగ్‌కు 1200 మంది సిబ్బందిని నియమించారు. అలాగే బూత్‌ల వద్ద 2 వేల మందితో భద్రత కల్పించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో పారా మిలటరీ బలగాలతో పాటు ఈరోడ్ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి భారీస్థాయిలో పోలీసులను రంగంలోకి దించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చే ప్రత్యేక ప్రతిభావంతులు, దివ్యాంగుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆయా పోలింగ్ బూత్‌లకు రెండు వందల మీటర్ల వరకు ఎవరిని అనుమతించరు. పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, వివిధ గుర్తింపు కార్డులు, బూత్‌స్లిప్‌లు కలిగిన ఓటర్లను మాత్రమే అనుమతించే విధంగా చర్యలు తీసుకున్నారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో షామియానా పందిళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ సాగనుంది.


భద్రత మధ్య ఈవీఎంలను తరలిస్తున్న అధికారులు

నిబంధనలు అతిక్రమిస్తే..

అన్ని పోలింగ్ బూత్‌లలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ చెన్నైలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సత్యప్రద సాహూ నేతృత్వంలోని బృందం పర్యవేక్షిస్తుంటుంది. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారి కృష్ణన్ ఉన్ని పేర్కొంటూ, తూర్పు నియోజకవర్గంలో 2, 27, 547 మంది ఓటర్లు ఉన్నారని గుర్తు చేశారు. ఇందులో పురుషులు 1,11,025 మంది, స్త్రీలు 1,16,497 మంది, ఇతరులు 25 మంది ఉన్నట్లు వివరించారు. ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు,. నిఘా కట్టుదిట్టం చేశామని, పోలీసులు, పారా మిలటరీ తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 238 పోలింగ్ బూత్‌ల కోసం 1430 ఈవీఎంలు, 310 వీవీ ప్యాట్‌లు సిద్ధం చేసి పంపించామని వివరించారు. ఓటింగ్ ప్రక్రియ ముగియగానే స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలను తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లో మూడు అంచెల భద్రతను కల్పించామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, ఈ నియోజకవర్గంలో ఎన్నికల పనుల కోసం వచ్చిన రాజకీయ పార్టీల నాయకులు, పొరుగున ఉన్న మరో నియోజకవర్గ పరిధిలోని హోటళ్లు, లాడ్జీల్లో తిష్ట వేసి అక్కడి నుంచే తమ రాజకీయ వ్యూహాలకు పదును పెట్టారు. దీంతో నియోజకవర్గ సరిహద్దుల్లోనూ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

తిథి ఇచ్చి తిరిగొస్తూ..!

- వ్యాన్‌ను ఢీకొన్న లారీ
- నలుగురి మృతి
- 30 మందికి గాయాలు
- ఐదుగురి పరిస్థితి విషమం


ఘటనా స్థలంలో బోల్తాపడిన వ్యాన్, క్షతగాత్రులు

సాక్షి, చెన్నై: మరణించిన తమ కుటుంబంలోని వ్యక్తికి తిథి (తిలోదకాలు) ఇచ్చి తిరిగివస్తున్న వారిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. సరుకుల వ్యాన్‌ను.. లారీ అతివేగంగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురు ఘటనా స్థలంలోనే మరణించారు. మరో 30 మంది గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాంగేయం సమీపంలో ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. తిరుప్పూర్ జిల్లా వెల్లకోయిల్ సమీపంలోని పచ్చపాళయానికి చెందిన వ్యక్తి ఇటీవల మరణించాడు. ఆయన ఆత్మశాంతి కోసం తిథి ఇవ్వాలని కుటుంబ సభ్యులు, బంధువులు నిర్ణయించారు. 40 మంది పచ్చపాళయం నుంచి సరకుల వ్యాన్‌లో శనివారం కొడుముడికి వెళ్లారు. అక్కడ తిథి ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం వీరు ప్రయాణిస్తున్న సరకుల వ్యాన్‌ను గాంగేయం సమీపంలోని ముత్తూరు వాలి పనంగాడు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సరుకుల వ్యాన్ బోల్తా పడింది. అందులో ఉన్న వారు చెల్లాచెదురుగా పడ్డారు. స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. కాంగేయం పోలీసులు గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో కాంగేయం, తిరుప్పూర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలోనే చిట్టుస్వామి (55), సరోజ (61), తమిళరసి (17), పూంగుడి (62) మరణించారు. 30 మంది గాయపడ్డారు. వీరంతా పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వై తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈమేరకు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం విషయం తెలియడంతో పచ్చపాళయం గ్రామం శోకసంద్రంగా మారింది.

బాధితులకు సీఎం సాయం

ప్రమాద సమాచారంతో సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షలు, గాయపడ్డ వారికి రూ. 50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

చెన్నై - పుదుచ్చేరి మధ్య సరుకు రవాణా ప్రారంభం


పుదుచ్చేరి హార్బర్‌లో ఆగి ఉన్న నౌక


చెన్నైకు బయలుదేరిన నౌక

సాక్షి, చెన్నై: పుదుచ్చేరి– చెన్నై మధ్య నౌకల ద్వారా సరకుల రవాణాకు ఆదివారం శ్రీకారం చుట్టారు. చెన్నైకు అనుబంధంగా పుదుచ్చేరి హార్బర్‌ను అభివృద్ధి చేయడంతో ఇకపై సరకు రవాణా మరింత సులభతరం కానుంది. చెన్నై హార్బర్‌కు నిత్యం నౌకల ద్వారా కంటైనర్లు వచ్చి చేరుతున్న విషయం తెలిసిందే. సమగ్ర తనిఖీలు, పరిశీలన అనంతరం కంటైనర్లను బయటకు పంపిస్తుండడంతో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. దీంతో వాహనాలు ఆ పరిసరాల్లో నిత్యం బారులు తీరి ఉంటున్నాయి. చెన్నైకు రోజురోజుకూ నౌకల రాక పెరగడంతో దీనికి అనుబంధంగా పుదుచ్చేరి హార్బర్‌ను తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన అన్ని పనులనూ ముగించారు. హోప్ సెవన్ పేరిట తొలి నౌక ఈ హార్బర్ నుంచి సరకులతో చెన్నైకు ఆదివారం బయలు దేరింది. ఇది మంగళవారం చెన్నై నుంచి తిరుగు ప్రయాణం కానుంది. ఈ నౌక కారణంగా దక్షిణాది జిల్లాలకు సరకుల రవాణ మరింత సులభతరం చేయడానికి అవకాశం దక్కినట్టైంది. చెన్నై నుంచి కంటైనర్లు దక్షిణ తమిళనాడు వైపుగా వెళ్లేందుకు సమయం పడుతోంది. అదే పుదుచ్చేరి నుంచి అయితే సమయం తగ్గడమే కాకుండా, రవాణా సులభతరం కానుంది. చెన్నై – పుదుచ్చేరి మధ్య నౌకల ద్వారా సరకుల రవాణా తొలి ప్రయత్నం విజయవంతమైన పక్షంలో, ఇకపై అన్ని రకాల నౌకల సేవలకు సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నారు. పుదుచ్చేరి హార్బర్ కారణంగా 1000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు దక్కే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పుదుచ్చేరి హార్బర్‌లోనే అన్ని రకాల కస్టమ్స్ క్లియరెన్స్ తీసుకుని.. త్వరితగతిన సరకులు రవాణా అయ్యేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

అప్పులు కాటేశాయి!

- అన్నదమ్ములు హ్యాండిచ్చేశారు..
- భార్య, కుమార్తెతో రైతు ఆత్మహత్య

సాక్షి, చెన్నై: అప్పు ఇచ్చిన వారి నుంచి వేధింపులు. ఆస్తి పంపకాల విషయంలో అన్నదమ్ములు మోసం వెరసి ఓ రైతు కుటుంబంతో సహా బలన్మరణానికి పాల్పడ్డారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా శివగిరి తాలుకా దేవపట్నం నాయుడి వీధికి చెందిన రామన్(48)కి భార్య కమల(45), కుమారుడు రాజ్‌కుమార్ (20), పద్దెనిమిదేళ్ల కుమార్తె ఉన్నారు. రాజ్‌కుమార్ శివకాశి సమీపంలోని ఓ ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. వ్యవసాయ పనుల కోసం రామన్ అనేక చోట్ల అప్పులు చేశాడు. అలాగే, కమల కూడా తన ఆడంబారాల కోసం బంధువుల వద్ద బాగానే అప్పు చేసింది. కుటుంబ ఆస్తి పంపకాలు జరగగానే, అందరి అప్పులు తీర్చేయాలని రామన్ నిర్ణయించాడు. అయితే, అప్పులిచ్చిన వారి నుంచి రోజురోజుకూ ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు కుమార్తెకు వివాహ ఏర్పాట్లపై దృష్టిపెట్టాడు. అయితే, ఆస్తి పంపకాల విషయంలో అన్నదమ్ములు హ్యాండిచ్చేయడంతో రామన్ తీవ్ర మనో వేదనలో పడ్డాడు. కుటుంబ ఆస్తిని పంచకుండా అన్నదమ్ములు మౌనంగా ఉండడంతో ఆందోళనకు లోనయ్యాడు. దీంతో రుణదాతల ఒత్తిడిని తట్టుకోలేక కుటుంబంతో కలిసి ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు. తన పంట పొలంలోకి శనివారం రాత్రి భార్య, కుమార్తెతో వెళ్లాడు. అక్కడ వీరంతా క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పు ఇచ్చిన వారి వేధింపులు, తన అన్నదమ్ములు వ్యవహరించిన తీరును లేఖగా రాసి పెట్టి ఆ ముగ్గురూ బలన్మరణానికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయాన్నే రామన్, అతడి భార్య కుమార్తె మృతదేహాలుగా తేలడంతో బంధువులు తీవ్ర ఆవేదనలో మునిగారు. కుమారుడు రాజ్‌కుమార్ హస్టల్‌లో ఉండడంతో అతడికి ఈ సమాచారం చేర వేశారు. శివగిరి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెన్‌కాశి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రూ. 2 కోట్ల విలువైన బంగారం సీజ్

- ఎయిర్ లైన్స్ సిబ్బంది సహా ఐదుగురి అరెస్టు

సాక్షి, చెన్నై: థాయ్‌లాండ్, శ్రీలంక నుంచి చెన్నైకు తరలిస్తున్న రూ. 2 కోట్లు విలువైన బంగారాన్ని విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు ఆదివారం సీజ్ చేశాయి. ఓ విమాన సంస్థ సిబ్బందితో పాటు ఐదుగురిని అరెస్టు చేశారు. వివరాలు.. థాయ్‌లాండ్, శ్రీలంక రాజధాని కొలంబో నుంచి తమిళనాడులోకి పెద్దఎత్తున బంగార అక్రమ రవాణా అవుతోన్నట్లు నిఘా వర్గాలకు ముందస్తు సమాచారం అందాయి. దీంతో శనివారం రాత్రి థాయ్‌లాండ్ నుంచి వచ్చిన విమానంలోని ప్రయాణికులను తనిఖీ చేయగా ఇద్దరు తమ లో దుస్తుల్లో దాచి ఉంచిన బంగారం బయట పడింది. అలాగే కొలంబో నుంచి వచ్చిన మరో విమానంలోని ఇద్దరు ప్రయాణికుల నుంచి కూడా బంగారాన్ని గుర్తించారు. ఈ నలుగురి నిందితుల నుంచి 1.5 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో అంతర్జాతీయ టెర్మినల్ నుంచి ఎయిర్ ఇండియా ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన ఓ సిబ్బంది హుటాహుటిన బయటకు వెళ్తుండడాన్ని కస్టమ్స్ అధికారులు గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి సూట్ కేసు, లో దుస్తుల్లోని 2.5 కేజీల బంగారాన్ని సీజ్ చేశారు. అతడ్ని కూడా అరెస్టు చేశారు. పట్టుబడ్డ మొత్తం 4 కేజీల బంగారం విలువ రూ. 2 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

సేలం, తిరుచ్చి, నెల్లైలోనూ మెట్రో సేవలు


మెట్రో రైలు

- ఏప్రిల్ నాటికి పూర్తికానున్న నివేదిక

సాక్షి, చెన్నై: సేలం, తిరుచ్చి, తిరునల్వేలి(నెల్లై) లోనూ మెట్రో రైలు సేవలకు కార్యాచరణ సిద్ధం అవుతోంది. ఈ అంశంపై ఏప్రిల్ నాటికి సాధ్యాసాధ్యాలపై నివేదిక పూర్తయ్యే అవకాశం ఉందని మెట్రో అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం కింద వివరాలను కోరిన వ్యక్తికి తెలియజేశారు. చెన్నైలో ప్రస్తుతం రెండు మార్గాల్లో మెట్రో రైలు సేవలు అందుతున్నాయి. మరో మూడు మార్గాల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులన్నీ ముగియగానే, చెన్నై శివారులను కలిపే విధంగా విస్తరణకు సంబంధించిన ప్రణాళిక రూపొందించారు. అదే సమయంలో మెట్రో సేవలను రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు సైతం విస్తరింపజేయాలని పాలకులు నిర్ణయించారు. ఇప్పటికే కోయంబత్తూరులో 46 కి.మీ దూరం, మదురైలో 31 కి.మీ దూరం మెట్రో రైల్వే సేవలకు సంబంధించిన పరిశీలన పనులు సాగుతున్నాయి. ఈ రెండు నగరాల్లో మెట్రో సేవలకు సంబంధించిన సమగ్ర నివేదిక, పరిశీలనకు టెండర్లు పిలిచారు. ఈ మేరకు నివేదిక సిద్ధమవుతోంది. అదే సమయంలో మెట్రో సేవలను మరో 3 నగరాలకు విస్తరించనున్నాయి. మ్యాంగో సీటీ సేలం, కావేరి తీరంలో ప్రధాన నగరంగా ఉన్న తిరుచ్చి, కేరళ – తమిళనాడు సరిహద్దుల్లోని తిరునల్వేలిలోనూ మెట్రో సేవలపై అధికారులు దృష్టి సారించారు. ఈ వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా ఓ వ్యక్తి సేకరించి మీడియాకు విడుదల చేశారు. ఈ మూడు నగరాల్లోనూ మెట్రో రైలు సేవలు, అక్కడి పరిస్థితి, తదితర అన్ని రకాల అంశాలతో ఏప్రిల్ నాటికి నివేదిక సిద్ధం అవుతుందని అందులో ప్రకటించారు.

తాంబరం ప్రగతికి ప్రణాళిక

- వేల కోట్లతో రైల్వే టెర్మినల్ అభివృద్ధికి ప్రణాళిక
- తేజస్ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్


తేజస్ రైలు


జెండా ఊపుతున్న కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, చిత్రంలో టీఆర్‌బాలు తదితరులు

సాక్షి, చెన్నై: రాజధాని నగరం చెన్నైకు దక్షిణం వైపుగా ఉన్న తాంబరం రైల్వే స్టేషన్ టెర్మినల్ ప్రగతి పనులకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ ఆదివారం తెలిపారు. వేల కోట్లతో రాష్ట్రంలోని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. వివరాలు.. చెన్నై ఎగ్మూర్ నుంచి మదురైకు తేజస్ రైలు సేవలు అందుతున్న విషయం తెలిసిందే. ఇకపై ఈ రైలు తాంబరం స్టేషన్‌లోనూ ఆగనుంది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో తాంబరంలో ఆగి బయలుదేరిన ఈ రైలుకు కేంద్ర సహాయమంత్రి ఎల్. మురుగన్ పచ్చ జెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడులో రైల్వే ప్రగతిపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. తాంబరం రైల్వే స్టేషన్‌ను బ్రహ్మాండంగా తీర్చిదిద్దబోతున్నామని తెలిపారు. రూ. 1000 కోట్లతో ఈ పనులు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే రామేశ్వరం, మదురై, కాట్పాడి, కన్యాకుమారి, ఎగ్మూర్ రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంకే పార్లమెంటరీ నేత టీఆర్‌బాలు, తాంబరం ఎమ్మెల్యే ఎస్‌ఆర్ రాజ, మేయర్ వసంతకుమారి, రైల్వే మేనేజర్‌తో పాటు ఇతర అధికారులు గణేష్, పి అనంత్, సచిన్ పునేటా పాల్గొన్నారు.

డీఎంకే నిరసన..

ఈ కార్యక్రమంలో తమను అవమానించారని డీఎంకే ఎంపీ, ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం జేశారు. వారిని ప్రసంగించాలని ఆహ్వానించగా నిరాకరించారు. అనంతరం మీడియాతో టీఆర్‌బాలు మాట్లాడుతూ, రైల్వేలో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తమను ఈ కార్యక్రమానికి పిలిచి అవమానించారని, తమను మొక్కుబడిగా ఆహ్వానించినట్లుందని మండి పడ్డారు. అందుకే ఈ కార్యక్రమంలో ప్రసంగించాలని ఆహ్వానించినా, నిరసన తెలియజేస్తూ దూరంగా ఉండిపోయామని టీఆర్‌బాలు వెల్లడించారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కొరుక్కుపేట: డాక్టర్ కలాం ఉచిత ట్యూషన్ సెంటర్ (విజన్ ఫర్ ఎడ్యుకేషన్), డాక్టర్ జయచంద్రన్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై పాత చాకలిపేటలోని ధర్మరాజ దేవాలయం సమీపంలోని డాక్టర్ కలాం ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జె.శరత్ జయచంద్రన్ నేతృత్వంలో వివిధ ఆసుపత్రుల నుంచి జనరల్ మెడిసిన్, డయాబెటిస్, మెడిసిన్ డెర్మటాలజీ, డెంటల్, ఆప్తాల్మాలజీ, గైనకాలజీ, సైకియాట్రీ వైద్య బృందాలు విచ్చేసి వైద్య పరీక్షలు చేశారు. దాదాపు 2 వేల మందికి పైగా ప్రజలు పాల్గొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కలాం ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు అంజయ్య, ఇతర సభ్యులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను అందించేలా అబ్దుల్ కలాం పేరుతో ఉచితంగా ట్యూషన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సామాజిక బాధ్యతగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని దీనికి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు.

సూర్యప్రభపై కార్తికేయుని వైభవం

- భక్తులతో కిక్కిరిసిన తిరుత్తణి ఆలయం
- ఘాట్ రోడ్డులో బారులు తీరిన వాహనాలు
- మాసి కృత్తిక కావడంతో పెరిగిన రద్దీ



క్యూలో భక్తుల రద్దీ



సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యస్వామి

తిరుత్తణి: మాసి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం తిరుత్తణి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తడంతో ఘాట్ రోడ్డులో వాహనాలు బారులు తీరాయి. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ధ్వజారోహణంతో మాసి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం కృత్తికతో పాటు సెలవు రోజు కావడంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుత్తణి కొండకు పోటెత్తారు. దీంతో కొండ ఆలయం కిక్కిరిసింది. రూ.100 దర్శన క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. సర్వదర్శనానికి 5 గంటల సమయం పట్టింది.

భక్తులకు అభయం

ఆదివారం ఉదయం వళ్లీ దేవసేన సమేత ఉత్సవ మూర్తిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామివారు కొలువు దీరారు. మంగళవాయిద్యాలు, భక్తుల హరోహర నామస్మరణ నడుమ మాడ వీధుల్లో విహరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ట్రాఫిక్‌తో ప్రయాణికుల ఇబ్బందులు

సుబ్రహ్మణ్యస్వామి దర్శనానికి వాహనాల్లో భారీ సంఖ్యలో భక్తులు కొండకు చేరుకోవడంతో ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయాయి. సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



తగ్గని శ్రీలంక సేనలు

- మళ్లీ తమిళ జాలర్లపై దాడి

సాక్షి, చెన్నై: శ్రీలంక సేనలు తగ్గడం లేదు. మళ్లీ తమిళ జాలర్లపై దాడి చేశారు. ఈ ఘటన తమిళ జాలర్లలో ఆగ్రహాన్ని రేపింది. ఈనెలలో ఇప్పటికే రెండుసార్లు తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనను సీఎం స్టాలిన్ సైతం తీవ్రంగా పరిగణించారు. దాడులు కట్టడి చేయాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జయ శంకర్‌కు లేఖ కూడా రాశారు. అలాగే శ్రీలంక నావికాదళంపై వేదారణ్యం మెరైన్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయినా, తాము తగ్గేది లేదన్నట్టు శ్రీలంక సేనలు వ్యవహరిస్తున్నారు. కారైక్కాల్‌కు చెందిన అంజప్పర్ పడవలో మైలాడుతురైకు చెందిన 11 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లారు. శనివారం రాత్రి కోడికరై వద్ద వేటలో ఉన్న వీరిపై శ్రీలంక సేనలు విరుచుకుపడ్డారు. వలలు, జీపీఎస్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, సముద్రంలో దూకమని చెప్పి జాలర్లను చిత్రహింసలకు గురిచేశారు. సముద్రంలో ఈదుకుంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జాలర్లు వేదనపడగా, శ్రీలంక సేనలు ఆనందించి వెళ్లారు. ఆ సేనలు వెళ్లడంతో అతి కష్టంపై ఒడ్డుకు చేరుకున్న జాలర్లు మత్స్యశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై జరిగిన దాడిని జాలర్ల సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. శ్రీలంక సేనలు రోజురోజుకు విరుచుకు పడుతుండడంతో పోరుబాటకు సిద్ధమవుతున్నారు.

పూర్వ విద్యార్థుల కృషి హర్షణీయం



పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: పూర్వ విద్యార్థినుల సంఘం చేస్తున్న సేవలు హర్షణీయమని చెన్నై నేషనల్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ జి సురేష్ ప్రశంసించారు. కేటీసీటీ పాఠశాలల పూర్వ విద్యార్థినిల సంఘం 11 వార్షికోత్సవాన్ని ప్రతిభ 2023 పేరుతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా జి.సురేష్ హాజరై జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు ఇటీవల పదవి విరమణ చెందిన ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సత్కరించారు. గత సంవత్సరం 10, 12 పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థినులను బహుమతులు అందజేశారు. 70 ఏళ్లు దాటిన పూర్వ విద్యార్థినులతోపాటు విశిష్ట సేవలు అందించిన సభ్యులను వనిత కిశోరం పురస్కారాలను ప్రదానం చేశారు. లక్కీ డిప్‌లో విజేతలకు బహుమతులు బహుకరించారు. అనంతరం జి.సురేష్, వ్యాపారవేత్త కె. లక్ష్మీనారాయణ చెరో రూ.10 వేలు విరాళం అందించారు. సంఘ అధ్యక్షురాలు జి సరళ బాలాజీ స్వాగతం పలుకుతూ అతిథులను ఘనంగా సత్కరించారు.

కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలతో కెవిన్‌కేర్ చైర్మన్ సీకే రంగనాథన్

కొరుక్కుపేట: కెవిన్ కేర్ సంస్థ, ఎబిలిటీ ఫౌండేషన్ సంయుక్తంగా 21వ వార్షిక కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డుల ప్రదానోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. దేశంలో సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ప్రతిభావంతులైన (దివ్యాంగులు) ఐదుగురికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. సభకు కెవిన్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.కె.రంగనాథన్ అధ్యక్షత వహించారు. కెవినికేర్ ఎబిలిటీ స్పెషల్ రికగ్నిజేషన్ అవార్డును తమిళనాడు రాష్ట్రంలోని అరియకుడికి చెందిన ఎస్.శంకర్ రామన్‌కు, అవార్డు ఫర్ ఎమినెన్స్‌ను వెస్ట్ బెంగాల్ రాష్ట్రం కలకత్తాకు చెందిన డాక్టర్ ఎండీ అబ్దుల్ హాసన్ సహాని, మాస్టరీ అవార్డును ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన డాక్టర్ సుశ్రీ సారంగి, పూణేకు చెందిన రచిత్ కులశ్రేష్ఠి, బీహార్ రాష్ట్రం సమాస్తిపూర్‌కు చెందిన విద్యా కుమారిలకు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా సంగీత దర్శకుడు రెహ్మాన్ వర్చువల్ ద్వారా పాల్గొన్నారు. ఎబిలిటీ ఫౌండేషన్ ఈడీ జయశ్రీ రవీంద్రన్ పాల్గొన్నారు.

చెరుకు రైతులకు క్రషింగ్ కష్టాలు

- జాప్యంతో ఎండుతున్న చెరుకు
- పట్టించుకోని యాజమాన్యం
- అనుమతి కోసం ఎదురుచూపు



ఎండుతున్న చెరుకు

పళ్లిపట్టు: చెరుకు రైతులకు క్రషింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును సిద్ధం చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో పొలంలోనే చెరుకు ఎండిపోతోంది. తిరుత్తణి సబ్ డివిజన్‌లోని పళ్లిపట్టు, ఆర్కేపేట, తిరుత్తణి పరిసర ప్రాంతాల చెరుకు రైతులు తాము సాగు చేసిన చెరుకును తిరువలంగాడులోని తిరుత్తణి సహకార సంఘం షుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేస్తున్నారు. ఈ సీజన్‌లో చెరుకు క్రషింగ్ ప్రారంభం కావడంతో రైతులు కట్టింగ్‌కు అనుమతి పొంది కూలీలతో చెరుకు నరికి వాహనాల ద్వారా తిరుత్తణి సహకార ఫ్యాక్టరీకి సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో పళ్లిపట్టు యూనియన్ జీబీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన పురుషోత్తమన్ అనే రైతు 8 ఎకరాల్లో సాగు చేసిన చెరుకును నాలుగు రోజుల కిందట నరికి సరఫరాకు సిద్ధం చేశారు. అయితే అధికారుల నుంచి అనుమతి రాకపోవడంతో దాదాపు 26 టన్నుల చెరుకు రోడ్డులోనే ఎండుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఫీల్డ్ ఆఫీసర్ ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో చేతులు కలిపి సహకార సంఘం రైతులకు అన్యాయం చేస్తున్నట్లు తమిళనాడు రైతు సంఘం జిల్లా కోశాధికారి పెరుమాళ్ ఆరోపించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు.

టీబీఎం నవీన స్వయంవరానికి అనూహ్య స్పందన




మాట్లాడుతున్న కల్య రఘుకుమార్, గోటేటి వేంకటేశ్వరరావు

కొరుక్కుపేట : తెలుగు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 35వ వార్షిక నవీన స్వయంవరానికి అనూహ్య స్పందన లభించింది. చెన్నై టి.నగర్‌లోని శ్రీరామకృష్ణా మిషన్ మహోన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. టీబీఎం అధ్యక్షుడు, ఆడిటర్ కల్య రఘు కుమార్ అధ్యక్షతన ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారి ఆరణాల వేంకటరామ శాస్త్రి, విజయవాడకు చెందిన బ్రాహ్మణ వివాహ వేదిక నిర్వాహకులు అప్పారావు వివాహ పరిచయ వేదికను ప్రారంభించారు. కల్య రఘు కుమార్ మాట్లాడుతూ దాదాపు 200 మంది పురుషులు, 100 మహిళలు రిజిస్టర్ చేసుకోగా, ఐదు జంటలకు జాతకాలు కుదిరాయని తెలిపారు. వారికి టీబీఎం తరపున మాంగల్యం కానుకగా అందిస్తామని వెల్లడించారు.

కోలీవుడ్ టాక్స్

ఏడుగురు విలన్లు.. ముగ్గురు హీరోయిన్లు



ఇండియన్-2 చిత్రం సెట్‌లో కమల్, శంకర్

తమిళ సినిమా: కమలహాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన ఇండియన్ చిత్రం సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా ఇండియన్ 2 చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నటి కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవాని శంకర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లైకా సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం షూటింగ్ నాలుగేళ్ల క్రితమే ప్రారంభమైనా షూటింగ్ స్పాట్‌లో ప్రమాదాలు, దర్శకుడికి నిర్మాణ సంస్థ మధ్య వివాదం, కరోనా కారణాలతో షూటింగ్ మధ్యలో ఆగిపోయింది. కాగా పలు పంచాయితీలు, కేసులు అనంతరం ఇటీవలే ఇండియన్ 2 చిత్రం షూటింగ్ తిరిగి ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ చెన్నైలో జరుపుకుంటోంది. చిత్రంలో సేనాపతిగా కమల హాసన్ గెటప్‌తో కూడిన పోస్టర్ విడుదలై విశేష ప్రేక్షక ఆదరణ పొందుతోంది. గత వారం రోజులుగా చెన్నై, పనైయూర్‌లో చిత్ర షూటింగ్‌ను రేయింబవళ్లు నిర్వహిస్తున్నారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ సన్నివేశాల్లో తమిళ్, బ్రిటీష్ స్టంట్ కళాకారులు పని చేస్తున్నట్లు తెలిసింది. కాగా చిత్రంలో కమల్ హాసన్‌కు ఏడుగురు విలన్లు ఉంటారని అందులో ఒకరు సముద్రఖని అని సమాచారం. మొత్తం మీద ముగ్గురు హీరోయిన్లు, ఏడుగురు విలన్లతో కమలహాసన్ ఇండియన్ 2 చిత్రంతో మరోసారి తెరపై విజృంభిస్తున్నారన్నమాట.

ఆ పాత్రలో నటించడం సవాలే!



ఇన్ కార్ చిత్ర దర్శకుడు హర్షవర్ధన్, నటి రితికా సింగ్

తమిళ సినిమా: రియల్ బాక్సర్ రితికా సింగ్ ఇరుది చుట్రు చిత్రం ద్వారా కథానాయకిగా రంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. తమిళం, హిందీ భాషల్లో రూపొందిన ఆ చిత్రం జాతీయ ఉత్తమ నటి అవార్డులు తెచ్చిపెట్టింది. కాగా అదే చిత్రంతో తెలుగులోనూ పరిచయమైన రితికా సింగ్ తమిళ్లో శివలింగ, ఓ మై కడవులే తదితర చిత్రాలను నటించి గుర్తింపు తెచ్చుకుంది. కాగా తాజాగా ఇన్ కార్ అనే పాన్ ఇండియా చిత్రంలో కథానాయకిగా ప్రధాన పాత్రను పోషించింది. ఇన్ బాక్స్ పిక్చర్స్ పతాకంపై అంజుమ్ ఖురేషీ, సాజిత్ ఖురేషీ నిర్మించిన ఈ చిత్రానికి హర్షవర్ధన్ దర్శకత్వం వహించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని మార్చి 3వ తేదీన హిందీ, తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం మొదలగు ఐదు భాషల్లో సిద్ధమైన ఈ చిత్రాన్ని తమిళనాడులో స్టూడియో గ్రీన్ సంస్థ ద్వారా కేఈ జ్ఞానవేల్ రాజా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి చెన్నైలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. దర్శకుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ.. తన బంధువుల జీవితంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన కథా చిత్రం ఇన్ కార్ అని చెప్పారు. ఈ చిత్రంలో నటించిన తర్వాత తాను కొన్ని రోజులపాటు ఆ పాత్ర నుంచి బయటపడలేక పోయానని చెప్పారు. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శకుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నానని నటి రితికా సింగ్ పేర్కొన్నారు.

అంత డబ్బు ఏం చేస్తారబ్బా!



సునైనా

తమిళ సినిమా: ఒకప్పుడు బాలీవుడ్ హీరోలు రూ.100 కోట్లు తీసుకునేవారు. ఇప్పుడు సౌత్ ఇండియన్ స్టార్లు దాన్ని మించేశారు. తమిళనాడులోని రజనీకాంత్, విజయ్ వంటి నటులు రూ.120, 130 కోట్లకు పైగా పుచ్చుకుంటున్నట్లు సమాచారం. ఈ హీరోల గురించి నటి సునైనా సెటైర్లు వేసింది. ఈ పదహారణాల తెలుగు అమ్మాయి తమిళంలో కాదలిల్ విళిందేన్ చిత్రం ద్వారా కథానాయికగా రంగప్రవేశం చేసింది. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో వరుసగా అవకాశాలను అందుకుంటోంది. అరుళ్‌నిధికి జంటగా నటించిన వంశం చిత్రంలో ఈమె నటనతో అందరి ప్రశంసలు పొందింది. ఆ తర్వాత నీర్ పార్వై, సమర్, మాసిలామణి, తెరి, సిలుక్కువార్‌పట్టి తదితర చిత్రాలతో కోలీవుడ్‌లో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకుంది. ఇటీవల ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను పేర్కొంది. మీకు స్క్రిప్ట్ రాసి నటించే అవకాశం వస్తే ఏ నటుడిని ఎంపిక చేసుకుంటావు అన్న ప్రశ్నకు బదులిస్తూ నటుడు విజయ్, ఫాహత్ సాజిద్, విజయ్ సేతుపతిలలో ఒకరిని ఎంపిక చేసుకుంటానని చెప్పింది. ఇటీవల బాగా నచ్చిన చిత్రం విక్రమ్ అని చెప్పింది. ప్రస్తుతం ప్రముఖ నటులు రూ. 100 కోట్లకు పైగా తీసుకుంటున్నారు. దాని గురించి మీ అభిప్రాయం ఏమిటన్న ప్రశ్నకు దీని గురించి కొందరు ఇంతకుముందే తన వద్ద ప్రస్తావించినట్లు చెప్పింది. అయినా అంత డబ్బు తీసుకుని ఏం చేస్తారబ్బా? అని సందేహం తనకు కలుగుతుందని చెప్పింది. తన తొలి చిత్రానికి రూ.15 వేలు తీసుకున్నట్లు చెప్పింది. తనకు సంబంధించిన వరకు ప్రేక్షకులు తన నటనను ఎలా ఆనందిస్తున్నారు అన్నదే ముఖ్యం అని పేర్కొంది. తాను కాదలిల్ విళిందేన్, సిలుక్కువార్‌పట్టి చిత్రాలను థియేటర్లలో ప్రేక్షకుల మధ్య చూశానని చెప్పింది. సిలుక్కువార్‌పట్టి చిత్రంలో నటుడు సముద్రఖనితో వాగ్వాదం చేసే సన్నివేశాలకు ప్రేక్షకులు ఈలలు వేస్తూ ఎంజాయ్ చేశారని చెప్పింది. అలాంటి తరుణాలే ముఖ్యమని, అందుకే తాను సినిమాల్లో నటించాలని కోరుకుంటున్నట్లు నటి సునైనా పేర్కొంది.

ఎప్పుడు ఎక్కడ జరిగింది?



నటి రకుల్ ప్రీత్ సింగ్

తమిళ సినిమా: ముంబాయి బ్యూటీ రకుల్ ప్రీతిసింగ్ దక్షిణాదిలో ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. మొదట్లో గిల్లి అనే కన్నడ చిత్రం ద్వారా సినీ రంగప్రవేశం చేసినా, ఆ తర్వాత తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, తమిళంలో తడయర తాక్క చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఈ మూడు భాషల్లో తెలుగులో నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ చిత్రం మాత్రమే రకుల్ ప్రీతిసింగ్‌కు గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత కూడా దక్షిణాదిలో ఈ అమ్మడిని ఆదరించింది తెలుగు సినిమానే. తమిళంలో పోరాడి ధీరన్ అధికారం ఒండ్రు చిత్రంతో సక్సెస్ అందుకుంది. ఆ తర్వాత ఇక్కడ సరైన సక్సెస్ రాలేదనే చెప్పాలి. కాగా రకుల్ ప్రీతిసింగ్ నటిగా 14 వసంతాలను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం క్రేజ్ కూడా తగ్గిపోయిందనే చెప్పాలి. ప్రస్తుతం తెలుగులో ఒక చిత్రం, తమిళంలో కమలహాసన్ సరసన ఇండియన్- 2, శివకార్తికేయన్‌కు జంటగా అయలాన్ చిత్రాల్లో నటిస్తోంది. అయితే అందాలను విచ్చలవిడిగా ఆరబోసిన రకుల్ ప్రీతిసింగ్‌పై వ్యక్తిగతంగా వదంతులు చాలానే ప్రచారం అవుతున్నాయి. ముఖ్యంగా ప్రేమ, బాయ్‌ఫ్రెండ్, పెళ్లి గురించి. 33 ఏళ్ల ఈ భామ ఇప్పటికీ మోస్ట్ వాంటెడ్ బ్యాచిలర్‌గానే ఉంది. కాగా రకుల్ ప్రీతిసింగ్ పెళ్లి జరిగిపోయిందని తాజాగా ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన ఆమె తన పెళ్లి గురించి తరచూ వదంతులు రాస్తున్నారని మండిపడింది. తనకు వివాహం జగినట్లు రాస్తున్నారని, అది ఎప్పుడు ఎక్కడ జరిగిందో ఎవరైనా చెప్పగలరా..? అంటూ ప్రశ్నించింది. కాగా రకుల్ ప్రీతిసింగ్ పెళ్లిపై జరుగుతున్న ప్రచారానికి ప్రధాన కారణం ఈ అమ్మడు హిందీ నటుడు జాకీ భగ్నానిని ప్రేమిస్తున్నట్లు 2021లోనే బహిరంగంగా ప్రకటించడమే.

ఈ కలయిక ఆ బయోపిక్ కోసమేనా?



సతీమణుల సమేతంగా సూర్య, పృథ్వీరాజ్

తమిళ సినిమా: కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య వైవిధ్యభరిత కథా చిత్రాలతో రాణిస్తున్నారు. అలాగే విజయపథంలో దూసుకుపోతున్న నిర్మాతగా కూడా గుర్తింపుపొందారు. 2డీ ఎంటర్ టైన్‌మెంట్ పతాకంపై ఇప్పటికే పలు సక్సెస్ ఫుల్ చిత్రాలను నిర్మించారు. సూర్య ప్రస్తుతం శివ దర్శకత్వంలో వీర్ అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇది ఆయన 42వ చిత్రం కావడం గమనార్హం. ఈ చిత్రం తరువాత వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ చిత్ర షూటింగ్లో పాల్గొంటారని సమాచారం. కాగా మలయాళంలో స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఈయన దర్శక నిర్మాత కూడా అన్నది తెలిసిందే. కాగా సూర్య పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవల భేటీ కావడం విశేషం. వారు తమ సతీమణులతో కలిసి దిగిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఈ ఇద్దరు స్టార్లు కలవడానికి కారణం ఓ భారీ చిత్రంలో నటించడానికి అనే ప్రచారం సాగుతోంది. పృథ్వీరాజ్ సుకుమారన్, సూర్య జ్యోతికల 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతో కలిసి ఒక చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం వెలువడ లేదు. అయితే వీరిద్దరూ కలిసి ఓ భారీ చిత్రంలో నటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రముఖ బ్రిటానియా బిస్కెట్ అధినేత రాజన్ పిళ్లై బయోపిక్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు, అందులో నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. దీనికి సరిగమ ఇండియా సంస్థ సహ నిర్మాణ బాధ్యతలను చేపట్టనున్నట్లు ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధార్థ ఆనంద్ కుమార్ ఇటీవల ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ సిద్ధమవుతోందని తెలిపారు. అయితే ఇది సినిమాగా తెరకెక్కుతుందా, లేక వెబ్ సిరీస్‌గా రూపొందుతుందా? అన్న విషయం గురించి స్పష్టత లేదు. అదేవిధంగా ఇందులో నటిస్తారా, లేదా అన్నది కూడా తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

గుండెపోటుతో నవ వరుడు హఠాన్మరణం

అన్నానగర్: గుండెపోటుతో నవ వరుడు మృతి చెందిన ఘటన ఈరోడ్‌లో జరిగింది. నసియానూర్ కన్నవేలం పాళయానికి చెందిన ప్రకాష్ (36)కు ఈ నెల 23వ తేదీ వివాహం జరిగింది. శనివారం అత్తగారి ఇంటికి వెళ్లిన ప్రకాష్ మటన్ తిన్నాడు. తన భార్యతో అమ్మగారి ఇంటికి వచ్చాడు. రాత్రి మరోసారి మటన్ తిని పడుకున్నాడు. ఆదివారం వేకువజామున 2 గంటలకు శరీరమంతా దురద పుడుతోందని చెప్పాడు. కొద్ది సేపటికే గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన పెరుందురై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాంజీకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యకు మెసేజ్ పంపి పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: కళ్లకురిచ్చి జిల్లా త్యాగతురుగం సమీపంలోని మెల్విలి గ్రామానికి చెందిన ఆంథోని రాజ (33) చిన్న సేలం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. కళ్లకురిచ్చి పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య శీల పొరిమేరి, ఆరేళ్ల కుమార్తె, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. శనివారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. శీలపొరిమేరి బయటకు వెళ్లింది. ఆంథోని రాజ విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. భార్య ఇంటిలో లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన భార్యకు కాల్ చేసి నీ జీవితం చూసుకో.. నేను నా జీవితాన్ని ముగించుకుంటున్నాను అని మెసేజ్ పంపాడు. ఇది చూసి శీలపొరిమేరి ఇంటికి వచ్చి చూడగా తలుపు గెడియపెట్టి ఉంది. ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు తెరిచిచూడగా ఆంథోని రాజ ఉరి వేసుకుని మృతి చెందాడు. కళ్లకురిచ్చి పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య

అన్నానగర్: చెంగల్పట్టు జిల్లా మామల్లపురంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం వేకువజామున కొక్కిలమేడు గ్రామం ప్రవేశ ద్వారంలోని విద్యుత్ స్తంభం ఎక్కిన గుర్తు తెలియని వ్యక్తి (45) విద్యుత్ వైర్లను పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొక్కిలమేడుకు చెందిన కొందరు వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్తంభానికి వేలాడుతున్న మృతదేహాన్ని యంత్రం సాయంతో కిందకు దించారు. చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

తిరువొత్తియూరు: చెన్నై కొట్టివాక్కంలో ప్రభుత్వ వైద్యుడి ఇంట్లో రూ. 5 లక్షల విలువ కలిగిన వస్తువులను చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వెంకటేశ్వర నగర్‌కు చెందిన శరవణన్ (52) చెన్నై స్టాన్లీ ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇంటి మరమ్మతు పనుల కారణంగా తిరువాన్మయూర్‌లోని మామ ఇంట్లో ఉంటున్నారు. కొట్టివాక్కంలో ఉన్న శరవణన్ ఇంటి తలుపులను శనివారం రాత్రి పగలగొట్టిన దుండగులు లోపలికి చొరబడి బీరువాలో ఉన్న నగలు, వెండి వస్తువులు, లాప్‌టాప్ సహా మొత్తం రూ.5 లక్షలు విలువ కలిగిన వస్తువులు చోరీ చేశారు. ఆదివారం ఉదయం తన ఇంటి వద్దకు వెళ్లి చూడగా చోరీ విషయం తెలిసింది. ఫిర్యాదు మేరకు నీలాంగరై పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

సీఎంపై తీవ్ర వ్యాఖ్యలు : ఒకరి అరెస్టు

సాక్షి, చెన్నై: సీఎం ఎంకే స్టాలిన్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఇంజినీరింగ్ పట్టభద్రుడిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు నామ్ తమిళర్ కట్చికి చెందిన నాయకుడిగా గుర్తించారు. ఈరోడ్ ఉప ఎన్నికల ప్రచారంలో నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ అరుందతీయ సామాజిక వర్గానికి వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన తెన్‌కాశికి చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడు జ్ఞాన శింగం సోషల్ మీడియాలో సీఎంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు. దీంతో పోలీసులు ఆదివారం అతడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

బోరు వేస్తుండగా పేలిన రిగ్‌పైప్

అన్నానగర్: బోరు వేస్తుండగా రిగ్‌పైప్ పేలి మహిళ మృతిచెందిన ఘటన సేలంలో జరిగింది. సీలనాయకన్‌పట్టి వేలునగర్ 2వ వీధికి చెందిన కనకరాజ్ భార్య మహేశ్ చిత్రా (43). వీరి ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో యజమాని కార్తికేయన్ ఇల్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇందు కోసం శనివారం బోర్ వేస్తున్నారు. మధ్యాహ్నం మహేశ్‌చిత్రా ఇంటిలో భోజనం చేస్తోంది. బోర్‌వెల్ నుంచి భయంకరమైన శబ్దం రావడంతో అక్కడికి వెళ్లి చూసింది. అదే సమయంలో రిగ్‌పైప్ పేలడంతో మహేశ్ చిత్రా తలపై తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కవరింగ్ నగలతో టోకరా

అన్నానగర్: బంగారు నగలను చోరీ చేసి కవరింగ్ నగలను ఉంచిన ఘటన వేలూరులో జరిగింది. ఆనైకట్టు సమీపంలోని కెంగనల్లూరు గ్రామానికి చెందిన భాస్కరన్ శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. ఆదివారం ఉదయం ఇంటి వెనుక తలుపులు పగులగొట్టి లోపల ఉన్న మరో గదిలో 30 సవర్ల నగలు, రూ.1.10 లక్షల నగదు దుండగులు చోరీ చేసి, కవరింగ్ నగలను విసిరేసి పరారైనట్లు తెలిసింది. దిగ్భ్రాంతి చెందిన భాస్కరన్ ఆనైకట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.

విజ్ఞానం.. వినోదం

- కోవైలో సిద్ధమైన ప్రయోగాత్మక విజ్ఞాన కేంద్రం
- విద్యార్థుల కోసం రూపకల్పన
- 28న ప్రారంభించనున్న ఆర్థిక మంత్రి పళణివేల్





విజ్ఞానాన్ని పంచే వివిధ అంశాలను వీక్షించి, పరిశీలిస్తున్న విద్యార్థులు

సేలం: విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచే విధంగా కోయంబత్తూరు వేదికగా ప్రయోగాత్మక విజ్ఞాన కేంద్రం రూపుదిద్దుకుంది. ఈనెల 28న ఆర్థిక శాఖ మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ , కోయంబత్తూరు కలెక్టర్ క్రాంతి కుమార్, భారతీయ విద్యా భవన్ చైర్మన్ బీకే కృష్ణరాజ్ వానవరాయర్ దీనిని ప్రారంభించనున్నారు. జీడీ నాయుడు ఛారిటీస్ నేతృత్వంలో కోయంబత్తూరులో విద్యా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రస్తుతం ప్రయోగం పేరుతో ఇంటరాక్టివ్ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, పరిశోధకులకు దోహదపడే విధంగా రూపొందించిన ఈ విజ్ఞాన కేంద్రంలోని ప్రముఖ అంశాలను శనివారం ఆ ఛారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ జీడీ గోపాల్, ట్రస్టీ అఖిల షణ్ముగం, జనరల్ మేనేజర్ ఎం. సురేష్ నాయుడులు మీడియాకు వివరించారు.

ప్రత్యేకతలు..

ప్రయోగాత్మక విజ్ఞాన కేంద్రం 40 వేల చదరపు అడుగుల స్థలంలో నిర్మించామని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 120కి పైగా ఇంటరాక్టివ్ సైన్స్ ప్రదర్శనలు. ప్రయోగాత్మకంగా విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీలకు ఉపయోగ పడే అంశాలను కొలువు దీర్చామని వివరించారు. ఇందులోనూ కొన్ని విద్యార్థులకు మరింతా విజ్ఞానాన్ని పంచే విధంగా ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. క్యూరేటెడ్, సమాచార బోర్డులు, ప్రయోగాలకు అవసరమయ్యే వివరాలు, ధ్వని, ఇల్యూజన్, ఆప్టిక్స్, మ్యాథ్స్, ప్రకృతి, మెకానిక్స్, విద్యుత్ –శక్తి, వంటి విభాగాలకు ప్రత్యేక ప్రయోగ ఏర్పాట్లు చేశామని వివరించారు. అలాగే మేకర్స్ స్పేస్, యాక్టివిటీ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, రోబోటిక్స్ ల్యాబ్ తదితర ప్రయోగశాలలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లోని విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. జాతీయ సెలవు రోజుల్లో మినహా తక్కిన రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అందరూ సందర్శించవచ్చునని సూచించారు. ఈనెల 28న ప్రారంభోత్సవం, మార్చి ఒకటో తేదీ నుంచి విద్యార్థులు, సందర్శకులను అనుమతిస్తామని వెల్లడించారు.





గుంతలో పడి చిన్నారి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టులో విషాద ఘటన చోటుచేసుకుంది. మరుగుదొడ్డి ట్యాంక్ నిర్మాణం కోసం తీసిన గుంతలో పడి చిన్నారి మృతిచెందింది. వివరాలు.. మోసవాడి గ్రామానికి చెందిన వడివేలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య చిత్ర, కుమార్తెలు చారులత, షర్మీ (9) ఉన్నారు. షర్మీ కరిపూరులోని ప్రైవేటు పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. వీరి ఇంటి సమీపంలో ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సెప్టిక్ ట్యాంక్ నిర్మించేందుకు 10 అడుగుల గోతి తీశారు. ఇదిలా ఉండగా చిన్నారి శనివారం సాయంత్రం నడుచుకుని వెళుతుండగా అదుపు తప్పి గోతిలో పడింది. చిన్నారి కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకున్నాయి. మట్టి చరియలు పడడంతో చిన్నారి మట్టిలో కూరుకుపోయింది. గ్రామస్తులు పూడికతీసి చూడగా చిన్నారి మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సమచారం అందుకున్న సేత్తుపట్టు పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు.

సినీ కార్మికులను ఆదుకోండి

- ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి

తమిళ సినిమా: బడ్జెట్‌లో సినీ కార్మికులకు నిధిని కేటాయించాలని దక్షిణ భారత సినీ కార్మికుల సమాఖ్య (ఫెఫ్సీ) అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం స్థానిక వడపళనిలోని ఫెఫ్సీ ఆవరణలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దక్షిణ భారత సినీ కార్మికుల పరిస్థితి ఇప్పటికీ శ్రమ, ప్రమాదాలతోనే నిండిపోయిందన్నారు. మూడేళ్లకోసారి సినీ నిర్మాతలతోనూ, బుల్లితెర నిర్మాతలతోనూ చర్చలు జరుపుతూ కార్మికుల వేతనాలను కొంచెం పెంచుకుందామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సాయం కిందిస్థాయి కార్మికుల వరకు చేరడం లేదన్నారు. అదేవిధంగా షూటింగ్‌లో పనిచేసే కార్మికుల్లో ఇప్పటి వరకు 100కు పైగా ప్రమాదాల్లో మరణించారని, రజనీకాంత్ కమల్ హాసన్ వంటి స్టార్ హీరోల షూటింగ్‌లో ప్రమాదవశాత్తు మరణించే వారి కుటుంబాలకు మాత్రమే కాస్త సాయం అందుతుందని తెలిపారు. చిన్న చిత్రాల్లో ప్రమాదానికి గురైన వారికి ఎలాంటి సాయం అందట్లేదని పేర్కొన్నారు. సినీ కార్మికులను సాయం కోసం రానున్న వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం కొంత నిధిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 2010లో దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి కార్మికుల ఇళ్ల కోసం పైయనూర్‌లో స్థలాన్ని కేటాయించారని, అక్కడ స్టూడియోలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దానికి కలైంజర్ అనే పేరు, ఆయన శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటికి ఆర్థిక సాయం అందించాల్సిందిగా కోరారు. లైట్ మెన్లకు సాయం కోసం సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ నిధిని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారని, అదేవిధంగా తమ సమాఖ్యలోని ఇతర కార్మికుల సాయం అందించడానికి నిర్మాతలు, ప్రముఖ నటులు, సాంకేతిక నిపుణులు ముందుకు వస్తే బాగుంటుందని ఆర్కే సెల్వమణి కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆర్కే సెల్వమణి

స్థానికేతరులకు పట్టాలు ఇవ్వొద్దని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న సెయ్యారు గ్రామస్తులు

వేలూరు: స్థానికేతరులకు తమ గ్రామంలో ఇంటి పట్టాలు ఇవ్వొద్దని తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేశారు. అనకావూరు కాలనీ కాలియమ్మన్ ఆలయ వీధిలో ప్రభుత్వ భూమి ఉంది. ఈ స్థలాన్ని అనకావూరుకు చెందిన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందన లేకపోవడంతో గ్రామస్తులు ఆదివారం ఉదయం సెయ్యారు–వందవాసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సెయ్యారు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చలు జరిపారు. ఇతర ప్రాంతవాసులకు తమ ప్రాంతంలో ఇంటి పట్టాలు మంజూరు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు.

కమల్‌తో మంత్రి శేఖర్‌బాబు భేటీ

- స్టాలిన్ ఫొటో ప్రదర్శనకు రావాలని ఆహ్వానం



కమల్‌తో ప్రియ, శేఖర్‌బాబు

సాక్షి, చెన్నై : మక్కల్‌నీదిమయ్యం నేత, విశ్వనటుడు కమలహాసన్‌తో దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ ఆదివారం భేటీ అయ్యారు. సీఎం స్టాలిన్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేయనున్న ఫొటో ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆయన్ని ఆహ్వానించారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థికి మక్కల్ నీది మయ్యం నేత కమల్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రచారం కూడా నిర్వహించారు. ఈ సమయంలో డీఎంకే వర్గాలకు ఆయన కాస్త దగ్గరయ్యారని చెప్పవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమితో కలిసి మక్కల్ నీదిమయ్యం ప్రయాణం ఉంటుందనే ప్రచారం ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో ఆదివారం ఉదయం కమల్‌తో దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీ అనంతరం మీడియాతో శేఖర్‌బాబు మాట్లాడుతూ, సీఎం ఎంకే స్టాలిన్ బర్త్‌డేను పురస్కరించుకుని ఆయన జీవిత విశేషాలు, ప్రయాణానికి సంబంధించిన వివరాలతో భారీ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్యారిస్‌లో ఈనెల 28న ఏర్పాటయ్యే ఈ ప్రదర్శనకు హాజరు కావాలని కమల్‌ను ఆహ్వానించామని తెలిపారు. ఆయన ఈ ప్రారంభోత్సవానికి తప్పకుండా వస్తానని తమకు హామీ ఇచ్చారన్నారు.

మ్యూజిక్ అంటే ప్రాణం



ప్రారంభోత్సవంలో ఐక్కి బెర్రి

కొరుక్కుపేట: మ్యూజిక్ అంటే ప్రాణమని గాయని, నటి, ప్రముఖ కాస్మొటిక్ సర్జన్, బిగ్ బాస్ తమిళ్ 5 పోటీదారు ఐక్కి బెర్రి అన్నారు. ఆదివారం చెన్నైలోని కేథడ్రల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన కొత్త నెయిల్ ఆర్ట్ స్టూడియోను జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. చెన్నై నగరంలోని నెయిల్ ఆర్ట్ ఔత్సాహికులకు ఈ స్టూడియో స్వర్గధామంగా ఉంటుందన్నారు. నెయిల్ ఆర్ట్ ఒక అద్భుతమైన సృజనాత్మక ప్రక్రియ అని, ఈ రంగంలో అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. మహిళలు తమదైన నైపుణ్యాల మెరుగు పరుచుకుంటే జీవనోపాధి ఉంటుందని తెలిపారు. సంగీత ప్రియులను ఉర్రూతలూగించేలా కొత్త ప్రయోగాలు చేస్తానని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

అన్నానగర్: వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మదురై జిల్లా కొట్టంపట్టి సమీపంలోని కంబూర్‌కు చెందిన వృద్ధురాలు (80) ఆదివారం రాత్రి తన ఇంటిలో నిద్రిస్తోంది. అదే పట్టణానికి చెందిన పాండి (55) ఇంటిలోకి ప్రవేశించి వృద్ధురాలిపై అత్యాచారానికి యత్నించాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గుమిగూడారు. వారిని చూసి పాండి పారిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలిని 108లో చికిత్స నిమిత్తం మేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కొట్టంపట్టి పోలీసులు కేసు నమోదు చేసి పాండిని అరెస్టు చేశారు.

హిజ్రాలను బెదిరించిన ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: కోవై గౌండమ్ పాళయంలో హిజ్రాలను బెదిరించిన యూట్యూబ్ నటులు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. కోవై గౌండమ్ పాళయానికి కేరళ రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం రాత్రి కారులో వచ్చారు. రోడ్డు పక్కన నిలబడి ఉన్న హిజ్రాలతో మాటలు కలిపి వారి వద్ద అసభ్యకరంగా వ్యవహరించారు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన కారులో వచ్చిన దిలీప్ సినిమా షూటింగ్‌కు ఉపయోగించే తుపాకీని చూపించి హిజ్రాకు బెదిరించాడు. ఇది చూసిన స్థానికులు తుడియలూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలానికి వచ్చిన ఎస్ఐలు దురైరాజు, అయ్యాస్వామి తుపాకీని స్వాధీనం చేసుకుని ముగ్గురిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు. కొల్లలం తిరునెల్వెలి పాలక్కాడుకు చెందిన దిలీప్ (33), పాలకోడు పుదూర్ టెంపుల్ వీధికి చెందిన కిషోర్ (23), సమీర్ (30) అని తెలిసింది. కేరళ నుంచి ఊటీకి వెళుతున్న సమయంలో ఈ సంఘటన జరిగినట్లు తెలిసింది. వీరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

వారం పాటు అన్నాడీఎంకే బహిరంగ సభలు

సాక్షి, చెన్నై : వారం రోజుల పాటు అన్నాడీఎంకే నేతృత్వంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బహిరంగ సభలు జరగనున్నాయి. ఈ మేరకు ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ఆదివారం ప్రకటించారు. దివంగత సీఎం, అమ్మ జయలలిత జయంతి వేడుక ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే నేతృత్వంలో జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈరోడ్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా బహిరంగ సభలు నిర్వహించ లేని పరిస్థితి నెలకొంది. దీంతో మార్చి 5, 6, 7, 10, 11, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభల రూపంలో జయంతి వేడుకలకు పళణిస్వామి పిలుపు నిచ్చారు. తొలి రోజు ఆర్కేనగర్ నియోజకవర్గంలో జరిగి బహిరంగ సభలో తాను పాల్గొంటానని వెల్లడించారు.

సేలం బస్‌స్టేషన్‌లో రూ.62 లక్షలు పట్టివేత

తిరువొత్తియూరు : సేలం కొత్త బస్టాండ్‌లో శనివారం కానిస్టేబుళ్లు సుగవనం, లోకనాథన్ గస్తీలో ఉన్నారు. వృద్ధుడు అనుమానాస్పద రీతిలో ఓ సంచిని తీసుకుని వస్తున్నాడు. పోలీసులు అతన్ని తనిఖీ చేశారు. సంచిలో ఓ పార్సిల్ గుర్తించారు. వృద్ధుడితో పాటు పార్సిల్‌ను పల్లడం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పార్సిల్ విప్పి చూడగా అందులో రూ.500 నోట్ల కట్టలు ఉన్నాయి. లెక్కించగా రూ. 62 లక్షల నగదు ఉంది. ఈరోడ్ పెరుందరై మెయిన్ రోడ్డు కుమలన్‌కుట్టికి చెందిన బాలకృష్ణన్ (59)గా గుర్తించారు. సహాయ కమిషనర్ శరవణ కుమార్, ఇన్‌స్పెక్టర్ రాణి విచారణ చేయగా పొంతనలేని సమాధానం చెప్పడంతో సేలం ఇన్‌కమ్ ట్యాక్స్ సహాయ కమిషనర్ రాజారామ్, ఇన్‌స్పెక్టర్ తంగబాలన్‌లకు అప్పగించారు.

శతకం.. సజీవ స్రవంతి



కప్పర గిరిజాలక్ష్మిని సత్కరిస్తున్న జేకే రెడ్డి, మధు

కొరుక్కుపేట: సజీవ స్రవంతిలా అవిచ్ఛిన్నంగా సాగుతోంది శతకమే అని వేద సంస్కృత కళాశాల, నెల్లూరు విశ్రాంతాచార్యులు డాక్టర్ కప్పర గిరిజా లక్ష్మి అన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 134వ ప్రసంగం ఆదివారం రాత్రి ఆస్కా కృష్ణా హాల్‌లో జరిగింది. ఆంధ్ర నాయక శతక సౌందర్యం అనే అంశంపై ప్రసంగించేందుకు డాక్టర్ కప్పర గిరిజా లక్ష్మి పాల్గొన్నారు. తెలుగు శతకాల్లో మకుటం చాలా ప్రధానమని పేర్కొన్నారు. ఆది కవి నన్నయ్య నాలుగు పద్యాలలో మకుటంను ఉపయోగించారని అన్నారు. అలాగే నన్నె చోళుడు కుమార సంభవం 10 పద్యాలకు మకుటం ఉపయోగించారని తెలిపారు. సంస్కృత శతకాలు స్తోత్రం ప్రదానం అయితే తెలుగు శతకాలు ఆత్మానుభూతి ప్రధానమని వ్యాఖ్యానించారు. శతకం సజీవ స్రవంతి వాలే సాగుతూ ఉందని అభిప్రాయపడ్డారు. జేకే రెడ్డి, కందనూరు మధు కప్పర గిరిజాలక్ష్మిని ఘనంగా సన్మానించారు.

రోడ్డు విస్తరణ కోసం ఎమ్మెల్యే పాదయాత్ర

సాక్షి, చెన్నై : జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి నేత, ఎమ్మెల్యే ఈఆర్ ఈశ్వరన్ ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. సేలం నుంచి కొచ్చిన్‌కు కోయంబత్తూరు వైపుగా జాతీయ రహదారి ఎనిమిది రోడ్లతో నిర్మించారు. అయితే కోయంబత్తూరు నెలంబూరు నుంచి మదుకరై వరకు 28 కి.మీ దూరం ఇంత వరకు పనులు చేపట్ట లేదు. ఫలితంగా ఆ మార్గంలో నిత్యం వాహన రద్దీ ఏర్పడింది. వాహనదారులే కాకుండా, స్థానికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ పనులను త్వరితగతిన చేపట్టాలని నినాదిస్తూ ఆదివారం కోయంబత్తూరు నెలకంబూరు నుంచి మదుకరై వరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున ఆ పార్టీ కార్యకర్తలు ఈ యాత్రలో ఆయనతో పాటు కలిసి నడిచారు.

డ్యాన్సర్ అనుమానాస్పద మృతి

తిరువొత్తియూరు: అబుదాబీ హోటల్‌లో మహిళా డ్యాన్సర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కారైక్కాల్ జిల్లా కీలకాస గుడికి చెందిన దేవదాసు కుమార్తె అరుణ (32)కు వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. అబుదాబీలో ప్రైవేటు హోటల్లో నృత్యం చేసేది. చెన్నైకి చెందిన ప్రైవేటు సంస్థ ద్వారా గత ఏడాది జూన్ నెలలో అబుదాబీకి వెళ్లారు. కొద్ది నెలలుగా అక్కడున్న హోటల్‌లో డ్యాన్స్ చేస్తోంది. రెండు రోజులకు క్రితం అరుణ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను స్వదేశానికి వస్తున్నట్లు అందు కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు అరుణ చెప్పారు. శనివారం రాత్రి తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు అరుణతో పని చేసే మహిళ ఫోన్ చేసి అరుణ మృతి చెందినట్లు తెలిపింది. దీంతో దిగ్భ్రాంతి చెందిన కుటుంబ సభ్యులు కారైక్కాల్ కలెక్టర్ మహమ్మద్ మన్సూరై వద్దకు వెళ్లి విషయం చెప్పారు. మృతిపై అనుమానం ఉందని.. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావాలని కోరారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

మూడు ఎకరాల్లో చెరుకు తోట దగ్ధం



దగ్ధమైన చెరుకుతోట

అరక్కోణం: మూడు ఎకరాల చెరుకు తోట అగ్నికి ఆహుతైంది. అరక్కోణం యూనియన్ నార్తమంగళంలో రాజేష్ అనే రైతుకు చెందిన 5 ఎకరాల చెరుకు తోట కోతకు వచ్చింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం చెరుకు తోటలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అరక్కోణం, తిరుత్తణి అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. అయితే ఇంతలోపే 3 ఎకరాల్లో తోట అగ్నికి ఆహుతైంది. అరక్కోణం తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ భూములను రక్షించాలి



హిందూ మున్నని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుగానందం

వేలూరు: రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ శాఖతో పాటు ఇతర హిందూ ఆలయాలకు సొంతమైన భూములను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడానికి అనుమతి ఇవ్వరాదని హిందూ మున్నని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుగానందం అన్నారు. వేలూరులోని ప్రైవేటు హోటల్‌లో హిందూ మున్నని సమావేశం జరిగింది. జిల్లా రీజినల్ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురుగానందం మాట్లాడుతూ.. హిందూ ఆలయాలకు సొంతమైన భూములను విక్రయం చేయరాదని హైకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా కొన్ని ప్రాంతాల్లో విక్రయాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అదే విధంగా ఆలయాల్లో ధర్మకర్తలను నియమించరాదని కోర్టు తీర్పు ఇచ్చినా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారిని ధర్మకర్తలుగా నియమిస్తున్నారని తెలిపారు. వీటి ద్వారా ఆలయ ఆస్తులను ధర్మకర్తలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మదురై హైకోర్టు సమీపంలోని తొమ్మిది ఎకరాల భూమిని పార్కింగ్ పాయింట్‌గా మార్చేందుకు ప్రభుత్వ ప్రయత్నం చేస్తుందని కోర్టు తీర్పును ప్రభుత్వం పట్టించుకోకుంటే ప్రజాప్రతినిధులకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈరోడ్డు ఉప ఎన్నికల్లో ఓట్ల కోసం కొన్ని పార్టీలు దిగజారిపోయాయని మండిపడ్డారు. ప్రజలకు మంచి పనులు చేసి వారి అభిమానాలు పొందాలే తప్పా ఉచితాల పేరుతో ప్రజలను మోసం చేయడం సరికాదన్నారు. జిల్లా కోశాధికారి భాస్కరన్, జిల్లా అధ్యక్షుడు రంగనాథన్, సభ్యులు రాణశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జల్లికట్టు.. పట్టరపట్టు



యువకుడిని అమాంతం పైకి ఎత్తేసిన ఎద్దు

తిరువొత్తియూరు: తంజావూర్, పుదుకోటై, తిరువంబుర్‌లో ఆదివారం ఉదయం జల్లికట్టు పోటీలు ఉత్సాహంగా సాగాయి. తంజావూరు జిల్లా వల్లలం సమీపంలోని తిరుమలై సముద్రం గ్రామంలో జరిగిన పోటీల్లో పాల్గొనేందుకు తిరుచ్చి, తంజావూరు, పుదుగై, అరియలూరు, పెరంబులూరు, మధురై, దిండుకల్లు, శివగంగై, రామనాథపురం తదితర జిల్లాల నుంచి ఎద్దులను తీసుకొచ్చారు. ఈ ఎద్దులకు, ఎద్దులను అదుపు చేయడానికి వచ్చిన వీరులకు వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు అనంతరం చివరిగా 800 ఎద్దులకు, 300 మంది వీరులకు అనుమతి ఇచ్చారు. ఉదయం 8 గంటలకు ఆర్డీఓ రంజిత్, వల్లంపట్టి డీఎస్పి నిత్య జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. మొదటిసారిగా వాడివాసల్ నుంచి బయటకు వచ్చిన ఎద్దులను అదుపు చేయడంలో వీరులు నిమగ్నమయ్యారు. కొన్ని ఎద్దులు వారికి సింహ స్వప్నంలా తయారైంది. ఎద్దులను అదుపు చేసిన వీరులకు, వారికి పట్టుబడిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. బహుమతులుగా బీరువా, మంచం, సిల్వర్ పాత్రలు, నగదు బహుమతును అందజేశారు. పోటీల్లో 88 మందికి గాయాలయ్యాయి.

ఇక.. రోబో సేద్యం



ఎక్స్ -100 రోబో తో వ్యవసాయ పనులు చేస్తున్న దృశ్యాలు

పాడి నేలల్లో పంటల సాగుకు సాయం

- మిరప, పత్తి, పొగాకు, టమాటా, కూరగాయల పంటలకు అనుకూలం
- పొలం మ్యాప్, చేయాల్సినపని చెబితే చాలు.. అంతా ఆటోమేటిక్
- 3 గంటలు రీచార్జ్ చేస్తే 8 గంటలు పనిచేస్తుంది
- రోజుకు 2 ఎకరాల్లో స్ప్రేయింగ్, 4 ఎకరాల్లో మిగిలిన పనులు
- 30–40 శాతం తగ్గనున్న పెట్టుబడి ఖర్చు
- రిమోట్ కంట్రోల్, ఏఐతో ఎక్స్–100 రోబో పనులు
- ఖరీఫ్ కల్లా అద్దె ప్రాతిపదికన రైతుల చెంతకు తేనున్న ఎక్స్‌మెషిన్స్ సంస్థ

సాక్షి, అమరావతి: వ్యవసాయరంగంలో టెక్నాలజీ వినియోగం పెరుగుతోంది. అధునాతన యంత్ర పరికరాలతోపాటు అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే డ్రోన్ స్ప్రేయర్లు రంగప్రవేశం చేయగా, తాజాగా రోబోలు కూడా సేద్యం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. దుక్కుల నుంచి కలుపుతీత వరకు అన్ని పనులు చేసేలా హైదరాబాద్‌కు చెందిన 'ఎక్స్‌మెషిన్స్' అనే స్టార్టప్ కంపెనీ వీటిని అభివృద్ధి చేసింది. ఏపీ, తెలంగాణల్లో ఎంపికచేసిన పంటలసాగులో ప్రయోగాత్మక వినియోగంలో ఇవి సక్సెస్ కావడంతో ఖరీఫ్ సీజన్ నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పంట ఏదైనా విత్తు నుంచి కోత వరకు ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు రైతులకు భారంగా మారుతున్నాయి. పెట్టుబడి ఖర్చులో 35–40 శాతం కూలీలకే ఖర్చవుతోంది. పైగా ప్రతి దశలోను కూలీలకొరత రైతులను వేధిస్తోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే ఎన్నో రకాల యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. రోజురోజుకు పెరిగే పెట్రో ఉత్పత్తుల ధరల కారణంగా వీటి నిర్వహణ రైతులకు భారమవుతోంది. ఈ సమస్యలను అధిగమించే లక్ష్యంతో భిన్నంగా ఆలోచించి.. నాలుగేళ్లపాటు పరిశోధించి, పరిశీలించిన ఎక్స్‌మెషిన్స్ సంస్థ ఎక్స్–100 అనే వ్యవసాయ రోబోను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది.

దుక్కి నుంచి కలుపుతీత వరకు

మొక్కల వరుసల మధ్య రెండడుగుల దూరం ఉండే పంటలకు ఈ రోబో ఉపయోగం. డ్రై ల్యాండ్‌లో సాగయ్యే పత్తి, మిరప, పొగాకు, టమాటా, కూరగాయలు వంటి పంటల సాగులో దుక్కిదున్నటం, భూమి చదునుచేయడం, మొక్కలు నాటడం, విత్తడం, కలుపుతీయడం, ఎరువులు చల్లడం, పురుగుమందు పిచికారీ వంటి పనులన్నీ చేయగలదు. కావల్సిన విత్తనం, ఎరువులు, పురుగుమందులు రోబోకి అమర్చిన బాక్సులో వేసి రిమోట్ ద్వారా ఆపరేట్ చేసుకోవచ్చు. పొలం మ్యాప్‌తో మొక్కల మధ్య, వరుసల మధ్య ఎంతదూరం ఉండాలో సెట్‌చేస్తే అదే విత్తుతుంది. ఏ పనిచేయాలో సెట్‌చేసి చెబితే చాలు మానవసాయం లేకుండా చేసేస్తుంది. స్ప్రేయింగ్ పనులు మాత్రమే అయితే రోజుకు నాలుగెకరాల్లో, ఇతర పనులైతే రోజుకు రెండెకరాల్లో పూర్తిచేస్తుంది. పైలెట్ ప్రాజెక్టుగా ఈ రోబోను వరంగల్‌తో పాటు గుంటూరు పరిసర ప్రాంతాల్లో వినియోగించారు. పెట్టుబడి ఖర్చులో 30-40 శాతం తగ్గినట్లు గుర్తించారు.

40 శాతం ఆదా అవుతుంది



రోబోల రాకతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయి. అన్ని రకాల పనులకు ఈ చిట్టి రోబోలు అనుకూలంగా ఉన్నాయి. చాలా బాగా పనిచేస్తున్నాయి. కొనుగోలుకు ఆర్డర్ కూడా పెట్టాను. వీటి సహాయంతో వ్యవసాయ పనులు చేస్తే కనీసం 40 శాతం పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయి.

– పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతునేస్తం ఫౌండర్, గుంటూరు

ఖరీఫ్ కల్లా అందుబాటులోకి తెస్తాం



కూలీల వెతలను తీర్చడంతోపాటు వ్యవసాయ పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా వినీల్‌రెడ్డి, ధర్మతేజాలతో కలిసి ఈ రోబోను అభివృద్ధి చేశాం. నాలుగేళ్లపాటు అన్ని రకాల టెస్టులు పూర్తిచేసి మార్కెట్‌లోకి విడుదల చేశాం. దీని ధర రూ.1.75 లక్షలు. అద్దె ప్రాతిపదికన అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే ఖరీఫ్ సీజన్‌కల్లా ఏపీలో గుంటూరు, అనంతపురం, రాజమహేంద్రవరం, విశాఖపట్నం పరిసర ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉంచేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– డి.త్రివిక్రమ్, వ్యవసాయ రోబో సృష్టికర్త

80 కిలోల బరువున్న రోబో

ఈ రోబోను మైక్రో ట్రాక్టర్‌గా సంబోధిస్తున్నారు. దీంట్లో 24 వాట్స్ సామర్థ్యంగల రెండు బ్యాటరీలు, మోటారు, కంప్యూటర్, కెమెరా, సెన్సార్లు ఉన్నాయి. చిన్న రబ్బర్ టైర్లు అమర్చారు. 50 సెంటీమీటర్ల, 40 సెంటీమీటర్ల వెడల్పు, 72 సెంటీమీటర్ల పొడవు ఉండే ఈ రోబో 80 కిలోల బరువుంటుంది. ఇది 5–7 కిలోల విత్తనాలు, 25 లీటర్ల పురుగుమందులు, 25 కిలోల ఎరువులు మోయగలిగే ఏర్పాట్లు చేశారు. మూడుగంటలు చార్జింగ్ పెడితే ఎనిమిది గంటలు నిర్విరామంగా పనిచేస్తుంది. ఒక బ్యాటరీ డిశ్చార్జ్ అవగానే ఆటోమెటిక్‌గా మరో బ్యాటరీ సహాయంతో పనిచేస్తుంది. రిమోట్ కంట్రోల్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ద్వారా మానవ సహాయం లేకుండా కూడా పనిచేస్తుంది. ఈ రోబో పనితీరును అధ్యయనం చేసిన తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ సాగులో వినియోగానికి ఇబ్బంది లేదని సర్టిఫై చేసింది.

●తెలంగాణ

ప్రమాదవశాత్తు రెండు ఆర్టీసీ బస్సులు దగ్ధం



మంటల్లో దగ్ధం అవుతున్న బస్సులు

చివ్వెంల (సూర్యాపేట): సాంకేతిక లోపంతో రెండు ఆర్టీసీ బస్సులు దగ్ధం అయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని గుంపుల గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ విజయవాడ డిపోకు చెందిన వెన్నెల బస్సు 30 మంది ప్రయాణికులతో శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరింది. మార్గమధ్యలో చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని సాయికృష్ణ హోటల్ వద్దకు రాగానే బస్సు లైట్లు ఫెయిల్ కావడంతో ప్రయాణికులను కిందికి దింపి, వేరే బస్సుల్లో వారిని విజయవాడకు తరలించారు. కాగా, బస్సును విజయవాడ డిపోకు తీసుకువెళ్లే క్రమంలో సూర్యాపేటకు దగ్గర్లో ఉన్న విజయవాడకు చెందిన మరో అమరావతి బస్సును వెన్నెల బస్సు వద్దకు తీసుకువచ్చారు. మరమ్మతుకు గురైన బస్సు బ్యాటరీకి చార్జింగ్ ఎక్కించే క్రమంలో అక్కడికి వచ్చిన బస్సు బ్యాటరీ వైర్లలో నుంచి ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో ఆర్టీసీ డ్రైవర్లు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించారు. వాహనం సంఘటన స్థలానికి చేరుకునే లోపు అమరావతి బస్సు పూర్తిగా కాలిపోగా, వెన్నెల బస్సు పాక్షికంగా కాలిపోయింది. ఫైర్ సిబ్బంది నీళ్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలించారు. బస్సులను క్రేన్ సహాయంతో పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

హైదరాబాద్‌లో లిథువేనియా దౌత్య కార్యాలయం

మొదటి కాన్సుల్‌గా దివీస్ ల్యాబ్స్ కిరణ్ సత్చంద్ర

సాక్షి, హైదరాబాద్: లిథువేనియా తన దౌత్య కార్యాలయాన్ని (హానరరీ కాన్సులేట్) హైదరాబాద్‌లో ఆదివారం ప్రారంభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన ఈ దౌత్య కార్యాలయం మొదటి గౌరవ కాన్సుల్‌గా ఫార్మాస్యూటికల్ కంపెనీ దివీస్ ల్యాబ్స్ సీఈఓ, తెలంగాణకు చెందిన వ్యాపారవేత్త కిరణ్ సత్చంద్ర దివిని నియమించారు. న్యూఢిల్లీలోని లిథువేనియన్ ఎంబసీతో పాటు, ముంబై, కోల్‌కతా, బెంగళూరులోని గౌరవ కాన్సులేట్‌లు ఉండగా, తాజాగా లిథువేనియా హైదరాబాద్‌లో కొత్త గౌరవ కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. గచ్చిబౌలిలో నిర్వహించిన గౌరవ కాన్సులేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న లిథువేనియా ఎకానమీ అండ్ ఇన్నొవేషన్ వైస్‌మినిస్టర్ కరోలిస్ జెమాటిస్ మాట్లాడారు. తన నియామకంతో భారత్‌లో లిథువేనియా ఉనికిని చాటడంతో కొత్త అధ్యాయానికి తెరతీస్తుందని కిరణ్ దివి అన్నారు.

వైద్య విద్యార్థిని ప్రీతి కన్నుమూత

- మృత్యువుతో పోరాడి ఓడిన పీజీ విద్యార్థిని
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు

హైదరాబాద్/వరంగల్:ఐదు రోజులుగా ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతినాయక్ (26) ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచింది. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రీతి ఆదివారం రాత్రి 9.10 నిమిషాలకు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. ప్రీతిని కాపాడేందుకు ప్రత్యేక వైద్య బృందం అన్నివిధాలుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ప్రీతి నాలుగుసార్లు కార్డియాక్ అరెస్టుకు గురైందని.. నిమ్స్‌కు రాకముందే ఆమె రెండుసార్లు కార్డియాక్ అరెస్ట్ బారిన పడిందని వైద్యులు తెలిపారు. ఆమె తీసుకున్న మత్తు ఇంజెక్షన్ కారణంగా గుండెకు సంబంధించిన 28 శాతం ఎజెక్షన్‌ఫ్రాక్షన్‌ఆఫ్ హార్ట్, గ్లోబల్ హిపోకైనేషియా, పాంక్రియాటైటిస్, అసైటిస్, ఊపిరితిత్తుల సమస్య ఏర్పడినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటికే ఆమె థైరాయిడ్, కీళ్లవాతానికి సంబంధించి మందులు వాడుతున్నట్టు గుర్తించారు. ప్రీతి గూగుల్‌లో సక్సినైల్‌కోలిన్ గురించి సెర్చ్ చేసినట్టు తేలింది. ఈ నేపథ్యంలోనే ఏ మందు తీసుకుంది, ఏ విధానంలో ఆత్మహత్యకు ప్రయత్నించిందన్న అంశంపై పోలీసులు శుక్రవారం ఆమె బ్లడ్‌శ్యాంపిల్ సేకరించి ట్యాక్సికాలజీ పరీక్షలకు పంపారు. తొలుత ట్రెమడాల్ ఇంజెక్షన్ తీసుకుని ప్రీతి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టుగా భావించారు. సాధారణంగా డ్యూటీలో ఉండే జూనియర్ డాక్టర్లకు అత్యవసర వైద్యానికి సంబంధించిన డ్రగ్స్ కిట్ అందుబాటులో ఉంచుతారు. అందులో భాగంగానే ప్రీతి డ్యూటీ చేస్తూ అపస్మారక స్థితికి చేరిన గదిలో సక్సినైల్‌కోలైన్, మెడజోలం, పెంటనీల్ ఇంజెక్షన్ వయిల్స్ దొరికాయి. ప్రీతి మృతదేహాన్ని నేరుగా వరంగల్‌కు తరలించేందుకు నిమ్స్ యాజమాన్యం ఏర్పాట్లు చేయగా.. అందుకు ప్రీతి బంధువులు నిరాకరించి ఆందోళనకు దిగటంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

అసలేం జరిగిందంటే..

జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గిర్ని తండాకు చెందిన ధరావత్ నరేందర్ వరంగల్‌లోని ఆర్‌పీఎఫ్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు.అతనికి కుమార్తె ప్రీతి గాంధీ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. కేఎంసీలో పీజీ అనస్థీషియా కోర్సు చదువుతున్న ఆమె ఆస్పత్రిలో సీనియర్ విద్యార్థులతో కలిసి ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వర్తిస్తోంది. అక్కడ పరిచయమైన సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించడంతో అనస్థీషియా విభాగాధిపతి నాగార్జునరెడ్డి ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే ప్రీతి ఆత్మహత్యకు యత్నించింది. కేసులో నిందితుడైన సైఫ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితుడిని ఖమ్మం జైలుకు తరలించారు. కాగా, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విద్యార్థిని తండ్రి డిమాండ్ చేస్తున్నారు. ప్రీతిని సైఫ్ హత్య చేశాడంటూ కన్నీరు మున్నీరయ్యారు. ప్రీతి జోలికి రాకుండా అధికారులు సైఫ్‌ను నియంత్రించలేకపోయారని ఆరోపించారు.

మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ తెలుగువారి ప్రస్తావన

విజయదుర్గ (ఏపీ), రాజకుమార్ (తెలంగాణ)లకు అభినందన

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్‌లో తెలుగువారి గురించి ప్రస్తావించారు. ఆదివారం 98వ మన్‌కీబాత్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, క్రీడలు తదితర అంశాల గొప్పదనం, పరిరక్షణకు చేస్తున్న సేవలు ప్రశంసించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని దేశభక్తి గీతాలు, ముగ్గులు, లాలిపాటలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీల విజేతలను ప్రకటించారు. దేశభక్తి గీతాల పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టి.విజయదుర్గ విజేతగా ప్రకటించారు. స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్ఫూర్తితో విజయదుర్గ దేశభక్తి గీతాన్ని రచించారని పేర్కొన్నారు. ''రేనాడ ప్రాంత వీరా! ఓ వీర నరసింహా! భారత స్వాతంత్ర్య పోరాటానికి అంకురానివి! అంకుశానివి! ఆంగ్లేయుల అన్యాయమైన నిరంకుశ దమనకాండను చూసి మీ రక్తం మండింది మంటలు లేచాయి! రేనాడు ప్రాంత సూర్యుడా! ఓ వీర నరసింహా!'' అనే దేశభక్తి గీతాన్ని ఈ సందర్భంగా వినిపించారు. మరో అవార్డు గ్రహీత తెలంగాణకు చెందిన పేరిణి రాజ్‌కుమార్‌ను అభినందించారు. కాకతీయుల కాలంలో మహాదేవుడు శివుడుకి అంకితం చేసిన పేరిణి నాట్యం ఎంతో పేరొందిందని, ఆ రాజవంశ మూలాలు ఇప్పటికీ తెలంగాణతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. రాజకుమార్ నాయక్ ఒడిస్సీ నాట్యంలోనూ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వి.దుర్గాదేవి అనే మహిళ కరకట్టం అనే పురాతన నృత్య విభాగంలో అవార్డు పొందారన్నారు.

స్థానిక వార్తలు

వరప్రదం.. దేవర వృషభం

అన్నమయ్య జిల్లాలో అనాదిగా వేళ్లూనుకున్న దేవరెద్దు ఆచారం

- దేవరెద్దులతో గ్రామాలు సుభిక్షం అనే నమ్మకం
- ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ
- పుట్టినా, గిట్టినా వేడుకలు
- ఎద్దుల సంరక్షణ కోసం నలుగురు భక్తులు

సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మలు గ్రామసీమలు. అవి సంబరాలకు నెలవులు. విశిష్ట ఆచారాలకు పుట్టినిళ్లు. అలాంటి గ్రామాల్లో కొనసాగుతున్న ఒక అరుదైన విశేషమే.. దేవరెద్దు, దేవరభక్తుల పరంపర..

(షేక్ ముజిబుద్దీన్, సాక్షి, కడప డెస్క్)

దేవరెద్దులు.. అన్నమయ్య జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తాయి. అనాదిగా వస్తున్న ఆచారానికి ఇవి ప్రతీకలుగా ఉంటున్నాయి. గ్రామానికి శుభం చేకూరుస్తాయనే ప్రజల నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

గ్రామాలు సస్యశ్యామలం

దేవరెద్దులు కలిగిన గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని నమ్మకం. దేవరెద్దును పోషిస్తున్న భక్తుల వంశాభివృద్ధి చెంది, సుఖసంతోషాలతో ఉంటారని విశ్వాసం. దాన్ని మేపడానికి వదిలేసినప్పుడు ఏ పొలంలో అయినా మేయవచ్చు. అది మేసిన పొలం యజమానులు తమ అదృష్టంగా భావిస్తారు. అలాగే గ్రామస్తులు తమకు తోచిన పదార్థాలను ప్రసాదంగా దేవరెద్దుకు అందజేస్తుంటారు. దేవరెద్దు మృతి చెందితే ఆ ఊరికి, గ్రామస్తులకు అరిష్టం జరుగుతుందనే భయంతో తక్షణం కొత్తదాన్ని ఎంపిక చేస్తారు.

విశేషాల సమాహారం

దేవరెద్దు పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు ఎన్నో వేడుకలు నిర్వహిస్తారు. వీటిని సంరక్షించేందుకు ప్రత్యేకంగా దేవరభక్తులుంటారు. తిరునాల, ఉత్సవాల సందర్భంగా వీటిని అలంకరించి సంబరాలు చేసుకుంటారు. దేవరెద్దును దేవుడిలా పూజిస్తారు. దీని పై ఎవ్వరూ దెబ్బ వేయరు. ఇది చనిపోయినా.. కొ త్త దేవరెద్దును, దేవరభక్తులను ఎంపిక చేయాలన్నా వేడుక నిర్వహిస్తారు. బంధుమిత్రులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల వారు కూడా తరలివస్తారు. సంప్రదా య వాయిద్యాలతో పాటు మద్దిళ్ల, కొమ్ములు ఊదడం, పలకలు కొట్టడం లాంటివి చేస్తారు. కొత్త ఎద్దును ఎంపిక చేసిన తర్వాత దానికి సంప్రదాయ అలంకరణ అనంతరం ఊరేగిస్తారు.

దేవరెద్దు చనిపోతే...

ఎక్కడైనా దేవరెద్దు చనిపోతే అంత్యక్రియలు వేడుకలా నిర్వహిస్తారు. అడవికి వెళ్లి పచ్చారు కొయ్యలు తెస్తారు. వాటితో విశ్వబ్రాహ్మణుల ద్వారా ప్రత్యేకంగా రథం తయారు చేయిస్తారు. ఎద్దు ప్రాణంతో ఉన్నప్పుడు ఎలా పడుకుని ఉంటుందో.. ఆ విధంగా రథంలో ఉంచుతారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ఊరేగింపుగా తీసుకెళ్తారు. చెక్కభజనలు, పిల్లనగ్రోవి, డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా సేవ చేస్తారు. భూమిలో గుంత తీసి ఖననం చేసే సమయంలో కూడా ఎద్దును కూర్చున్న స్థితిలోనే ఉంచుతారు. ఈ కార్యక్రమం ఒక తిరునాళ్లలా జరిపిస్తారు. దీనికి ఇతర గ్రామాల్లోని దేవరెద్దులు, దేవర భక్తులు కూడా తరలివస్తారు.



కలకడ మండలంలోని బహుదానది వద్దకు ఝరి ఉత్సవంలో దేవరెద్దులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు, గ్రామస్తులు (ఫైల్)

నియమానుసారం..

దేవరభక్తులను నియమించడానికి గ్రామస్తులు స్నానం ఆచరించి నిర్దేశిత ప్రాంతానికి చేరుకుంటారు. ప్రతి ఒక్కరూ చేతిలో పండ్లు, ప్రసాదం పట్టుకుని కూర్చుంటారు. దేవరెద్దును తీసుకొచ్చి అక్కడ వదిలేస్తారు. మొదటిసారి ఎవరి ప్రసాదం స్వీకరిస్తే వారిని ఎద్దుభక్తుడిగా ఎంపిక చేస్తారు. ఈ విధంగా వరుసగా కదిరిభక్తుడు, గుర్రప్ప భక్తుడు, పూల భక్తుడులను నియమిస్తారు.

- దేవరభక్తుడు దేవరెద్దుకు పూజలు చేయడంతో పాటు ఉత్సవాలకు తీసుకెళ్లాలంటే ప్రత్యేకంగా అలంకరించాల్సి ఉంటుంది. కత్తి (బెత్తం) చేతపట్టుకుని దేవరెద్దుతో పాటు ఊరేగింపుగా వెళతాడు.
- కదిరి భక్తుడు నరసింహస్వామికి పూజలు చేయాల్సి ఉంటుంది. ఉత్సవాలకు నరసింహస్వామి చిత్రపటంతో వెళతాడు.
- గుర్రప్పభక్తుడు ఎద్దుకు సంబంధించిన ఆభరణాలు, ఉత్సవ సామగ్రి, గుర్రప్పస్వామి శిలతో కూడిన ఓ పెట్టెను ఎత్తుకుని వెళ్లాల్సి ఉంటుంది.
- పూల భక్తుడు ఏదైనా ఉత్సవాలు, తిరునాళ్లు జరిగినప్పుడు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి భక్తులను ఆహ్వానించాల్సి ఉంటుంది.



దేవరెద్దులను తీసుకెళ్తున్న దేవరెద్దు భక్తులు (ఫైల్)



ఒక్క పొద్దు విడుస్తున్న భక్తులు (ఫైల్)

కేవీ పల్లెలో.. అధిక సంఖ్యలో..

అన్నమయ్య జిల్లాలోని కేవీపల్లె, కురబలకోట, కలికిరి, సంబేపల్లె మండలాల్లో ప్రధానంగా దేవరెద్దుల సంస్కృతి ఉంది. కేవీపల్లె మండలంలో 12 గ్రామాల్లో ఒక్కో దేవరెద్దు చొప్పున ఉన్నాయి. తోటి దళితవాడ, నారమాకుపల్లె, గొర్లకణంపల్లె, గుట్టలపై బండకాడపల్లె, దిగువగడ్డ, పెండ్లిపెంట, పేయలవారిపల్లె, తీతవగుంటపల్లె, తువ్వపల్లె, బొప్పసముద్రం, తిమ్మాపురం, వంకవడ్డిపల్లెలో దేవరెద్దులు ఉన్నాయి. సంబేపల్లె మండలంలో అన్నప్పగారిపల్లె, శెట్టిపల్లె, గున్నికుంట్ల, గురిగింజకుంట, కలకడ మండలంలో పాళెంమూల, బాలయ్యగారిపల్లె పంచాయతీ నాయనవారిపల్లె, కలికిరి మండలంలో అద్దవారిపల్లెలోనూ దేవరెద్దులు ఉన్నాయి. కురబలకోట మండలంలో కూడా అక్కడక్కడా ఉన్నాయి. కాగా.. ఒకటి, రెండు గ్రామాల్లో మాత్రమే కొత్తగా దేవరెద్దులు పుట్టాయి.

నిష్టగా ఉంటాం



మేము చాలా నిష్టగా ఉంటాం. భక్తుడిగా నియమించినప్పటి నుంచి ఎద్దు బాగోగులు నేనే చూసుకుంటున్నా. 25 ఏళ్లుగా మా వంశస్తులే దేవరెద్దు భక్తులుగా ఉన్నాం. దేవరెద్దు భక్తులతో పాటు ఇతర భక్తులు దేవరెద్దుకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

– యల్లయ్య, వీఆర్ఓ, ఎద్దు భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం.

పురాతనకాలం నుంచి వస్తున్న ఆచారం



మా గ్రామంలో దేవరెద్దును సంరక్షించడం, పూజలు నిర్వహించడం పురాతన కాలం నుంచి ఆచారంగా వస్తోంది. కొన్ని కట్టుబాట్లు పాటిస్తూ దేవరెద్దును సంరక్షించడం జరుగుతోంది.

– నాగులయ్య, గుర్రప్ప భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం

అదృష్టంగా భావిస్తున్నాం



దేవరెద్దు రూపంలో దేవుడే ప్రత్యక్షంగా కన్పిస్తున్నాడు. అలాంటి దేవరెద్దుకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. పండుగలు, ఉత్సవాలతోపాటు ప్రతి శనివారం క్రమం తప్పకుండా పూజలు నిర్వహిస్తాం.

– నాగరాజ, పూల భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం

ఒక్కపొద్దు పాటిస్తున్నాం



ప్రతి శనివారం, పండుగల సమయంలో మేము ఒక్కపొద్దు పాటిస్తాం. దేవరింటిలో పూజ లు నిర్వహించడంతో పాటు అక్కడే భోజనం వండుకుని దేవరెద్దుకు పూజలు నిర్వహించిన తరువాతనే ఒక్కపొద్దు విడుస్తాం.

– శశికుమార్, కదిరి భక్తుడు, తోటిదళితవాడ, కేవీపల్లె మండలం


గౌరవంగా చూసుకుంటాం



దేవరెద్దు సంప్రదాయం పెద్దల కాలం నుంచి వస్తోంది. ఎద్దును గౌరవంగా చూసుకుంటున్నాం. మాలో ఎవరైనా చనిపోతే కొత్త భక్తుడిని దేవరెద్దే ఎంపిక చేసుకుంటుంది.

– కె.వంశీ, దేవరభక్తుడు, దిగువబోయపల్లె, కురబలకోట మండలం

40 ఏళ్లుగా..



దేవరెద్దును దేవుడితో సమానంగా చూస్తారు. పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో అలంకరించి ఊరేగిస్తారు. 40 ఏళ్లుగా భక్తుడిగా ఉన్నా.

– శిద్దప్ప, దేవరభక్తుడు, మంద్యంవారిపల్లె, కురబలకోట మండలం

దేవరెద్దు అంటే..

ఏ గ్రామంలో అయినా పుట్టిన దూడ వారం రోజులైనా పాలు తాగకుండా ఉంటే.. దాన్ని దేవాలయం వద్దకు తీసుకెళ్లి ప్రసాదం పెడతారు. అది తింటే దానిని దేవరెద్దుగా పరిగణిస్తారు. దానిని సంరక్షించుకుంటే గ్రామాలకు శుభం కలుగుతుందని నమ్ముతారు.



దేవరింటిలో ఎద్దు వద్ద పిల్లన గ్రోవి ఊదుతున్న భక్తులు

ఉత్సవాలకు ఊరేగింపుగా..

దేవరెద్దు ఉన్న ఊళ్లతో పాటు సమీప ప్రాంతాల్లో ఎక్కడ ఉత్సవాలు జరిగినా వీటిని ప్రత్యేకంగా ఊరేగింపుగా తీసుకెళతారు. ప్రధానంగా శివరాత్రి సందర్భంగా జరిగే ఝరి ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఇవి నిలుస్తాయి. ఆ రోజున జాగరణ నిర్వహించిన ప్రజలు మరుసటి రోజు ఉదయాన్నే ఝరికోనలో స్నానమాచరిస్తారు. అక్కడికి దేవరెద్దును, నాణ్యాలు(దేవరెద్దు పూజసామగ్రి)ని ఊరేగింపుగా తీసుకెళ్తారు. ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా జరుగుతుంది. దీనిని చూడటానికి జనం పెద్ద ఎత్తున తరలివస్తారు.

పూజ సామగ్రి కోసం దేవరిల్లు

దేవరెద్దు కోసం ప్రత్యేకంగా ఇల్లు ఏర్పాటు చేస్తారు. దానిని దేవరిల్లు అంటారు. అందులో దేవుని చిత్రపటాలు ఉంచుతారు. దేవరెద్దు అక్కడే ఉంటుంది. దానికి అలంకరణ సామగ్రి కోసం ప్రత్యేకంగా పెట్టె ఉంటుంది. గంట, గజ్జెలు, మువ్వలు, మల్లముట్లు, గొడుగులు, వస్త్రం తదితరాలుంటాయి. వాటిని దేవరింటిలో భద్రపరుస్తారు.

కొత్త దేవరెద్దు ఎంపిక ఇలా..


దేవరెద్దు చనిపోయిన స్థానంలో కొత్త దాన్ని ఎంపిక చే సేందుకు గ్రామస్తులంతా పూజలు నిర్వహిస్తారు. గ్రా మంలో పండ్లు, ప్రసాదాలు పెట్టి దూడలు, ఎద్దులను ఒక చోట వదులుతారు. ఏది అయితే ప్రసాదం స్వీకరిస్తుందో.. దాన్ని దేవరెద్దుగా పరిగణిస్తారు. కొత్తగా దేవరెద్దు ఎంపికైన అనంతరం మూడేళ్లకు తిరునాల నిర్వహిస్తారు. దానికి మిగతా గ్రామాల్లోని దేవరెద్దులను కూడా ఆహ్వానిస్తారు. గ్రామానికి వచ్చిన వాటికి మంగ ళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలుకుతారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు చేసుకుంటారు.

దేవర భక్తులు.. సదా సంరక్షకులు

గ్రామంలో దేవరెద్దును సంరక్షించడానికి, పూజలు చేయడానికి, ఉత్సవాలకు తీసుకు వెళ్లడానికి నలుగురు వ్యక్తులుంటారు. వీరిని దేవర భక్తులు అంటారు. ఎక్కువగా ఏళ్ల తరబడి ఒకే కుటుంబ సభ్యులు దేవరెద్దు భక్తులుగా ఉంటారు. వారిని ఎద్దు భక్తుడు, కదిరి భక్తుడు, గుర్రప్పభక్తుడు, పూల భక్తుడిగా పిలుస్తారు.

మంచి మాట

మార్పు ఒక సాంత్వన



మార్పును పొందడం, మారడం బతుకుతున్న మనిషికి ఎంతో అవసరం. మనిషి రాయి కాదు మార్పును పొందకుండా మార కుండా పడి ఉండడానికి. బతుకుతున్న మనిషి మార్పును పొందుతూ ఉండాలి, మారుతూ ఉండాలి. బతకడానికి సిద్ధంగా ఉన్న మనిషి మారడానికి కూడా సిద్ధంగా ఉండాలి. ఒక మనిషి మారకపోవడం అతడు సరిగ్గా బతకలేక పోవ డమూ, బతకకపోవడమూ అవుతుంది.

'నువ్వు ఇక్కడ ఉంది బతకడానికి; నువ్వు ఇక్కడ ఉంది ఆడడానికి; నువ్వు ఇక్కడ ఉంది బతుకును అనుభవించడాని కి' అని ఓషో చెప్పారు. మార్పు లేకుండా, మారకుండా రాయిలా బతికితే ఎలా? బతుకుతూ ఉండడానికి, బతుకును అనుభవిస్తూ ఉండడానికి మనిషిలో ఎప్పటికప్పుడు మార్పు వస్తూ ఉండాలి; మనిషి తనను తాను మార్చుకుంటూ, తనకు తాను మార్పులు చేసుకుంటూ బతుకును ఆస్వాదిస్తూ ఉండాలి.

మార్పుల్ని స్వీకరించని మనిషికి, మారని మనిషికి, ఊరట ఉండదు, సాంత్వన ఉండదు. 'ఎవరికి ఏది తెలియదో అది వాళ్లకు ఉండదు' అని తాత్త్వికకృతి త్రిపురారహస్యం మాట. మారడం తెలియనివాళ్లకు మార్పు అనేది ఉండదు. మార్పు లేనివాళ్లకు బతుకు సరిగ్గా ఉండదు. అంతేకాదు బతక డమే భారమైపోతుంది. మనిషిలో మార్పులు రాకపోడానికి ముఖ్యమైన కారణాలు అభిప్రాయాలు. అభిప్రాయాల వలలో చిక్కుకుపోయినవాళ్లు మారడం చాతకాకుండా మానసికంగా బాధపడుతూనే ఉంటారు; తమవాళ్లను అదేపనిగా బాధపెడు తూనే ఉంటారు. అభిప్రాయాలకు అతీతమైన అవగాహన మనిషికి అవసరమైన మార్పుల్ని తీసుకొస్తూ ఉంటుంది.

వయసువల్ల మనిషికి శారీరకమైన మార్పులు రావడం సహజం. ఆ విధంగానే ప్రతి మనిషికీ ఆలోచనపరంగా, దృక్పథంపరంగా, ప్రవర్తనపరంగా, మనస్తత్వంపరంగా మార్పులు రావాలి. మన దైనందిన జీవితంలో భాగం అయి పోయిన కంప్యూటర్లను మనం రిఫ్రెష్ చేస్తూ ఉంటాం. ఆ విధంగా మనల్ని కూడా మనం మాటిమాటికీ రిఫ్రెష్ చేసు కుంటూ ఉండాలి. అలా చేసుకుంటూ ఉండడంవల్ల జడత్వం లేదా స్తబ్దత తొలగిపోతుంది. జడత్వం, స్తబ్దతలు తొలగి పోతున్న కొద్దీ మనలో మార్పు వస్తూ ఉంటుంది.

మన జీవితాన్ని మన మస్తిష్కం నిర్ణయిస్తుంది. మస్తి ష్కంలో మార్పులు రాకపోతే జీవితంలో మార్పులు రావు. మారని మస్తిష్కం మొద్దు లాంటిది. మస్తిష్కం మొద్దుగా ఉంటే జీవితం మొద్దుబారిపోతుంది. మన చుట్టూ ఉన్నవాళ్లలో ఇలా మొద్దుబారిన జీవితాలతో చాల మంది కనిపిస్తూ ఉంటారు. మార్పులకు మాలిమి అవని వాళ్లు మానసికరోగులుగా కూడా అయిపోతారు. కొంతమంది ఉన్మాదులుగా అయిపోవడానికి కారణం వాళ్లలో మార్పు అనేది రాకపోవడమే; వాళ్లకు మార్పు అవసరం అని వాళ్లు గ్రహించకపోవడమే. ప్రపంచానికి ఎంతో కీడు చేస్తున్న మతోన్మాదం, ప్రాంతీయ వాదం, ముఠాతత్త్వం వంటివాటికి మూలం మారని, మార లేని మనుషుల మనస్తత్వమే. మనుషులు పసితనం నుంచి మారుతూ వచ్చాక ఒక వయసు తరువాత మారడాన్ని ఆపేసు కుంటారు. తమ అభిప్రాయాలు, నమ్మకాలు, ఆలోచనలు, అభిరుచులు, ఉద్దేశాలు, ప్రవర్తన సరైనవే అని తీర్మానించు కుని తమలో తాము కూరుకుపోతూ ఉంటారు. మారకపో వడం తమ గొప్పతనం అని నిర్ణయించుకుంటారు. అటుపైన వాళ్లు మూర్ఖులుగానో, చాదస్తులుగానో, తిక్కవ్యక్తులుగానో, పనికిరానివాళ్లుగానో, అసూయాపరులుగానో, దొంగలు గానో, ఇంగితం లేనివాళ్లుగానో, వంచకులుగానో, చెడ్డవాళ్ల గానో, హంతకులుగానో రూపొందుతూ ఉంటారు. సంఘానికి, ప్రపంచానికి మారని పలువురివల్ల ఎంతో హాని జరిగింది, జరుగు తోంది. మారకపోవడంవల్ల మనుషులు మనుషులకు అపాయకరమైపోతూ ఉన్నారు.

మార్పును పొందడం, మారడం మనుషులకు ఉండి తీరాల్సిన లక్షణం. ఊరట, సాంత్వన కావాలంటే, రావా లంటే, ఉండాలంటే మనుషులు మారడం నేర్చుకోవాలి. మారడం నేర్చు కుని మనుషులు శాంతంగా బతకాలి.

– రోచిష్మాన్

దమ్మపదం

స్థిరచిత్తం అంటే అదే!



అది గంగానదీ తీరం. లోతు తక్కువ ప్రదేశం. నది మధ్యలో అక్కడక్కడ ఇసుక దిబ్బలు న్నాయి. నదీ తీరంలో గట్టు వెంట గొర్రెల మంద మేస్తోంది. ఆ మందను చూసింది ఒక తోడేలు. మందలో చివరిలో మందకు కొద్ది దూరంలో ఒంటరిగా మేస్తోంది ఒక పొట్టేలు. తోడేలు చూపు దాని మీద పడింది. 'ఈ బలిసిన పొట్టేలు అయితే రెండు రోజులకు సరిపోతుంది' అనుకుంది. మాటు కాచి, పొంచి పొంచి దాని దగ్గరకు వచ్చింది. ఎండుటాకుల ధ్వనిని బట్టి ఏదో తనవైపు వస్తున్నట్లు గుర్తించింది పొట్టేలు. తల పైకెత్తి చూసింది. తన మీదికి దూకి వస్తున్న తోడేలు కనిపించే సరికి నది మధ్యలో ఉన్న ఇసుక తిన్నెల మీదికి పరుగుతీ సింది. అలా రెండు మూడు తిన్నెలు దాటి తీరాన్నుండి దూరంగా పోయాయి రెండూ.

అంతలో వరదనీరు ఉరకలేస్తూ ఉరవడిగా వచ్చిపడు తోంది. పొట్టేలు ప్రాణ భయంతో ఇసుక దిబ్బ మీది నుండి నది నీటిలోకి దూకేసి ఈదు కుంటూ వెళ్లిపోయింది. తోడేలు మాత్రం దిబ్బమీదే నిలబడిపోయి, పొట్టేలు వైపే చూస్తూ ఉండిపో యింది.

ఇంతలో వరద నీరు హెచ్చింది. మధ్యలో ఉన్న ఇసుక దిబ్బలు మునిగి పోసాగాయి. తోడేలు పొట్టేలు మీది నుంచి చూపు తిప్పుకునేసరికే అది నిలబడ్డ దిబ్బ చాలా మునిగిపో యింది. కొద్దిసేపటికి ఆ దిబ్బమీది కొద్ది ఎత్తైన ప్రదేశం మాత్రమే మిగి లింది. తోడేలు ఆ ఎత్తు ప్రదేశానికి చేరింది. ఆ వరద అలా రెండురోజులు ఉంది. వేటాడటం అటుంచి, కనీసం ఒడ్డుకు చేరే మార్గం కనిపించలేదు.

అది తనలో తనే 'ఈ ప్రమాదాన్నుండి బయట పడ తానో లేదో, ఇప్పటిదాకా ఎంతో హింస చేశాను. ఎన్నో జీవుల్ని చంపాను. ఆ కర్మ ఫలం నాకు మంచిని చేకూ ర్చదు. కాబట్టి బతికినన్ని రోజులు ఇక అహింసను, మైత్రిని, మంచితనాన్ని పాటించాలి' అనుకుంది. ఆ దిబ్బ మీదికి చేరి, కూర్చొని ధ్యానం చేయసాగింది.

కొంత సమయం గడిచింది. ఎక్కడో సన్నగా మేక అరుపు దాని చెవులబడింది. తపస్సు భగ్నం అయ్యింది. మెల్లగా కళ్లు తెరిచింది. అటూ ఇటూ చూసింది. వరద కొద్దిగా తగ్గింది. తాను ఉన్న ఇసుక దిబ్బ ఇంకొద్దిగా బైట పడింది. దాని మీదకు చేరి అరుస్తూ ఉన్న మేకపిల్ల కనిపించింది. తోడేలు మెల్లగా లేచి మేక పిల్లకేసి వంగి వంగి నడవసాగింది. దాదాపు దగ్గరగా పోయి ఒక్క ఉదుటున దూకింది. కానీ.. గురి తప్పి నీటిలో పడడంతో శబ్దం వచ్చింది. ఆ శబ్దాన్ని విని అటు చూసిన మేక పిల్ల ప్రాణభయంతో నది నీటిలోకి ఎగిరి దూకి ఈదుకుంటూ వెళ్లిపోయింది. తోడేలుకు మరలా నిరాశ.'లేదు. మరలా నేను నా మనస్సును కుదుట పరచుకోవాలి. హింసను విడనాడాలి. అహింసతో జీవిం చాలి. తపస్సు చేసి, చేసిన పాప ఫలాన్ని రూపు మాపుకో వాలి' అనుకుంది.

బుద్ధుడు ఈ కథ చెప్పి– ''మనం మనకు అనను కూల పరిస్థితులు వచ్చినప్పుడు శాంతంతో, అహింసతో, జీవ కారుణ్యాన్నీ, ధర్మాన్నీ ఆచరించడం కాదు. కోపం రావడానికి కారణాలు ఉన్నప్పుడూ, హింస చేసే అవ కాశం వచ్చినప్పుడూ తప్పు చేసే పరిస్థితులు కలిగిన ప్పుడు అవి చేయకుండా ఉండటమే గొప్పతనం. అలా ఉంచగలిగిందే ధ్యానం. అలా మన చిత్తాన్ని ప్రక్షాళన చేసుకోవాలి. నా మార్గం మనస్సును అలా దృఢంగా మలుస్తుంది''అని చెప్పాడు. స్థిర చిత్తం అంటే అదే మరి!


– డా. బొర్రా గోవర్ధన్

సన్నిధి

గురువాణి

నీలోని నువ్వు చెప్పేది విను... చాలు

ధర్మం చెప్పడానికి లోకం లో ఉన్న ఐదు ప్రమాణాలలో ఒకటి అంతరాత్మ ప్రబోధం. అది మనిషికి ఎప్పుడూ లోపల ఉండే ధర్మాన్ని చెబుతుంటుంది. చెయ్యకూడని పని చేస్తున్నప్పుడు... లోపలినుంచి ఒక సణుగుడు వినిపిస్తుం టుంది. ''ఎం దుకు చేస్తు న్నావు... నలుగురి లో ఎంత మంచి పేరు తెచ్చుకున్నావు. తప్పుచేసి మచ్చ తెచ్చుకోకు, నామాట విను... దానికి దూరంగా ఉండు..'' అని లోపలి నుంచి ఘోషిస్తుంటుంది.



మీరు ఏ పని మొదలు పెట్టినా ఒక్క అంత రాత్మ మాత్రమే ఒక ప్రశ్నతో మిమ్మల్ని నిలదీస్తుంటుంది. 'ఇది చేయవచ్చా ?.. అని! అలా నిలదీస్తున్నందుకు దాని గొంతు పిసికేయకూడదు. అదేం చెబు తుందో ఓపికగా విని ఆలోచించినవారిని ''శ్రద్ధ కలిగిన వారు'' అంటారు. అలా ఎందుకడుగుతుంది అంటే... అప్పటికే ఆయన.. శారీరక, మానసిక సుఖాల కోసం దిగజారిపోయాడు. అయినా అది మాత్రం హెచ్చరిస్తూనే ఉంటుంది. దాని మాట విన్న వాడు మహాత్ముడవుతాడు. శరీరంలో శక్తి, ఇంద్రి యాలకు పటుత్వం, మన సులో విజృంభణ ఉందని సుఖాన్ని పొందడం మంచిది కాదు. ఎవరూ కూడా మొదటి నుంచే నూరు శాతం నిలకడగా ఉండలేరు. అది అంత తేలికేం కాదు కూడా. కానీ లోపలిమనిషి చెబుతున్న వాటిని శ్రద్ధగా వినడం అలవాటు చేసుకుంటే.. క్రమేణా ఆచరణలో కూడా అలవాటవుతుంది. అదే ధర్మంగా నడుచుకోవడం అంటే.

మహాత్మాగాంధీ మొదటిసారి లండన్ బయల్దేరుతున్నప్పుడు... మద్యం, మాంసం, మగువలకు వశపడే అవకాశాలు అక్కడ ఎక్కు వని వినడం వల్ల తల్లి అనుమతి నిరాకరిం చింది. వారి కుటుంబ శ్రేయోభిలాషి అయిన ఒక స్వామీజీ జోక్యం చేసు కొని ..''ఏ కారణం చేత కూడా ఈ మూడింటికీ వశపడను'' అని తల్లికి ప్రమాణం చేయించి పంపారు. తల్లి భయాలే నిజమయ్యే పరిస్థితి ఏర్ప డింది. ఒక స్త్రీతో ఆయ నకు హద్దులు దాటిన సంబంధం ఏర్పడుతున్న క్షణాల్లో ఉన్నట్టుండి అమ్మకిచ్చిన మాట గుర్తొ చ్చింది. ఆయన వెంటనే వెళ్ళిపోయి.. తరువాత ఆ స్త్రీకి నిజాయితీగా ఒక ఉత్తరం రాస్తూ... తనకు పెళ్ళయిందనీ, ఒక కుమారుడు కూడా ఉన్నాడనీ, ముందుగా ఈ విషయాలు చెప్పకపోవడం తప్పేనని, తనను క్షమించాలని కోరాడు. అదీ అంతరాత్మ ప్రబోధం అంటే. అదీ లోపలున్న మనిషి మాటను నువ్వు వినడం అంటే.. ఇటువంటిదే మరో సంఘటన జరిగినా.. మనసు మాట విని దానికి దూరంగా జరిగాడు... వీటిని నెమ రేసుకుంటూ ఆయన ఇలా రాసుకున్నారు...

''భక్తి అనేది మనిషిలో ఉన్న విశృంఖల త్వాన్ని తుడిచేస్తుంటుంది. ఇంటిని ఏ కారణం తో శుభ్రపరుచు కుంటుంటామో... మనసును కూడా భగవద్భక్తి అనే చీపురుపట్టి లోపలి మాలిన్యాలను శుభ్రపరుచుకుంటుండాలి. మనసు నిర్మలంగా ఉన్నప్పుడు అంతరాత్మ మాట విని ధర్మమార్గంలోనే నడుస్తుంటుంది. సుఖాలకోసం పక్క చూపులు చూడదు.''



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అమృత బిందువులు

- బాధల్ని మిగిల్చే బంధుత్వాల కంటే... ప్రశాంతతను ఇచ్చే ఒంటరితనం గొప్పది. అవసరాలకు పలకరించే పలకరింపుల కంటే... బాధల్ని తగ్గించే కన్నీళ్లే గొప్పవి. అవసరాల్ని తీర్చని ఆస్తుల కంటే... ఆకల్ని తీర్చే అన్నం గొప్పది.
- వయస్సు పెరిగే కొద్దీ సమాజంలో, మనిషి జీవితం ఆప్యాయతకి, మంచితనానికి చిరునామా, అలంకరణ కావాలి. కానీ, అహంకారానికి, ద్వేషానికి, గొడవలకు మూలం కాకూడదు.
- ఆశ జీవితాన్ని ఎన్నో మలుపులు తిప్పుతుంది. అత్యాశ అధఃపాతాళానికి దారితీస్తుంది. నిరాశ బతుకు మీద విరక్తిని పెంచుతుంది.
- సేవచేయడం, శ్రద్ధగా వినడం, గ్రహించడం, గుర్తుపెట్టుకోవడం, ఊహించడం, పొరపాటును సరిదిద్దడం, ప్రయోజనం కలిగించడం, తత్త్వజ్ఞానం అనే బుద్ధికున్న ఎనిమిది లక్షణాలు మానవుణ్ని మహోన్నతుడిగా కీర్తి శిఖరాలమీద కూర్చోబెడతాయి. ఇవే మహోన్నత మార్గాన మనిషిని నడిపిస్తాయి.
- నిన్నటి కన్నా నేడు మిన్నగా... నేటికన్నా మిన్నగా రేపు జీవించాలి.
- జీవితంలో వాస్తవం ఉండాలి. ఏం జరిగినా స్వీకరించే ధైర్యం ఉండాలి.
- మన జీవితాన్ని మనమే రూపు దిద్దుకోవాలి.

సినిమా

కథ మళ్లీ కలిపింది



మహేశ్‌బాబు, త్రివిక్రమ్

ఓ సినిమా సూపర్ హిట్ అయితే ఆ హీరో, డైరెక్టర్ కాంబినేషన్ రిపీట్ కావాలని ఆడియన్స్ కోరుకుం టుంటారు. కానీ సరైన కథ కుదిరితేనే ఆ కాంబో రిపీట్ అవుతుంది. అలా మంచి కథ కుదరడంతో పదేళ్ల తర్వాత టాలీవుడ్‌లో రిపీట్ అవుతున్న కొన్ని కాంబినేషన్స్‌పై (హీరో–డైరెక్టర్) ఓ లుక్కేద్దాం.

★ హీరో మహేశ్ బాబు ముచ్చటగా మూడోసారి దర్శకుడు త్రివిక్రమ్‌తో సినిమా చేస్తున్నారు. 2005లో వచ్చిన 'అతడు' సినిమా కోసం మహేశ్, త్రివిక్రమ్ తొలిసారి చేతులు కలిపారు. ఆ మూవీ హిట్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో 2010లో 'ఖలేజా' చిత్రం వచ్చింది. ఇప్పుడు పన్నెండేళ్ల తర్వాత మహేశ్, త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న సినిమా సెట్స్‌పైన ఉంది. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పూజాహెగ్డే, శ్రీలీల హీరోయిన్స్. ఇప్పటికే కొంత షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుతో పాటు పూజాహెగ్డే, శ్రీలీల పాల్గొంటారని తెలిసింది. ఈ సినిమాలో నటి రమ్యకృష్ణ ఓ కీలక పాత్ర చేయనున్నారని టాక్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటోంది చిత్రయూనిట్.

★ హీరో అల్లు అర్జున్‌తో 'ఆర్య' (2004), 'ఆర్య 2' (2009) వంటి ప్రేమకథా చిత్రాలు తీశారు దర్శకుడు సుకుమార్. పది సంవత్స రాల తర్వాత అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప' రూపొందుతోంది. ఇందులో రష్మికా మందన్న హీరోయిన్. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకువస్తోంది. 'పుష్ప' తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై అద్భుత విజయం సాధించింది. దీంతో మలిపార్టు 'పుష్ప: ది రూల్'పై మరింత ఫోకస్ పెట్టారు అల్లు అర్జున్ అండ్ సుకుమార్. ఆల్రెడీ 'పుష్ప: ది రూల్' షూటింగ్ మొదలైంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ మార్చి మొదటివారంలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్న 'పుష్ప: ది రూల్' కి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 2024లో రిలీజ్ కానున్నట్లు తెలిసింది.



అల్లు అర్జున్
సుకుమార్

★ పదిహేను సంవత్సరాల క్రితం వచ్చిన 'ఢీ: కొట్టిచూడు'(2007) సినిమా ప్రేక్షకులను బాగా ఎంటర్‌టైన్ చేసింది. మంచు విష్ణు హీరోగా నటించిన ఈ సినిమాకు శ్రీనువైట్ల దర్శకత్వం వహించారు. అయితే వీరిద్దరి కాంబినేషన్‌లోని మరో సినిమా ప్రకటన రావడానికి దాదాపు పుష్కరకాలం పట్టింది. 'ఢీ: కొట్టిచూడు' సినిమాకు సీక్వెల్‌గా 'ఢీ2: డబుల్ డోస్' సినిమా రూపొందను న్నట్లు 2020 నవంబరులో ప్రకటించారు మంచు విష్ణు. అయితే ఈ సినిమాపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది. మరోవైపు గోపీచంద్‌తో ఓ సినిమా చేయనున్నట్లు ఇటీవల వెల్లడించారు దర్శకుడు శ్రీనువైట్ల. మరి.. ఆయన దర్శకత్వంలో ఏ హీరో సినిమా ముందుగా సెట్స్‌పైకి వెళుతుందో తెలియాలంటే కొద్దిరోజులు వేచి చూడాలి.



మంచు విష్ణు, శ్రీను వైట్ల

★ ఆది పినిశెట్టి హీరోగా నటించిన చిత్రాల్లో 2009లో వచ్చిన హారర్ ఫిల్మ్ 'ఈరమ్' మంచి హిట్ సాధించింది. అరివళగన్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రం తెలుగులో 'వైశాలి'గా 2011లో విడుదలై సక్సెస్ సాధించింది. పద్నాలుగేళ్ల తర్వాత ఆది, అరివళగన్ కాంబినేషన్‌లో తెలుగు, తమిళ భాషల్లో 'శబ్దం' అనే చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ మొదలైంది. లక్ష్మీ మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 7జీ శివ నిర్మిస్తు న్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



ఆది పినిశెట్టి



అరివళగన్

కాగా పదేళ్ల గ్యాప్ తర్వాత రిపీట్ అవుతున్న హీరో, డైరెక్టర్ కాంబినేషన్ జాబితాలో మరికొన్ని తెలుగు చిత్రాలు ఉన్నాయి.

కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి కన్నుమూత



కె.విశ్వనాథ్, జయలక్ష్మి


తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. దివంగత డైరెక్టర్ 'కళాతపస్వి' కె.విశ్వనాథ్ సతీమణి కాశీనాథుని జయలక్ష్మి(88) ఇకలేరు. ఆదివారం సాయంత్రం 5:45 గంటలపైన ఆమె తుదిశ్వాస విడిచారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంచానికే పరిమితమయ్యారు. భర్త విశ్వనాథ్ మరణం తర్వాత మరింత అనారోగ్యానికి గురయ్యారు జయలక్ష్మి. ఈ క్రమంలోనే ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు కుటుంబ సభ్యులు. అక్కడే ఆమె తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కైకలూరు జయలక్ష్మి స్వస్థలం. 1935లో వినాయక చవితి రోజున జన్మించారామె. ఆమె అన్నయ్య చదువు కోసం వారి కుటుంబం బందరుకి మారింది. అక్కడి లేడీ యాంథల్ మిషనరీ స్కూల్లో చదివారు జయలక్ష్మి. ఆమె పదో తరగతి చదువుతున్నప్పుడే పద్నాలుగేళ్లకే కె.విశ్వనాథ్‌తో 1948 అక్టోబర్ 2న వివాహం జరిగింది. ఆ తర్వాత మద్రాసులో కాపురం పెట్టారు విశ్వనాథ్–జయలక్ష్మి దంపతులు. వారికి ముగ్గురు సంతానం. పద్మావతి దేవి, కాశీనాథుని నాగేంద్ర నాథ్, కాశీనాథుని రవీంద్రనాథ్. ఈ నెల 2న కె.విశ్వనాథ్ కన్నుమూశారు. ఆయనతో 75 ఏళ్ల వైవాహిక జీవితం గడిపారు జయలక్ష్మి. కె.విశ్వనాథ్ మరణించినప్పటి నుంచి ఆయన మీద ఉన్న ప్రేమతో ఆమె తీవ్ర మనో వేదనకు గురై, ఆరోగ్యం మరింత క్షీణించ టంతో తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహాన్ని ఆస్పత్రి నుంచి ఫిలింనగర్‌లోని ఇంటికి తరలించారు. విశ్వనాథ్ చనిపోయిన 24 రోజులకే జయ లక్ష్మి కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. జయలక్ష్మి మృతిపట్ల పలు వురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. కె.విశ్వ నాథ్ తుదిశ్వాస విడిచిన వార్డులోనే జయలక్ష్మి కూడా కన్నుమూయటం దురదృష్టకరమని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం పంజాగుట్ట స్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

వైఎస్ జగన్ సంతాపం:

జయలక్ష్మి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

యాక్షన్ బిగిన్స్



సమంత

మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకుం టున్న సమంత మెల్లిగా వర్క్‌లో బిజీ అవుతున్నారు. ఇటీవల బాక్సింగ్ సాధన చేస్తున్న ఫోటోను షేర్ చేశారు సమంత. తాజాగా తాను గుర్రపుస్వారీ ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేసి, ''ది బ్యూటీ అండ్ ది బీస్ట్.. రెండూ నీవే..' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. కాగా సమంత బాక్సింగ్, గుర్రపు స్వారీ ప్రాక్టీస్ చేస్తున్నది 'సిటాడెల్' ప్రాజెక్ట్ కోసమట. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఆల్రెడీ ముంబైలో షూటింగ్ కూడా మొదలైంది. అయితే తన పాత్రలో భాగంగా సమంత యాక్షన్ సీన్స్ చేయాల్సి ఉందట. అందుకే బాక్సింగ్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారని టాక్. సో.. సమంత బ్యాక్ ఇన్ టు ది యాక్షన్ అని నెటిజన్లు అంటున్నారు.

సినిమానే మనల్ని ఎంచుకుంటుంది – హరీష్ శంకర్



ప్రణవ చంద్ర, మాళవిక, హరీష్, శివ నాగేశ్వరరావు

''మంచి చిత్రం ఎంచుకున్నామంటూ చాలా మంది అంటారు. కానీ, సినిమా అంటే ప్యాషన్ ఉన్నవాళ్లనే ఆ సినిమా ఎంపిక చేసుకుంటుంది.. అంతేకానీ, సినిమాను మనం సెలెక్ట్ చేసుకోం'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. ప్రణవ చంద్ర, మాళవిక సతీషన్ జంటగా శివ నాగేశ్వరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దోచేవారెవరురా'. బొడ్డు కోటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా మార్చి 11న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హరీష్ శంకర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఎన్నో మంచి సినిమాలు తీసిన శివ నాగేశ్వరావుగారు ఇప్పుడు 'దోచేవారెవరురా' వంటి మంచి కథతో వస్తున్నారు. ట్రైలర్, పాటలు బాగున్నాయి.. ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అన్నారు. ''కథ మొత్తం డబ్బు చుట్టూ తిరుగు తుంది. కుటుంబమంతా చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు శివ నాగేశ్వరరావు. ''దోచేవారెవరురా'లో మంచి వినోదం ఉంటుంది'' అన్నారు బొడ్డు కోటేశ్వర రావు.

మంచి సినిమా చేశాం – దిల్ రాజు



మామిడి హరికృష్ణ, 'దిల్'రాజు

ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'బలగం'. వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. 'దిల్' రాజు ప్రొడక్షన్స్, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ చిత్రం మార్చి 3న రిలీజ్ కానుంది. ఈ మూవీలోని 'బలరామ నర్సయ్యో..' అనే పాటను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ రిలీజ్ చేసి, మాట్లాడుతూ–''చావు అనే అశుభ అంశాన్ని తీసుకుని శుభాల వైపు తీసుకువెళ్లే గొప్ప ప్రయోగమే 'బలగం'' అన్నారు. ''బలగం' చాలా మంచి సినిమా'' అన్నారు 'దిల్' రాజు.''మరిన్ని ప్రయోగాత్మక సినిమాలు రావాలంటే ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి'' అన్నారు ప్రియదర్శి.

కామెడీ డ్రామా



'వెన్నెల' కిషోర్, సునీల్

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, 'వెన్నెల' కిషోర్, ధనరాజ్, 'బిగ్‌బాస్' ఫేమ్ వాసంతి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'భువన విజయమ్'. ఈ చిత్రం ద్వారా యలమంద చరణ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. కిరణ్, వీఎస్కే నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని దర్శకుడు వేణు ఊడుగుల విడుదల చేశారు. ''కామెడీ డ్రామాగా రూపొందిన చిత్రం 'భువన విజయమ్'. వేసవిలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: లక్ష్మి, సంగీతం: శేఖర్ చంద్ర.

బిగ్ స్నేక్ రెడీ



యేలూరు సురేంద్ర రెడ్డి

చైనాలో ఘన విజయం సాధించిన 'బిగ్ స్నేక్ కింగ్' చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. లిక్సైన్ లుఓ, వాంగ్ జియోలాంగ్, వెంకీ జూఓ, గాఓ షెంగ్యు కీలక పాత్రల్లో గుఓ మింగర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బిగ్ స్నేక్ కింగ్'. గత ఏడాది మే 11న చైనాలో విడుదలైన ఈ చిత్రం మార్చి 3న ఇండియాలో విడుదల కానుంది. బుద్ధ భగవాన్ పతాకంపై యేలూరు సురేంద్ర రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''బిగ్ స్నేక్ కింగ్' సిరీస్‌లో చైనా వాళ్లు దాదాపు 10 సినిమాలు చేశారు.. వాటిని కూడా నెలకి ఒకటి చొప్పున తెలుగులో రిలీజ్ చేస్తాను'' అన్నారు.

యాక్షన్ థ్రిల్లర్



స్మిరితరాణి, విన్ను

విన్ను మద్దిపాటి, స్మిరితరాణి బోర జంటగా సాయిశివన్ జంపాన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గ్రంథాలయం'. ఎస్.వైష్ణవి శ్రీ నిర్మించిన ఈ సినిమా మార్చి 3న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకులు బి.గోపాల్, కాశీ విశ్వనాథ్, నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ''కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ట్రైలర్ రిలీజయ్యాక సినిమాపై అంచనాలు పెరిగాయి. డిస్ట్రిబ్యూటర్స్ గ్రూప్‌లలో మా ట్రైలర్ వైరల్‌గా మారింది'' అన్నారు సాయిశివన్ జంపాన, ఎస్.వైష్ణవి శ్రీ.

విజయంతో ముగించిన హైదరాబాద్ ఎఫ్‌సీ

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) లీగ్ దశను హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) విజయంతో ముగించింది. ఆదివారం కొచ్చిలో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 1–0 గోల్ తేడాతో కేరళ బ్లాస్టర్స్‌ను ఓడించింది. 29వ నిమిషంలో చేసిన ఏకైక గోల్‌తో బోర్జా హెరెరా హైదరాబాద్‌ను గెలిపించాడు. లీగ్ దశలో ఆడిన 20 మ్యాచ్‌లలో 13 గెలిచి 4 మ్యాచ్‌లు ఓడిన హైదరాబాద్ మరో 3 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. మొత్తం 42 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన టీమ్ ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధించింది. లీగ్ దశలో 46 పాయింట్లతో ముంబై సిటీ ఎఫ్‌సీ అగ్రస్థానంలో నిలిచింది. మార్చి 4న కోల్‌కతాలో మోహన్‌బగాన్, ఒడిశా ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో హైదరాబాద్ రెండో సెమీఫైనల్ (తొలి అంచె)లో తలపడుతుంది. ఈ మ్యాచ్ మార్చి 9న హైదరాబాద్‌లోనే జరుగుతుంది. మార్చి 13న రెండో సెమీఫైనల్ (రెండో అంచె) మ్యాచ్ ప్రత్యర్థి వేదికపై జరుగుతుంది.



ఆసీస్ అమ్మాయిల 'సిక్సర్'

ఎదురే లేని ప్రదర్శనతో, ఓటమెరుగని జైత్రయాత్రతో కంగారూ సేన ఆరో సారి విశ్వ విజేతగా నిలిచింది. అన్ని రంగాల్లో రాణించిన ఆస్ట్రేలియా అమ్మాయిలు ఈ టి20 ప్రపంచకప్‌ను కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. సఫారీ 'తొలిసారి' ఫైనల్ చేరిన మురిపెం రన్నరప్‌గానే ముగిసింది. సొంతగడ్డపై తమ మద్దతుదారుల మధ్య బౌలింగ్‌లో ఆకట్టుకున్న దక్షిణాఫ్రికా... బ్యాటింగ్ వైఫల్యంతో ప్రపంచకప్ కలను సాకారం చేసుకోలేకపోయింది.

- ఆరో సారి టి20 ప్రపంచకప్ కైవసం
- ఫైనల్లో 19 పరుగులతో దక్షిణాఫ్రికాపై గెలుపు
- బెత్ మూనీ అర్ధ సెంచరీ



కేప్‌టౌన్: ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు మరో 'హ్యాట్రిక్'తో టి20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. 2010, 2012, 2014లలో వరుసగా మూడు సార్లు విశ్వవిజేతగా నిలిచిన ఆసీస్... 2016 మెగా ఈవెంట్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మళ్లీ 2018, 2020, 2023లలో ప్రపంచకప్‌ల హ్యాట్రిక్ నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో మెగ్ లానింగ్ సేన 19 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై నెగ్గింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్ మూనీ (53 బంతుల్లో 74 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు అర్ధ సెంచరీ సాధించగా, ఆష్లే గార్డ్‌నర్ (21 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడింది. సఫారీ బౌలర్లలో షబ్నిమ్ ఇస్మాయిల్ (2/26), మరిజన్ కాప్ (2/35) కంగారు పెట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 137 పరుగులే చేసింది. ఓపెనర్ లారా వోల్వార్ట్ (48 బంతుల్లో 61; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాటం వృథా అయ్యింది. టోర్నీలో 110 పరుగులు చేయడంతో పాటు 10 వికెట్లు తీసిన ఆసీస్ ఆల్‌రౌండర్ గార్డ్‌నర్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది.

బెత్ మూనీ సూపర్ ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో గొప్ప మెరుపులేమీ లేవు. కానీ ఒక్క బ్యాటర్ మూనీ ఆస్ట్రేలియాను 20 ఓవర్ల పాటు నడిపించింది. ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన ఆమె కడదాకా క్రీజులో నిలిచింది. పిచ్ నెమ్మదించిన సమయంలో... ప్రత్యర్థి సీమర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తున్న తరుణంలో వికెట్‌ను కాపాడుకొని... కష్టమైనా సరే పరుగుల్ని సాధించిపెట్టింది. మరో ఓపెనర్ అలీసా హీలీ (20 బంతుల్లో 18; 3 ఫోర్లు) పవర్ ప్లే వరకైనా నిలువలేదు. అయితే టాపార్డర్‌లో ఆష్లే గార్డ్‌నర్‌తో మూనీ భాగస్వామ్యం జట్టు ఇన్నింగ్స్‌కు కీలకంగా మారింది. ఇద్దరు రెండో వికెట్‌కు 46 పరుగులే జత చేసినప్పటికీ... తర్వాత పిచ్ పరిస్థితుల దృష్ట్యా అదే మెరుగైన భాగస్వామ్యం అని చెప్పొచ్చు. తర్వాత గ్రేస్ హారిస్ (10), కెప్టెన్ మెగ్ లానింగ్ (10), ఎలైస్ పెరీ (7), వేర్‌హమ్ (0) సులువుగానే దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి పడిపోయారు. షబ్నిమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో తొలి రెండు బంతుల్ని మూని 6, 4గా బాదింది. అయితే మూడో బంతికి ఒక్క పరుగు మాత్రమే రాగా... వరుస బంతుల్లో షబ్నిమ్ రెండు వికెట్లతో ఆసీస్‌ను కట్టడి చేసింది.



రాణించిన వోల్వార్ట్

సొంతగడ్డపై కాస్త కష్టపడితే ఛేదించే లక్ష్యమే ఎదురుగా ఉన్నప్పటికీ దక్షిణాఫ్రికా ఆ పని చేయలేకపోయింది. ఆసీస్ చేసింది పెద్ద స్కోరేం కాకపోవడంతో బౌలర్లు తొలి ఓవర్‌నుంచే పట్టుబిగించారు. దీంతో తొలి 5 ఓవర్లలో సఫారీ వికెట్ నష్టానికి 17 పరుగులే చేసింది. ఓపెనర్ లారా వోల్వర్ట్ ధాటిగా ఆడటంతో కుదుట పడుతున్న దక్షిణాఫ్రికాకు మరో బ్యాటర్ సహకారం లేకపోవడంతో ప్రపంచకప్పే మూల్యంగా చెల్లించుకుంది. టాపార్డర్‌లో బ్రిట్స్ (10), మరిజన్ కప్ (11) సహా, మిడిలార్డర్‌లో కెప్టెన్ సునే లూస్ (2), నదిన్ డి క్లెర్క్ (8), అనెకె బాష్ (1) ఆసీస్ బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోయారు. క్లొయె ట్రియాన్ (23 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్)లాంటి బ్యాటర్ ఇంకొక్కరు జత యినా సఫారీ కొత్త చరిత్ర సృష్టించేది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలీసా హీలీ (సి) డిక్లెర్క్ (బి) మరిజన్ 18; బెత్ మూనీ నాటౌట్ 74; ఆష్లే గార్డ్‌నర్ (సి) లూస్ (బి) ట్రియాన్ 29; గ్రేస్ (బి) ఎమ్‌లబా 10; మెగ్ లానింగ్ (సి) ట్రియాన్ (బి) మరిజన్ 10; ఎలైస్ పెరీ (సి) బ్రిట్స్ (బి) షబ్నిమ్ 7; జార్జియా (బి) షబ్నిమ్ 0; తాహ్లియా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 156. **వికెట్ల పతనం:** 1–36, 2–82, 3–103, 4–122, 5–155, 6–155. **బౌలింగ్:** ఎమ్‌లబా 3–0–24–1, షబ్నిమ్ 4–1–26–2, మరిజన్ కాప్ 4–0–35–2, అయబొంగ ఖాకా 4–0–27–0, నదిన్ డిక్లెర్క్ 3–0–27–0, క్లోయె ట్రియాన్ 2–0–15–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లారా వోల్వార్ట్ (ఎల్బీ డబ్ల్యూ) (బి) షట్ 61; బ్రిట్స్ (సి) మెక్‌గ్రాత్ (బి) బ్రౌన్ 10; మరిజన్ (సి) బ్రౌన్ (బి) గార్డ్‌నర్ 11; లూస్ రనౌట్ 2; ట్రియాన్ (బి) జొనసెన్ 25; డి క్లెర్క్ నాటౌట్ 8; బాష్ రనౌట్ 1; జాఫ్త నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 137. **వికెట్ల పతనం:** 1–17, 2–46, 3–54, 4–109, 5–121, 6–122. **బౌలింగ్:** మేగన్ షట్ 4–0–23–1, ఆష్లే గార్డ్‌నెర్ 4–0–20–1, డార్సి బ్రౌన్ 4–0–25–1, పెరీ 1–0–5–0, జెస్ జొనసెన్ 3–0–21–1, జార్జియా 2–0–21–0, తాహ్లియా మెక్‌గ్రాత్ 2–0–17–0.

సెమీఫైనల్లో శ్రీకాంత్



పుణే: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ సెమీస్‌లోకి అడుగు పెట్టాడు. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో రెండో సీడ్ శ్రీకాంత్ 21–10, 18–21, 21–16 స్కోరుతో కార్తికేయ కుమార్‌పై విజయం సాధించాడు. ఇతర పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, హర్షీల్ దాని, మిథున్ మంజునాథ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్ – ట్రిసా జాలీ జంట సెమీస్‌లోకి అడుగు పెట్టింది. క్వార్టర్స్‌లో గాయత్రి–ట్రిసా 21–16, 21–12 తేడాతో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్పపై విజయం సాధించారు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అస్మిత చలీహ సెమీస్ చేరుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హేమనాగేంద్ర–కనికా కన్వాల్ జోడి సెమీస్ చేరుకుంది. ఇషాన్ భట్నాగర్–తనీషా క్రాస్టో జంట వీరికి వాకోవర్ ఇచ్చింది.

న్యూజిలాండ్ 202/3



వెల్లింగ్టన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 226 పరుగుల ఆధిక్యం కోల్పోయి ఫాలో ఆన్ ఆడిన ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మ్యాచ్ మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి కివీస్ 3 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. టామ్ లాథమ్ (172 బంతుల్లో 83; 11 ఫోర్లు), డెవాన్ కాన్వే (155 బంతుల్లో 61; 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 149 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. క్రీజ్‌లో కేన్ విలియమ్సన్ (25 బ్యాటింగ్), నికోల్స్ (18 బ్యాటింగ్) ఉన్నారు. న్యూజిలాండ్ మరో 24 పరుగులు వెనుకబడి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 138/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 209 పరుగులకు ఆలౌటైంది. టిమ్ సౌతీ (49 బంతుల్లో 73; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగాడు.

భారత బాక్సర్లకు రజతాలు

సోఫియా: స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు అనామిక, అనుపమ, గోవింద్ కుమార్ సహాని రజత పతకాలు సాధించారు. మహిళల 50 కేజీల ఫైనల్లో జాతీయ చాంపియన్ అనామిక 1–4తో చైనాకు చెందిన హు మెయి చేతిలో ఓడింది. పురుషుల 48 కేజీల తుదిపోరులో గోవింద్ కుమార్ 1–4తో షోదియోర్జన్ మెలికుజీవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో పరాజయం చవిచూశాడు. మహిళల 81 కేజీల ఫైనల్లో అనుపమ 0–5తో ఆస్ట్రేలియన్ బాక్సర్ ఎమ్మా సూ గ్రీన్‌ట్రి చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో భారత్ మొత్తం ఎనిమిది పతకాలు సాధించింది. ఇందులో మూడు రజతాలు కాగా... ఐదు కాంస్య పతకాలున్నాయి. పురుషుల కేటగిరీలో బిశ్వామిత్ర చొంగ్థమ్ (51 కేజీలు), సచిన్ (54 కేజీలు), మహిళల విభాగంలో కలైవాణి (48 కేజీలు), శ్రుతి యాదవ్ (70 కేజీలు), మోనిక (ప్లస్ 81 కేజీలు) కాంస్యాలు గెలిచారు.



జాతీయ హాకీ విజేత మధ్యప్రదేశ్

సాక్షి, కాకినాడ: జాతీయ మహిళల సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో మధ్యప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో మధ్యప్రదేశ్ 5–1 గోల్స్ తేడాతో మహారాష్ట్రను చిత్తు చేసింది. మధ్యప్రదేశ్ తరఫున దీక్షా తివారి (2వ నిమిషం, 4వ ని.), మన్‌మీత్ కౌర్ (38వ ని.), ప్రీతి దూబే (42వ ని.), ఐశ్వర్య చవాన్ (42వ ని.) గోల్స్ సాధించగా... మహారాష్ట్ర జట్టునుంచి లాల్‌రిండికి (25వ ని.) ఏకైక గోల్ చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రతిభ ఆర్యకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మరో వైపు ప్లే ఆఫ్ పోరులో హరియాణాను 2–1తో ఓడించిన జార్ఖండ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-ఈపీఎఫ్‌వోలో 557 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, ఏపీఎఫ్‌సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 557
- **పోస్టుల వివరాలు:** ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్–418, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–159.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఈవో/ఏవో పోస్టులకు 30 ఏళ్లు, ఏపీఎఫ్‌సీ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, అనంతపురం, హైదరాబాద్.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2023.
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం.. ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ జర్నలిజం కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు- అర్హతలు

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం(పీజీడీజే): కోర్సు వ్యవధి 12 నెలలు, కనీస విద్యార్హత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **డిప్లొమా ఇన్ జర్నలిజం(డీజే):** కోర్సు వ్యవధి ఆరు నెలలు, కనీస విద్యార్హత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డీటీవీజే):** కోర్సు వ్యవధి ఆరు నెలలు, కనీస విద్యార్హత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం(సీజే):** కోర్సు వ్యవధి మూడు నెలలు, కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.

ముఖ్య సమాచారం

- ఈ కోర్సులను రెగ్యులర్‌గాను, కరస్పాండెన్స్(దూర విద్య) విధానంలోనూ చేయవచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచే పాఠ్యాంశాలను లైవ్‌లో వినవచ్చు.
- తెలుగు లేదా ఇంగ్లిష్‌ను బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకోవచ్చు.
- ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి.
- ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందడానికి చివరి తేది: 07.03.2023
- అడ్మిషన్లు పొందడానికి చివరి తేది:13.03.2023
- వెబ్‌సైట్: www.apcj.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, వడోదరలో 546 పోస్టులు

గుజరాత్‌లోని వడోదరలో బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఒప్పంద ప్రాతిపదికన వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 546
- **పోస్టుల వివరాలు:** వెల్త్ మేనేజ్‌మెంట్–24, ప్రైవేట్ బ్యాంకింగ్–17, అక్విజిషన్–505.
  వెల్త్ మేనేజ్‌మెంట్: విభాగాలు: ఎన్ఆర్ఐ వెల్త్ ప్రొడక్ట్స్ మేనేజర్, గ్రూప్ సేల్స్ హెడ్, వెల్త్ స్ట్రాటజిస్ట్, హెడ్ వెల్త్–టెక్నాలజీ, ప్రొడక్ట్ మేనేజర్(ట్రేడ్ అండ్ ఫారెక్స్), ట్రేడ్ రెగ్యులేషన్ సీనియర్ మేనేజర్. **ప్రైవేట్ బ్యాంకింగ్: విభాగా లు:** రేడియన్స్ ప్రైవేట్ సేల్స్ హెడ్,ప్రొడక్ట్ హెడ్–ప్రైవేట్ బ్యాంకింగ్, ప్రైవేట్ బ్యాంకర్. **అక్విజిషన్: విభాగాలు:** అక్విజిషన్ ఆఫీసర్, నేషనల్ అక్విజిషన్ హెడ్, రీజనల్ అక్విజిషన్ సేల్స్ హెడ్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ(గ్రాడ్యుయేషన్)ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** అక్విజిషన్ విభాగానికి సంబంధించిన పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 21 నుంచి 28 ఏళ్లు ఉండాలి. ఇతర పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 24 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్/ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.03.2023.
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

కంటోన్మెంట్ బోర్డ్, ఝాన్సీలో 17 ఉద్యోగాలు

ఝాన్సీలోని కంటోన్మెంట్ బోర్డ్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
- **పోస్టుల వివరాలు:**అసిస్టెంట్ ఇంజనీర్,అసిస్టెంట్ టీచర్, జూనియర్ అసిస్టెంట్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఇంటర్మీడియట్/బ్యాచిలర్స్ డిగ్రీ/బీటీసీ/బీఈడీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** కాంపిటేటివ్ ఎగ్జామినేషన్/స్కిల్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** రాతపరీక్ష 100 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు 1 మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉండవు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.03.2023.
- **వెబ్‌సైట్:** jhansi.cantt.gov.in

ఫార్మసీలో బెస్ట్ పీజీకి.. జీప్యాట్!

ఫార్మసీ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఈ రంగంలో ఫార్మసీ నిపుణుల సేవలు ఎంతో కీలకం. ఎం.ఫార్మసీతో ఫార్మా రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. బీఫార్మసీ ఉత్తీర్ణులు ఉన్నత విద్య ఎంఫార్మసీలో చేరేందుకు మార్గం.. జీప్యాట్! ఈ ఎంట్రన్స్‌లో ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయిలో నైపర్ సహా పలు ప్రముఖ ఫార్మా ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంఫార్మసీలో చేరేందుకు అవకాశం లభిస్తుంది. ఇటీవల జీప్యాట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జీప్యాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

» జీప్యాట్ 2023 నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్‌టీఏ
» మాస్టర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి జీప్యాట్
» ఎం.ఫార్మసీ పూర్తయితే విస్తృత ఉద్యోగావకాశాలు
» జీప్యాట్ ద్వారా ప్రవేశం పొందితే స్కాలర్‌షిప్ సదుపాయం



బీ.ఫార్మసీ.. విద్యార్థుల నుంచి ఆదరణ పొందుతున్న కోర్సుల్లో ఒకటి. ముఖ్యంగా బైపీసీ విద్యార్థులకు చక్కటి ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. బీఫార్మసీ తర్వాత తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌లో ఎం.ఫార్మసీ పూర్తి చేస్తే.. ఉన్నత అవకాశాలు అందుకోవచ్చు. జాతీయ స్థాయిలోని పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎం ఫార్మసీలో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎంట్రన్స్.. గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్). జీప్యాట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది.

జీప్యాట్‌తో ప్రయోజనాలు

- జీప్యాట్ స్కోర్ ఆధారంగా దేశంలోని 800కు పైగా ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎం ఫార్మసీలో ప్రవేశం పొందొచ్చు. • దేశంలో ఫార్మా విద్యారంగంలో మేటి సంస్థలుగా పేరొందిన నైపర్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)ల్లో సీటు పొందాలంటే.. తొలుత జీప్యాట్‌లో అర్హత సాధించాలి. ఆ తర్వాత నైపర్‌లు నిర్వహించే నైపర్ జేఈఈలో ర్యాంకు సొంతం చేసుకోవాలి. • జీప్యాట్ ఉత్తీర్ణతతో ఎం.ఫార్మసీలో చేరితే నెలకు రూ.12,400 స్కాలర్‌షిప్ అందుకునే సదుపాయం ఉంది. • రాష్ట్రాల పరిధిలో ఎం.ఫార్మసీ సీట్ల భర్తీలో ముందుగా జీప్యాట్ ఉత్తీర్ణులకే ప్రాధాన్యం లభిస్తుంది.
- **అర్హత:** నాలుగేళ్ల బీఫార్మసీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 10+2+ 4 విధానంలో బీఫార్మసీ పూర్తి చేసుకోవాలి. 2023లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

4 విభాగాలు.. 500 మార్కులు

- ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎంతో కీలకంగా నిలుస్తున్న జీప్యాట్‌ను ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తున్నారు. మొత్తం నాలుగు విభాగాల్లో.. 500 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ, అనుబంధ సబ్జెక్ట్‌లు 38 ప్రశ్నలు–152 మార్కులు; ఫార్మాస్యుటిక్స్ అనుబంధ సబ్జెక్ట్‌లు 38 ప్రశ్నలు–152 మార్కులు; ఫార్మకోగ్నసీ అనుబంధ సబ్జెక్ట్‌లు 10 ప్రశ్నలు–40 మార్కులు; ఫార్మకాలజీ అనుబంధ సబ్జెక్ట్‌లు 28 ప్రశ్నలు–112 మార్కులు; ఇతర సబ్జెక్టులు 11 ప్రశ్నలు–44 మార్కులకు.. ఇలా మొత్తం 125 ప్రశ్నలు–500 మార్కులకు జీప్యాట్ జరుగుతుంది. • ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్(ఒక మార్కు) నిబంధన అమల్లో ఉంది. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- పరీక్షను నిర్దేశిత తేదీలో రెండు సెషన్స్‌లో (ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు) నిర్వహిస్తారు.

మలి దశలో ఇలా

జీప్యాట్‌లో స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు మలి దశలో.. ప్రత్యేక ప్రవేశ ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. జీప్యాట్ అర్హతతో ఎంఫార్మసీలో ప్రవేశానికి ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు ఈ స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి నేరుగా అడ్మిషన్ కల్పిస్తాయి. మరికొన్ని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు మలి దశలో గ్రూప్ డిస్కషన్,పర్సనల్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహిస్తున్నాయి. వాటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా జీప్యాట్ స్కోర్‌కు వెయిటేజీ కల్పి సీట్లు కల్పిస్తున్నాయి.

విజయం సాధించాలంటే

జాతీయ స్థాయిలో ఎంతో పోటీ నెలకొంటున్న జీప్యాట్‌లో విజయానికి అభ్యర్థులు విభాగాల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ

ఈ విభాగంలో ప్రశ్నలు ప్రాథమికంగా ఉంటాయి. కాన్సెప్టులపై అవగాహనతో సదరు ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు. ముఖ్యంగా ఇందులో కర్బన రసాయన శాస్త్రంపై దృష్టిపెట్టాలి. ఎలక్ట్రోఫిలిక్, న్యూక్లియోఫిలిక్ రియాక్షన్స్, ఇంటర్మీడియెట్ రియాక్షన్స్‌ను అధ్యయనం చేయాలి. ఎస్ఏఆర్ ఆఫ్ స్టెరాయిడ్స్, నామిన్‌క్లేచర్ అండ్ కెమికల్ మొయిటీ ఆఫ్ ది మెడికల్ డ్రగ్స్ గురించి అధ్యయనం చేయాలి.

ఫార్మాస్యుటిక్స్

ఇందులో రాణించాలంటే.. రసాయనాలు, టాబ్లెట్ల సూత్రీకరణతో మొదలుపెట్టాలి. సూక్ష్మజీవులను హతమార్చే(స్టెరిలైజేషన్) నైపుణ్యాలు, న్యూమరికల్ ప్రాబ్లమ్స్‌పై ప్రధానంగా దృష్టిపెట్టాలి. సర్ఫేస్ అండ్ ఇంటర్ ఫేషియల్ ఫినామినా, రియాలజీ, కైనటిక్స్ అండ్ డ్రగ్స్ స్టెబిలిటీ, బయో ఫార్మాటిక్స్ అండ్ ఫార్మకోకైనటిక్స్ అంశాలను ప్రత్యేక దృష్టితో చదవాలి.

ఫార్మకోగ్నసీ

పూర్తిగా థియరీ ఆధారిత ప్రశ్నలతో ఉండే ఫార్మకోగ్నసీలో రాణించాలంటే.. అభ్యర్థులు పాఠ్యాంశాలను క్షుణ్నంగా చదివి షార్ట్ నోట్స్ రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల చివరి దశ ప్రిపరేషన్‌లో ప్రయోజనం ఉంటుంది. ఆయా ఔషధాలకు సంబంధించిన భావనలు, విధానాలు, ప్రభావాలు, ఉపయోగాల గురించి అధ్యయనం చేయాలి. ముఖ్యంగా గ్లైకోసైడ్స్, ఆల్కలాయిడ్స్, వాలటైల్ ఆయిల్స్, రెసిన్స్, టానిన్స్, కార్బోహైడ్రేట్స్, టిష్యూ కల్చర్, హెర్బల్ డ్రగ్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

ఫార్మకాలజీ

జీప్యాట్‌లో ఎక్కువ వెయిటేజీ ఉన్న విభాగంగా ఫార్మకాలజీని పేర్కొనొచ్చు. ఇందులో డ్రగ్ ఇంటరాక్షన్స్, మెకానిజమ్స్, డ్రగ్స్–సైడ్ ఎఫెక్ట్స్(బాడీ పెయిన్స్ వంటి సాధారణ సైడ్ ఎఫెక్ట్స్ కాకుండా)ను అధ్యయనం చేయాలి. డ్రగ్స్‌ను సంక్షిప్త నామాల్లో గుర్తుంచుకొనేందుకు డ్రగ్స్ వర్గీకరణ పాఠ్యాంశం ఉపయోగపడుతుంది. అంకాలజీ(కీమోథెరపీ డ్రగ్స్, నూతన టెక్నాలజీలు తదితరం), న్యూరో ఫార్మకాలజీ, అరుదైన వ్యాధులు, కార్డియో వస్కులర్ అండ్ బ్లడ్ ప్రొడక్ట్స్ తదితర ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

సమస్యల సాధన

- ఇతర సబ్జెక్ట్‌ల విషయంలో ఫార్మాస్యూటికల్ అనాలసిస్‌కు సంబంధించి.. భావనలను అర్థం చేసుకుంటూ చదవాలి. అదేవిధంగా వీలైనన్ని ఎక్కువ సమస్యలు సాధించాలి. ఫార్ములాలను నోట్ చేసుకోవాలి. యూవీ, ఐఆర్, ఎన్ఎంఆర్, మాస్ స్పెక్ట్రోస్కోపీ,క్రొమాటోగ్రఫీ, పోలరోగ్రఫీ అండ్ పొలారిమెట్రీ, ఫ్లేమ్ ఫోటోమీటర్, కండక్టోమెట్రీ, ఆంపెరోమెట్రీ, పొటెన్షియోమెట్రీ అంశాలపై క్షుణ్నమైన అవగాహన ఏర్పరచుకోవాలి. అంతేకాకుండా స్పెక్ట్రోస్కోపీ-మాస్ స్పెక్ట్రోస్కోపీ, యూవీ, ఐఆర్, ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీ చాప్టర్లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.
- క్లాసిఫికేషన్ ఆఫ్ డ్రగ్స్, షెడ్యూల్స్ ఆఫ్ డ్రగ్స్ చాప్టర్లకు వేర్వేరు నోట్సు రాసుకోవాలి.
- జీప్యాట్‌లో న్యూమరికల్ ప్రాబ్లమ్స్ సంఖ్య పెరుగుతున్న విషయాన్ని గుర్తించి ఈ తరహా ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యంగా బయో ఫార్మాస్యుటిక్స్, డిప్రెషన్ ఇన్ ఫ్రీజింగ్ పాయింట్, అలిగేషన్ మెథడ్, డోస్ ఆన్ ది బేసిస్ ఆఫ్ బాడీ వెయిట్ అండ్ ఏజ్ టాపిక్స్‌పై ప్రాబ్లమ్స్ ఎక్కువగా అడుగుతున్నారు.
- గత ప్రశ్నపత్రాలు, మాక్ టెస్టులకు హాజరవ్వడం ద్వారా జీప్యాట్ ప్యాటర్న్‌పై అవగాహన ఏర్పడుతుంది. వెయిటేజీ, ప్రశ్నల తీరు తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

350కు పైగా లక్ష్యంగా

మొత్తం 500 మార్కులకు నిర్వహించే జీప్యాట్‌లో.. 350కు పైగా స్కోర్ లక్ష్యంగా ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా.. బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు సొంతం చేసుకునే అవకాశాలు మెరుగవుతాయి. గత మూడు, నాలుగేళ్లుగా ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు ఖరారు చేసుకున్న అభ్యర్థుల గణాంకాలే ఇందుకు నిదర్శనం. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు 125 నుంచి 200 మధ్యలో మార్కులు సాధన లక్ష్యంగా కృషి చేస్తే సీటు లభించే వీలుంటుంది.

ఎంఫార్మసీ.. క్రేజీ స్పెషలైజేషన్లు

ప్రస్తుత పరిస్థితుల్లో ఫార్మకాలజీ, ఫార్మాస్యుటిక్స్, టాక్సికాలజీ, ఫార్మా మేనేజ్‌మెంట్, ఫార్మకోగ్నసీ స్పెషలైజేషన్‌లు పూర్తి చేస్తే ఎంఫార్మసీ తర్వాత ఉజ్వల అవకాశాలు అందుకోవచ్చు. కోర్సు పూర్తి చేసుకున్నాక డ్రగ్ డిస్కవరీ సంస్థలు, డ్రగ్ ఫార్ములేషన్ కంపెనీలు, బల్క్ డ్రగ్ ప్రొడక్షన్ సంస్థల్లో సీనియర్ లెవల్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. జీప్యాట్‌తో పీజీ పూర్తి చేసిన తర్వాత పీహెచ్‌డీ వైపు అడుగులు వేస్తే పరిశోధన రంగంలో భవిష్యత్తు మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మార్చి 6, 2023
- **దరఖాస్తు సవరణ అవకాశం:**మార్చి 7–9,2023
- **జీప్యాట్ పరీక్ష తేదీ:** మే రెండో వారంలో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- **వెబ్‌సైట్:** https://gpat.nta.nic.in

సాక్షి **ప్రాఫిట్ ప్లస్**

సోమవారం
27-2-2023

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
142	45
59,464	17,466

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,395	▽	195
డోజోన్స్	32,817	▽	337
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,879	▽	29
డాక్స్	15,210	▽	226
షాంఘై	3,267	▽	20
నికాయ్	27,453	△	349

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.93	83.60
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	97.89	101.22
€	యూరో	ఎస్‌బీఐ	86.22	89.31
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.48	62.43
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.34	57.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.68	62.64
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.07	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.80	12.87

విశ్రాంత జీవనం.. హాయిగా..!



- తొలి ప్రాధాన్యం 'రిటైర్మెంట్' ప్లానింగ్...
- వృద్ధాప్యంలో 30 ఏళ్లపాటు జీవన అవసరాలు..
- ఆర్జన మొదలైన వెంటనే పెట్టుబడి ఆరంభించాలి
- ఆలస్యం చేసిన కొద్దీ లక్ష్యానికి దూరం
- కాంపౌండింగ్ ప్రయోజనం కోల్పోవాల్సి రావచ్చు
- ఆర్థిక సలహాదారుల సూచనలు తీసుకోవాలి
- ప్రణాళిక మేరకు సాగినప్పుడే వృద్ధాప్యంలో ప్రశాంతత

ప్రజల ఆయుర్దాయం పెరుగుతోంది. గతంలో మాదిరి కాకుండా నేటి యువత ప్రైవేటు రంగంలోనే ఎక్కువగా ఉపాధి పొందుతున్నారు. లేదంటే సొంత వ్యాపారాలు, ఇతర స్వయం ఉపాధి మార్గాలతో స్థిరపడుతున్నారు. జీవించి ఉన్నంత కాలం ఉద్యోగ, వ్యాపారాలు నిర్వహించలేం. ఉద్యోగంలో అయితే 58 ఏళ్లకు దిగిపోవాల్సిందే. స్వయం ఉపాధిలోని వారికి వయో పరిమితి లేదు. అయినా కానీ ఏదో ఒక రోజు చేస్తున్న పనికి విరామం పలకాల్సిందే. శారీరక, ఆరోగ్య పరమైన మార్పులు మునుపటి మాదిరిగా పనిచేయనీయవు. కనుక వృద్ధాప్యంలో పనికి విరామం పలికిన తర్వాత జీవన అవసరాలను తీర్చుకోవడం ఎలా అన్నది ముందే ఆలోచించాలి. దీనివల్ల విశ్రాంత రోజుల్లో ప్రశాంతమైన జీవనానికి అవకాశం లభిస్తుంది. ఈ అంశంపై 'మనీ పాఠశాల' వ్యవస్థాపకులు వివేక్ లా ఏం చెబుతున్నారో చూద్దాం...

రిటైర్మెంట్ అనేది తప్పనిసరి దీర్ఘకాల ప్రణాళిక. అంతేకాదు, జీవితంలో ఖరీదైన లక్ష్యాల్లో ఇది కూడా ఒకటి. ఎందుకంటే రిటైర్మెంట్ తర్వాత మరో 20–30 ఏళ్లు జీవించాల్సి రావడం, అందుకు కావాల్సినంత నిధిని సమకూర్చుకోవడం చిన్న విషయం కాదు. దీనికి డబ్బు విలువను హరించే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని ఎదుర్కొనే స్థాయిలో రిటైర్మెంట్ కోసం కేటాయింపులు చేసుకోవాలి. చేస్తున్న పనికే రిటైర్మెంట్ కానీ, మన జీవన అవసరాలకు కాదు. ఉద్యోగం/వ్యాపారం ఆగిపోయినా, మన జీవన అవసరాలను తీర్చే ఆదాయం ఆగిపోకూడదని అనుకుంటే అందుకు ముందు నుంచి తగిన ఏర్పాట్లు ఉండాలి. ఆర్జన ఆరంభించిన వెంటనే రిటర్మెంట్ ప్రణాళిక మొదలు పెట్టాలి. నిజానికి చాలా మంది యువత దీని ప్రాధాన్యాన్ని గుర్తించడం లేదు. దీంతో రిటైర్మెంట్ తర్వాత జీవితం ఎంతో మందికి సవాలుగా మారుతోంది.



వివేక్ లా
మనీ పాఠశాల వ్యవస్థాపకులు

45–55 ఏళ్లకే రిటైర్మెంట్ తీసుకుని ప్రపంచమంతా తిరిగి రావాలి? ఇది కొందరి లక్ష్యం కావచ్చు. కానీ, 60 ఏళ్లు వచ్చే నాటికి అయినా దీన్ని సాధించగలిగారా? అని ప్రశ్నిస్తే.. ఎక్కువ మంది నుంచి లేదన్నదే సమాధానం వస్తుంది. సంపాదన మొదలైన నాటి నుంచే రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేయాలని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, మనలో చాలా మంది ఆర్జించే మొత్తం చెప్పుకోతగ్గ గొప్పగా ఉండదు. దీంతో పరిమిత ఆర్జన, అవసరాల నడుమ.. రిటైర్మెంట్ 60 ఏళ్లప్పుడు కదా, తర్వాత చూద్దాంలే? అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. యుక్త వయసు, ఆరోగ్యం సహకరిస్తున్న రోజుల్లోనే అలా అనుకుంటే.. వృద్ధాప్యానికి చేరువ అవుతున్న సమయంలో రిటైర్మెంట్ ఫండ్ వంటి భారీ లక్ష్యం ఎలా సాధ్యపడుతుంది? ఒక్కసారి ఆలోచించాలి. పిల్లల విద్య, వారి వివాహం, ఇతర బాధ్యతలతో రిటైర్మెంట్‌కు ముందు వరకు చాలా మంది తీరిక లేకుండా ఉంటారు. కనుక ఏ లక్ష్యాన్నీ నిర్లక్ష్యం చేయడానికి, వాయిదా

ఆర్థిక క్రమశిక్షణ

వేయడానికి లేదు. 25–30 ఏళ్ల కెరీర్‌లో రోజువారీ అవసరాల్లో ఎలాంటి రాజీ పడకుండా, రిటైర్మెంట్‌కు కావాల్సినంత నిధిని సమకూర్చుకోవడం ఎలా? ఆర్థిక ప్రణాళిక ఇందుకు మార్గం చూపుతుంది. జీవితంలో ఏవి కావాలని కోరుకుంటున్నారు? అందుకోసం ఏం చేయాలి, ఎలా చేయాలనేది? ఆర్థిక ప్రణాళిక స్పష్టం చేస్తుంది.

ఆర్థిక క్రమశిక్షణ ప్రతి ఒక్కరికీ అవసరం. కారణాలు ఏవైనా, రిటైర్మెంట్ నాటికి కావాల్సినంత నిధి సమకూర్చుకోలేకపోతే తిరిగి మునుపటి మాదిరి యువకుల్లా పనిచేయడం సాధ్యపడదు? అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలి. ఉదాహరణకు మీరు 60 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుంటారని అనుకుంటే, 90 ఏళ్ల వరకు జీవించి ఉండేట్టు అయితే కనీసం 30 ఏళ్ల అవసరాలకు సరిపడా నిధి అవసరమవుతుంది. ఇది చాలా పెద్ద లక్ష్యమే అనడంలో సందేహం లేదు. ఆరోగ్య సంరక్షణ అవసరాలు, పిల్లల విద్య, వారి వివాహాలు, వృద్ధాప్యంలో జీవన అవసరాలు, ద్రవ్యోల్బణం వల్ల పెరిగిపోయే జీవన వ్యయాలను విస్మరించడానికి లేదు. ఉదాహరణకు రిటైర్మెంట్ తర్వాత ప్రతి నెలా అవసరాలు తీర్చుకునేందుకు రూ.3 లక్షలు కావాలని అనుకుంటే.. ఏటా 7 శాతం ద్రవ్యోల్బణం అంచనా ఆధారంగా రూ.10 కోట్ల నిధిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. 35 ఏళ్ల వయసులో ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించారని అనుకుంటే.. 60 ఏళ్ల వయసు వచ్చే నాటికి మీ చేతిలో 25 ఏళ్లు మిగిలి ఉంటుంది. ఇందుకు గాను ప్రతి నెలా రూ.55,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఇది ఏటా 12% చొప్పున వృద్ధిని చూస్తుందనుకుంటే 60 ఏళ్ల నాటికి రూ.10 కోట్లు సమకూరుతుంది.

అందుకే మొదటి నెల వేతనం నుంచే రిటైర్మెంట్ నిధి సమకూర్చుకోవడానికి తొలి అడుగు పడాలి. తల్లిదండ్రులు లేదా తాతలు ప్రభుత్వరంగంలో ఉద్యోగులుగా పనిచేసి రిటైర్మెంట్ అవ్వడంతో, వారికి పెన్షన్ సదుపాయం ఉండేది. కానీ మన పరిస్థితి అలా కాదు. గ్యారంటీడ్ పెన్షన్ అనేది లేదు. ఎవరికి వారే సొంతంగా నిధిని సమకూర్చుకుని, దానిపై ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడంతో మన దేశంలో సగటు ద్రవ్యోల్బణం 4–6 శాతం మధ్యలో ఉంటుందని అంచనా. అంటే నేడు పాకెట్‌లో ఉన్న రూ.1000 విలువ ఏడాది తర్వాత రూ.96కు తగ్గుతుంది. ఇలా తరిగిపోయే విలువకు తగిన రక్షణగా అదనపు పెట్టుబడి అవసరం ఉంటుంది.

వాయిదా సరికాదు..

రిటైర్మెంట్ ఆలస్యం చేసిన కొద్దీ లక్ష్యం భారంగా మారుతుంది. పెట్టుబడి ఎంత ముందుగా ప్రారంభిస్తే కాంపౌండింగ్ ప్రయోజనంతో దీర్ఘకాలంలో అది మంచి నిధిగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల పెట్టుబడి ఎన్నో రెట్లు వృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకు 25 ఏళ్ల వయసు నుంచే ప్రతి నెలా రూ.5,000 చొప్పున 60 ఏళ్ల వరకు ఇన్వెస్ట్ చేస్తే.. 35 ఏళ్ల కాలంలో ఎంత సమకూరుతుంది? 12% కాంపౌండింగ్ రాబడి అంచనా ప్రకారం రూ.3.24 కోట్లు సమకూరుతుంది. కేవలం నెలకు రూ.5వేలు అంత పెద్ద నిధిగా మారిందంటే అదే కాంపౌండింగ్ మహిమ. ఒకవేళ ఈ పెట్టుబడిని ఒక ఏడాది ఆలస్యంగా మొదలు పెట్టారని అనుకుందాం. అంటే 26 ఏళ్లకు ఇన్వెస్ట్‌మెంట్ మొదలైతే రూ.37 లక్షలు తక్కువ మొత్తం సమకూరుతుంది. ఏడాది ఆలస్యం చేయడం వల్ల ఏర్పడిన నష్టం రూ.37 లక్షలు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకూడని, అన్నింటికంటే ముందు ఆరంభించే పెట్టుబడి ప్రణాళిక రిటైర్మెంట్ ఫండ్ కావాలి.

మిగులు లేదని చెప్పకోవద్దు..

రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్ చేయడానికి వెసులుబాటు లేదని కొందరు చెబుతుంటారు. తర్వాత వీలు చూసుకుని మొదలు పెడదామని, అనుకుంటూ ఉంటుంటారు. కానీ, విలువైన సమయాన్ని వృథా చేసిన తర్వాత ప్రతి నెలా ఎంత మొత్తం పొదుపు చేసినా అది గణనీయమైన వృద్ధిని చూడడానికి కావల్సిందన వ్యవధి ఉండదు. ఇంతకుముందు చెప్పుకున్న ఉదాహరణలోనే 25 ఏళ్లకు కాకుండా, తీరిగ్గా 45 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్‌మెటు మొదలు పెట్టారని అనుకుందాం. ప్రతి నెలా రూ.50,000 చొప్పున అక్కడి నుంచి 15 ఏళ్లు ఇన్వెస్ట్ చేస్తే.. 12 శాతం కాంపౌండింగ్ రాబడి చొప్పున 2.5 కోట్లు సమకూరుతుంది. 25 ఏళ్ల వయసులో ఆరంభించడం వల్ల కేవలం ప్రతి నెలా రూ.5వేలతోనే రిటైర్మెంట్ నాటికి రూ.3.24 కోట్లు సమకూరుతుంటే.. 20 ఏళ్లు ఆలస్యంగా మొదలు పెట్టడం వల్ల ప్రతి నెలా రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అప్పటికీ సమకూరే మొత్తం కేవలం రూ.2.5 కోట్లు కావడాన్ని గమనించాలి.

సమకూర్చుకునేది ఎలా?

రిటైర్మెంట్ ప్రణాళికలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి రిటైర్మెంట్ సమయం వచ్చేంత వరకు కావాల్సిన నిధిని సమకూర్చుకోవడం. రిటైర్మెంట్ తర్వాత ఆ నిధి నుంచి ప్రతి నెలా రాబడి పొందడం రెండోది అవుతుంది. 25–30 ఏళ్ల కాల వ్యవధి ఉంటుంది కనుక, పెట్టుబడులకు ఈక్విటీలను మెరుగైన మార్గంగా చూడాలి. దీర్ఘకాలంలో ఈక్విటీలను మించి కాంపౌండెడ్ రాబడులను ఇచ్చిన మెరుగైన సాధనం మరొకటి లేదనే చెప్పుకోవాలి. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లేదంటే ఎన్‌పీఎస్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఆర్థిక సలహాదారు సూచనలను తప్పకుండా తీసుకోవాల్సి వస్తుంది. నిపుణుల సాయంతో రాబడుల అంచనాలు, కాల వ్యవధి ఆధారంగా పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. రిటైర్మెంట్‌కు సమయం దగ్గర పడుతుండగా, ఈక్విటీ పెట్టుబడులను క్రమంగా ఉపసంహరించుకుని, డెట్‌కు మళ్లించుకోవడంలో ఆర్థిక సలహాదారు సాయపడతారు. తద్వారా మీ లక్ష్యాలు నెరవేరతాయి.

ఉపసంహరించుకునే దశ

మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకుంటే, రిటైర్మెంట్ తర్వాత సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ మార్గాన్ని ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల ప్రతీ నెలా నిర్ణయించుకున్న మేర బ్యాంకు ఖాతాకు జమ అవుతుంటుంది. మిగిలిన మొత్తాన్ని ఈక్విటీల్లోనే ఉంచడం వల్ల రాబడులతో అది వృద్ధి చెందుతూ ఉంటుంది. దాంతో ద్రవ్యోల్బణ నష్టం నుంచి రిటైర్మెంట్ ఫండ్ విలువను కాపాడుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటే కనుక రిటైర్మెంట్ నాటికి సమకూరిన మొత్తం నుంచి 60 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. దీనిపై పన్ను భారం ఉండదు. అయితే ఈ మొత్తాన్ని తిరిగి మెరుగైన రాబడులను ఇచ్చే సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. అప్పుడే మిగిలిన 30 ఏళ్ల జీవన అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి వృద్ధిని చేసుకోవచ్చు. ప్రణాళిక విషయంలో ఆర్థిక నిపుణుడి సేవలు తప్పకుండా తీసుకోవాలి. రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకునే విషయంలో భయం, ఊహాజనిత, ఉద్రేకాలకు అవకాశం ఇవ్వకుండా, క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. గృహ రుణం ఇంకా తీర్చాల్సి ఉన్నా లేదా తమపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నా.. రిటైర్మెంట్ తీసుకున్నప్పటికీ కొన్ని రకాల రక్షణ చర్యలు ఏర్పాటు చేసుకోవాలి. గృహ రుణం తీరేంత వరకు, తమ ఆదాయంపై కుటుంబ సభ్యులు ఆధారపడే కాలానికి టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. అలాగే, హెల్త్ ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.



దూసుకుపోతున్న డిజిటల్ ఎకానమీ

- జీడీపీలో 25 శాతానికి చేరుకోవచ్చు
- ప్రముఖ బ్యాంకర్ కేవీ కామత్



ముంబై: డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు మరింతగా వృద్ధి చెందుతాయని, 2028–29 ఆర్థిక సంవత్సరం చివరికి అదనంగా సమకూరే దేశ జీడీపీలో పావు వంతు వాటా ఆక్రమిస్తాయని ప్రముఖ బ్యాంకర్ కేవీ కామత్ అంచనా వేశారు. 2029 మార్చి నాటికి దేశ జీడీపీ 7 ట్రిలియన్ డాలర్ల స్థాయిని చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం మన దేశ జీడీపీలో డిజిటల్ ఆర్థిక కార్యకలాపాల వాటా 4 శాతంగా ఉంటే, చైనాలో 40 శాతంగా ఉండడం గమనార్హం. డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు అంటే డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఈ కామర్స్, డిజిటల్ చెల్లింపులు, సేవలు తదితర వాటిని కామత్ ఉదాహరణగా పేర్కొన్నారు. చైనా జీడీలో డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు 40 శాతం సమకూరుస్తున్నాయని, మన దగ్గరా ఆ స్థాయికి చేరుకోకపోవడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదని కామత్ పేర్కొన్నారు. ఇన్‌ఫ్రా అభివృద్ధి బ్యాంక్ (నాబ్‌ఫిడ్) చైర్మన్‌గా ప్రస్తుతం కామత్ పనిచేస్తున్నారు. ''ఆర్థిక వ్యవస్థకు మరిన్ని మౌలిక సదుపాయాల అవసరం ఉంది. రవాణా, ఎక్స్‌ప్రెస్‌వే, హైవేలు, ఎయిర్‌పోర్ట్‌లు, ఓడరేవులు, రైల్వే నెట్‌వర్క్‌ల పరంగా మనం ఎంతో చేయాల్సి ఉంది. రానున్న రోజుల్లో ప్రజల రవాణాకు, వస్తు రవాణాకు వీలుగా ఎన్నో ఎక్స్‌ప్రెస్ రహదారులు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, పెద్ద ఎయిర్‌పోర్ట్‌లు వస్తాయి''అని కామత్ వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-2-2023	
విశాఖ	405–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405–00
విజయవాడ	405–00
రిటైల్ ధర (డజను)	66.00
26-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

వేదాంతా లిమిటెడ్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

సాక్షి ప్లస్

ప్రస్తుత ధర: రూ. 395 **టార్గెట్:** రూ. 540

ఎందుకంటే: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ అల్యూమినియం, జింక్, లెడ్, సిల్వర్, చమురు గ్యాస్ తదితర విభిన్న విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆయా రంగాలలో వృద్ధి అవకాశాలపై ఆశావహంగా స్పందిస్తోంది. తక్కువ నగదు వ్యయాలతో పోటీలో ముందు నిలుస్తోంది. దీంతో మందగమన పరిస్థితుల్లోనూ కంపెనీ నిలదొక్కుకోగలుగుతోంది. మాతృ సంస్థ వేదాంతా రీసోర్సెస్(వీఆర్‌ఎల్)కున్న అత్యధిక రుణభారం సైతం కంపెనీకి అనుకూలంగా నిలుస్తోంది. 2022 సెప్టెంబర్‌కల్లా వీఆర్‌ఎల్ నికర రుణ భారం 8 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 66,200 కోట్లు)గా నమోదైంది. అయితే గ్రూప్ నగదు రాక(క్యాష్ ఫ్లో) కోసం ప్రధానంగా వేదాంతా లిమిటెడ్‌పైనే గరిష్ఠంగా ఆధారపడుతోంది. వెరసి డివిడెండ్ల రూపంలో భారీగా నగదును అందుకుంటోంది. ఈ బాటలో రానున్న రెండేళ్ల (2023–24, 2024–25)లోనూ షేరుకి రూ. 80/50 చొప్పున అందుకునే వీలున్నట్లు అంచనా వేస్తున్నాం. మొత్తంగా 40% ఈల్డ్(రిటర్న్)కు ఇది సమానం. ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికం(క్యూ3)లో రూ. 7,100 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది. నిపుణుల అంచనాల కంటే ఇది రూ. 400 కోట్లు తక్కువే అయినప్పటికీ.. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో పెట్టుబడి వ్యయాలకు ముందు రూ. 6,500 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో(ఎఫ్‌సీఎఫ్) సాధించడం సానుకూల అంశం. ఇంధన వ్యయాలు తగ్గడం, మెటల్ ధరలు పుంజుకోవడంతో క్యూ4(జనవరి–మార్చి)లోనూ మెరుగైన ఇబిటా, ఎఫ్‌సీఎఫ్‌లను సాధించే వీలుంది.



వీఐపీ ఇండస్ట్రీస్ | యాంబిట్ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 651 **టార్గెట్:** రూ. 870

ఎందుకంటే: బ్రాండెడ్ లగేజీ తయారీ దిగ్గజం వీఐపీ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికం(క్యూ3)లో అంచనాలకు అనుగుణంగా రూ. 530 కోట్ల ఆదాయం సాధించింది. ప్రయాణ సంబంధ ఉపఉత్పత్తులు సైతం రూపొందించే కంపెనీ వేల్యూ విభాగంలో 38 శాతం అమ్మకాలు అందుకుంది. ఇందుకు పండుగలు, పెళ్లిళ్ల సీజన్ సహకరించింది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో ముడివ్యయాలు మందగించినప్పటికీ స్థూల మార్జిన్లు అంచనాలకంటే 1 శాతం తగ్గి 49.4 శాతానికి చేరాయి. అంచనాలకంటే తక్కువగా రూ. 61 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించింది. కాగా.. 2023 మార్చికల్లా 500కుపైగా ఈబీవోల(స్టోర్లు)కు చేరుకోనున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ ఏడాది రూ. 100 కోట్ల పెట్టుబడులు వెచ్చిస్తున్నట్లు తెలియజేసింది. బిగ్‌బజార్ స్టోర్ల స్థానే 75 శాతం స్మార్ట్ బజార్ స్టోర్లు నిర్వహణలోకి వచ్చాయి. ఎంటీ చానల్ విక్రయాలు ఊపందుకునే వీలున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. వృద్ధిలో ఉన్న క్యాప్రీస్ బ్రాండు అమ్మకాలపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆదాయం వృద్ధి బాటలోనే సాగుతున్నప్పటికీ మార్జిన్లు అంతగా మెరుగుపడలేదు. అయితే కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపట్ల ఆశావహంగా ఉన్నాం. జీఎస్‌టీ కారణంగా అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో ఆర్గనైజ్‌డ్(బ్రాండెడ్) లగేజీ విక్రయాలు ఊపందుకోనున్నాయి. కుటుంబ అవసరాల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయాణాలకూ విడిగా బ్యాగులు కొనుగోలు చేస్తున్న వినియోగదారుని మారుతున్న అభిరుచులు సైతం బ్రాండెడ్ లగేజీకి డిమాండ్‌ను పెంచుతున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఖర్చులు తగ్గించుకుని అయినా హెల్త్ ఇన్సూరెన్స్

- మెజారిటీ ప్రజల అభిప్రాయం ఇదే
- ఆదిత్య బిర్లా హెల్త్ సర్వేలో వెల్లడి

ముంబై: అవసరమైతే ఖరీదైన కొనుగోళ్లకు దూరంగా ఉండి మరీ, హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని దేశంలో మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ నిర్వహించిన సర్వేలో 85 శాతం మంది ఇదే చెప్పారు. 19 పట్టణాల నుంచి 6,600 మంది సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. కరోనాతో అనిశ్చితి, ఆందోళనకర పరిస్థితులతో మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడినట్టు ఈ సర్వే నివేదిక పేర్కొంది. సర్వేలో పాల్గొన్న 89 శాతం మంది తమ హెల్త్ ఇన్సూరెన్స్‌లో హెల్త్ కన్సల్టేషన్ (వైద్య సలహా) కూడా భాగంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కనుక మానసిక ఆరోగ్యంపై అత్యవసర అవగాహన అవసరం ఉన్నట్టు ఈ నివేదిక ప్రస్తావించింది. కరోనా తర్వాత ఆరోగ్యం, శ్రేయస్సుపై తమ అవగాహన పెరిగినట్టు 84 శాతం మంది సర్వేలో చెప్పారు. వైద్య అత్యవసరాల్లో వినియోగించుకునేందుకు వీలుగా కొంత నిధిని పక్కన పెట్టనున్నట్టు 52 శాతం మంది తెలిపారు. ఖర్చు దృష్ట్యా తాము మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించేందుకు వెనుకాడినట్టు 35 శాతం మంది వెల్లడించారు. తాము బరువు, రక్తపోటు తదితర ఆరోగ్య అంశాలను తరచూ పర్యవేక్షించుకోవడం లేదని ప్రతి ముగ్గురిలో ఒక్కరు చెప్పడం గమనార్హం. కరోనా తర్వాత ఆరోగ్యం విషయంలో ప్రజల ఆలోచన విధానం మారిందని, ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండడంతోపాటు అత్యవసర పరిస్థితుల పట్ల సన్నద్ధతను అర్థం చేసుకుంటున్నారని ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సర్వే నివేదిక తెలియజేసింది. ''ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరాన్ని కరోనా తర్వాత ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. టెక్నాలజీ సాయంతో తాము తీసుకునే ఆహారాన్ని పర్యవేక్షించుకుంటున్నారు''అని ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సీఈవో మయాంక్ భత్వాల్ తెలిపారు.



ఫండ్ డైరెక్ట్/రెగ్యులర్ ప్లాన్లలో తేడా ఎందుకు?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఏదైనా మ్యూచువల్ ఫండ్ పథకం రెగ్యులర్ ప్లాన్ ఎన్‌ఏవీ, డైరెక్ట్ ప్లాన్ ఎన్‌ఏవీకి భిన్నంగా ఉంటుందా? ఒకే పెట్టుబడికి ఈ రెండు ప్లాన్లలో కేటాయించే యూనిట్లలో వ్యత్యాసం ఉంటుందా? – శామ్

మీరు అడిగింది నిజమే. మ్యూచువల్ ఫండ్ రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్ల నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్‌ఏవీ) వేర్వేరుగా ఉంటాయి. కారణం ఏమిటంటే..? ఒక ఫండ్ ఎన్‌ఏవీని నిర్ణయించేవి రెండు అంశాలు. ఆ పథకం పోర్ట్‌ఫోలియోతోపాటు, ఎక్స్‌పెన్స్ రేషియో. కనుక ఒక పథకం పోర్ట్‌ఫోలియో, ఎక్స్‌పెన్స్‌రేషియో అనేవి భిన్నంగా ఉండొచ్చు. కనుక ఎన్‌ఏవీలో మార్పు ఉండొచ్చు. అయితే, ఒక పథకం రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్లకు సంబంధించి పోర్ట్‌ఫోలియో ఒకటే ఉంటుంది. కాకపోతే ఎక్స్‌పెన్స్ రేడియో మాత్రం వేర్వేరుగా ఉంటుంది. కనుక ఎన్‌ఏవీపై దీని ప్రభావం పడుతుంది. రెగ్యులర్ ప్లాన్లకు పంపిణీదారుల కమీషన్‌ను కూడా కలుస్తుంది. కనుక రెగ్యులర్ ప్లాన్ల ఎన్‌ఏవీ అధికంగా ఉంటుంది. డైరెక్టర్ ప్లాన్లలో ఎలాంటి పంపిణీదారుల కమీషన్ ఉండదు. కనుక వాటి ఎన్‌ఏవీ తక్కువగా ఉంటుంది. ఒక పథకంలో ఇన్వెస్టర్ పెట్టుబడికి ఎన్ని యూనిట్లు వస్తాయనేది.. యూనిట్ ఎన్‌ఏవీపైనే ఆధారపడి ఉంటుంది. ఇన్వెస్టర్ మొత్తం పెట్టుబడిని, ఎన్‌ఏవీతో భాగిస్తే ఎన్ని యూనిట్లు వస్తాయో తెలుస్తుంది. ఒక పథకం రెగ్యులర్ ప్లాన్ ఎన్‌ఏవీ రూ.11గా ఉండి.. రూ.10,000 పెట్టుబడి పెడుతున్నారని అనుకుందాం. అప్పుడు ఈ పెట్టుబడికి 909.09 యూనిట్లు వస్తాయి. డైరెక్ట్ ప్లాన్ ఎన్‌ఏవీ రూ.10 ఉందనుకుందాం. అప్పుడు అదే రూ.10,000 పెట్టుబడికి 1,000 యూనిట్లు లభిస్తాయి.



నా వయసు 51 ఏళ్లు. పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. 2023 మార్చితో 15 ఏళ్ల కాల వ్యవధి ముగుస్తుంది. దీన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిసింది. దాన్ని కొనసాగించాలని అనుకుంటున్నాను. నాకు ఇప్పట్లో డబ్బులతో పని లేదు. నెలకు రూ.12,500 చొప్పున పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే పీపీఎఫ్‌ను కొనసాగించుకోవాలా లేదా అది ముగిసిన తర్వాత.. ఈఎల్‌ఎస్‌ఎస్ పథకంలో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవాలా? పీపీఎఫ్‌లో పెట్టుబడులు, రాబడులపై పన్ను లేదు. ఈఎల్‌ఎస్‌ఎస్‌లోనూ పెట్టుబడులపై సెక్షన్ 80సీ కింద పన్ను లేదు. నేను 20 శాతం పన్ను పరిధిలో ఉన్నాను. మంచి సలహా ఇవ్వగలరు? – సెంథిల్ కుమార్

ఈక్విటీల్లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయడం ద్వారా డెట్‌తో పోలిస్తే మెరుగైన రాబడులు సొంతం చేసుకోవచ్చని వ్యాల్యూరీసెర్చ్ తరచూ చెబుతుంటుంది. మీకు సమీప కాలంలో డబ్బుతో అవసరం లేదంటున్నారు. కనుక పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయడం కంటే ఈఎల్‌ఎస్‌ఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన ఆలోచన అవుతుంది. మీకు ఈక్విటీల పట్ల తగినంత అనుభవం ఉందని అనుకుంటున్నాం. అలాగే, మీ పెట్టుబడుల కాల వ్యవధి కనీసం ఐదేళ్ల నుంచి ఏడేళ్లు ఉంటుందనే అంచనాతో ఈ సూచన చేస్తున్నాం. ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాల్లో పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుందని మర్చిపోవద్దు. ఈఎల్‌ఎస్‌ఎస్, పీపీఎఫ్‌ల్లో పన్ను మినహాయింపు పరిశీలిస్తే.. పీపీఎఫ్‌తో పోలిస్తే పన్ను చెల్లింపుల తర్వాత రాబడులు ఈఎల్‌ఎస్‌ఎస్‌లోనే ఎక్కువ. పన్ను ఆదా కోసం పెట్టుబడికి ఎంపిక చేసుకునే సాధనాల్లో ముందు రాబడులకే ప్రాధాన్యం ఇవ్వాలి.

ఉపాధి అవకాశాలు సృష్టించాలి

కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంత్



సాక్షి, విశాఖపట్నం : యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ సూచించారు. విశాఖపట్నంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా పంత్.. ఆదివారం మల్కాపురంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారీటైం షిప్ బిల్డింగ్(సెమ్స్), ఇండియన్ మారీటైం యూనివర్సిటీ(ఐఎంయూ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పంత్ మాట్లాడుతూ దేశంలో మానవ వనరులను సృష్టించే బాధ్యతను పక్కా ప్రణాళికతో అమలు చేస్తే భారత్ ఆర్థిక పురోగతి దిశగా వేగంగా దూసుకువెళ్లగలదని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, సెమ్స్, ఐఎంయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ లక్ష్యానికి చేయూతనివ్వాలి..

- ఏపీని కోరిన బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే



సాక్షి, అమరావతి : ఇంధన పొదుపు, సామర్థ్యంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఏపీ.. జాతీయ లక్ష్యానికి మరింత చేయూతనివ్వాల్సిందిగా బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే కోరారు. మార్చి 1న న్యూఢిల్లీలోని ఇండియన్ హాబిటాట్ సెంటర్‌లో జరగనున్న బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) 21వ వ్యవస్థాపక దినోత్సవాలకు రాష్ట్రాన్ని ఆహ్వానించారు. ఈ మేరకు స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ(ఎస్డీఏ)గా ఉన్న ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం)కు సమాచారం అందించడం కోసం బాక్రే ఆదివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2030 నాటికి ఏపీలో 6.68 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన(ఎంటీవోఈ) ఇంధనాన్ని ఆదా చేయాలనే లక్ష్యాన్ని చేరుకునే కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డిని బాక్రే కోరారు.



ఇక.. అంతరిక్ష విద్యుత్

నిరంతరం అందుబాటులో ఉండే శక్తి

- అంతరిక్షంలో సౌరవిద్యుత్‌ను సేకరించి భూమికి ప్రసారం
- ప్రయోగదశకు చేరిన పరిశోధనలు
- సైన్స్ ఫిక్షన్ సినిమాలకే పరిమితమనుకున్న దాన్ని నిజం చేస్తున్న శాస్త్రవేత్తలు

సాక్షి, అమరావతి: అంతరిక్షంలోకి మానవుడు అడుగుపెట్టడమంటేనే ఒకప్పుడు అత్యంత అద్భుతంగా భావించేవారు. కానీ విజ్ఞాన ప్రపంచం విశ్వమంతా వ్యాపించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అసాధ్యమనుకున్నవాటిని సుసాధ్యం చేస్తూ ఎప్పటికప్పుడు ఆశ్చర్యం కలిగిస్తూనే ఉన్నాయి. అలాంటి ఓ ఆవిష్కరణే అంతరిక్ష సౌరవిద్యుత్ (స్పేస్ సోలార్ పవర్ – ఎస్ఎస్‌పీ). నమ్మశక్యంగా లేకపోయినా ఇది నిజం. భూమి మీద వివిధ పద్ధతుల ద్వారా, అనేక వనరుల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం గురించే ఇప్పటివరకు మనకు తెలుసు. కానీ.. తాజా ఆవిష్కరణ వాటికి విభిన్న విధానం. అంతరిక్షంలో పగలు, రాత్రి, రుతువులు, మేఘాల కవచం వంటి కాలచక్రాలతో సంబంధం లేకుండా నిరంతరం అందుబాటులో ఉండే విద్యుత్‌ను భూమి మీదకు తీసుకొచ్చే పరిశోధనలు 2011లో మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ పరిశోధనల్లో మరో అడుగు ముందుకుపడింది.

నాలుగు శాతమే వాడుతున్నాం

సౌరవిద్యుత్‌ను 1800 సంవత్సరం చివరి నుంచి వాడడం మొదలుపెట్టారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రపంచంలోని విద్యుత్‌లో నాలుగు శాతం (అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి శక్తినివ్వడంతో పాటు) మాత్రమే సౌరవిద్యుత్ ఉత్పత్తి అవుతోంది. బొగ్గు, నీటి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నీటివనరులు ఇప్పటికే చాలావరకు తగ్గిపోగా.. బొగ్గు వల్ల వాతావరణంలో కర్బన ఉద్గారాలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్యమం ప్రపంచ దేశాల్లో మొదలైంది. దీంతో అపారంగా ఉన్న సౌరశక్తిని వాడుకోవడానికి ఉన్న అన్ని మార్గాలను శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారు. దీన్లో భాగమే ఈ ప్రయోగం. భవిష్యత్‌లో దీనిద్వారా భూమి మీదకు వైర్‌లెస్ విధానంలో సౌరవిద్యుత్ ప్రసారం చేయగలమని శాస్త్రవేత్తలు గట్టిగా చెబుతున్నారు.

ఏమిటీ ప్రయోగం

సైన్స్ ఫిక్షన్ సినిమాలకే పరిమితమనుకున్న అనేక విషయాలను నేడు శాస్త్రవేత్తలు నిజం చేస్తున్నారు. ఆ కోవలో మొదలైనదే కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాల్టెక్) స్పేస్ సోలార్ పవర్ ప్రాజెక్ట్ (ఎస్ఎస్‌పీపీ). ఇదొక అంతరిక్ష పరిశోధన. ఈ పరిశోధన కోసం గత నెలలో కాలిఫోర్నియా నుంచి స్పేస్ సోలార్ పవర్ డెమాన్‌స్ట్రేటర్ (ఎస్ఎస్‌పీడీ)ను అంతరిక్షంలోకి పంపారు. ట్రాన్స్‌పోర్టర్–6 మిషన్‌లో స్పేస్‌ఎక్స్ రాకెట్ ద్వారా మోమెంటస్ విగోరైడ్ అంతరిక్షనౌక 50 కిలోల బరువున్న ఎస్ఎస్‌పీడీని అంతరిక్షానికి తీసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా సూర్యరశ్మిని సేకరించి, దాన్ని విద్యుత్తుగా మార్చే మాడ్యులర్ స్పేస్‌క్రాఫ్ట్ సముదాయాన్ని అంతరిక్షంలోకి పంపించారు. ఇది విద్యుత్తును చాలా దూరం వరకు వైర్‌లెస్ రూపంలో ప్రసారం చేస్తుంది. కొన్ని పరిణామాల అనంతరం చివరికి పవర్ స్టేషన్‌గా ఏర్పడుతుంది. 32 రకాల ఫోటోవోల్టాయిక్‌లు అంతరిక్ష వాతావరణంలోని సౌరకణాలను విద్యుత్‌గా మార్చేందుకు ఉన్న అవకాశాలను అంచనా వేస్తాయి. మైక్రోవేవ్ పవర్ ట్రాన్స్‌మీటర్ ద్వారా వైర్‌లెస్ విధానంలో విద్యుత్‌ను ట్రాన్స్‌ఫర్ చేసే సౌకర్యం ఉంటుంది. ఈ సెటప్ అంతా అంతరిక్షంలో అమర్చగానే భూమిపై ఉన్న కాల్టెక్ బృందం తమ ప్రయోగాలను ప్రారంభించింది. కొన్ని కెమెరాలు ప్రయోగం పురోగతిని పర్యవేక్షిస్తూ, భూమికి సమాచారం పంపిస్తున్నాయి. కొద్దినెలల్లోనే ఎస్ఎస్‌పీడీ పనితీరుపై పూర్తి అంచనా వేయగలమని ఎస్ఎస్‌పీపీ బృందం భావిస్తోంది.

ధర్మ ప్రచార కేంద్రంగా ‘అరసవల్లి’

- కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి
- పీఠాధిపతి హోదాలో తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకున్న స్వామీజీ

అరసవల్లి: హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అటు విశాఖ నుంచి ఇటు ఒడిశా వరకు అరసవల్లి సూర్య క్షేత్రం ధర్మ ప్రచార కేంద్రంగా విరాజిల్లే అవకాశముందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. ఆయన ఆదివారం పీఠాధిపతి హోదాలో తొలిసారి శ్రీకాకుళంలోని అరసవల్లి ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికారు. అనంతరం గర్భాలయంలో ఆదిత్యుడికి శంకర విజయేంద్ర సరస్వతి పూజలు నిర్వహించారు. తర్వాత అనివెట్టి మండపంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. శనివారం నారాయణుడిని (శ్రీకూర్మం), ఆదివారం సప్తమి నాడు సూర్యనారాయణుడిని దర్శించుకోవడం అదృష్టమని వ్యాఖ్యానించారు. నేపాల్ యాత్రలో భాగంగా 1985లో నాటి కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతితో కలిసి అరసవల్లికి తొలిసారిగా వచ్చానని, అయితే అప్పటికీ ఇప్పటికీ ఆలయంలో అద్భుత మార్పులు వచ్చాయని చెప్పారు. ఈ కళింగ ప్రాంతంలో ధర్మ ప్రచారం దీక్షగా చేయాలని, ఇలాంటి క్షేత్రాన్ని ధర్మ ప్రచార కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి నగేష్ కాశ్యప శర్మ, రంజిత్ శర్మ, ఫణీంద్ర శర్మ, షణ్ముఖ శర్మ తదితరులు పాల్గొన్నారు. పాలక మండలి సభ్యులు మండవల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ఎన్.కోటేశ్వర చౌదరి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



కంచి పీఠాధిపతికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈవో, ప్రధానార్చకులు

కంటైనర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలంటే దాదాపు 20 సెంట్ల స్థలం అవసరం. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో.. సబ్‌స్టేషన్ కాస్తా ఓ కంటైనర్‌లోనే ఇమిడిపోతోంది. నగర, పట్టణ ప్రాంతాల్లో స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ.. సబ్ స్టేషన్లు నిర్మించాలంటే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కంటైనర్ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావడం వల్ల.. స్థల భారం తప్పడంతోపాటు అనేక లాభాలుంటాయని విద్యుత్‌శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే విజయవాడలోని గొల్లపూడి వద్ద తొలి కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి కాగా.. వచ్చే నెలలో ప్రారంభించనున్నారు.

విజయవాడ గొల్లపూడిలో కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి

- తెలుగు రాష్ట్రాల్లో తొలి కంటైనర్ సబ్‌స్టేషన్ ఇదే
- ప్రమాదాల నివారణ దీని ప్రత్యేకత
- నిర్మాణానికి రూ.5.50 కోట్ల ఖర్చు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సాధారణంగా నౌకల్లో సరుకుల్ని తరలించేందుకు కంటైనర్లను వినియోగిస్తుంటారు. ఇటీవల కాలంలో కంటైనర్ ఇళ్లు సైతం నిర్మిస్తున్నారు. తాజాగా కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ సీపీడీసీఎల్) కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మించింది. విజయవాడ సమీపంలోని గొల్లపూడి శ్రీనివాస నగర్‌లో రూ.5.50 కోట్లు వెచ్చించింది. ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతం కాగా.. మార్చిలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ 4.5 మీటర్ల వెడల్పు, 13 మీటర్ల పొడవు ఉంది. అందులోనే సబ్‌స్టేషన్‌కు సంబంధించిన పరికరాలన్నీ అమర్చారు. అత్యాధునిక రీతిలో తక్కువ స్థలంలో కంప్యూటర్ ఆధారంగా ఆపరేట్ చేసేలా దీనిని నిర్మించారు. పూర్తి ఆటోమేషన్ విధానంలో ఇది పనిచేస్తుంది.

1ప్రత్యేకతలు ఇవీ..

- ▲ సాధారణ సబ్‌స్టేషన్‌కు 20 సెంట్ల స్థలం అవసరం. కంటైనర్ సబ్‌స్టేషన్‌కు 2నుంచి 3 సెంట్ల జాగా సరిపోతుంది.
- ▲ సాధారణ సబ్‌స్టేషన్‌కు మూడు నెలలకొకసారి నిర్వహణ తప్పనిసరి. కంటైనర్‌కు నిర్వహణ వ్యయం అవసరం లేదు. విద్యుత్ పంపిణీ సాధారణ సబ్‌స్టేషన్ కంటే మెరుగ్గా ఉంటుంది.
- ▲ అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు వీలుంటుంది. బ్రేక్ డౌన్స్ ఉండవు. ఓఎన్ఎం సిబ్బందికి పూర్తి రక్షణ ఉంటుంది.
- ▲ రద్దీగా ఉండే ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాల్లో సైతం వీటిని నిర్మించవచ్చు. అక్కడ అవసరం లేకపోతే మరో ప్రాంతానికి తరలించవచ్చు.
- ▲ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనిచోట శివారు ప్రాంతాల నుంచి కూడా కంప్యూటర్ ద్వారా ఆపరేట్ చేయవచ్చు.

సమస్య తలెత్తితే..

సబ్‌స్టేసన్‌లో సమస్య తలెత్తితే సెన్సార్ల ద్వారా ఆటోమేటిక్‌గా తలుపులు తెరచుకొంటాయి. వీడియో కాల్ ద్వారా పరిశీలించి తగు సూచనలు ఇచ్చి పరిష్కరించే వెసులుబాటు ఉంది. లోపల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లు తెగిన వెంటనే ట్రిప్ అయి సరఫరా నిలిచిపోయే వ్యవస్థ ఉంది. ఏ వీధిలోనైనా సమస్య తలెత్తితే సబ్‌స్టేసన్‌లోనే ఉండి తెలుసుకునే వీలుంది.



కంటైనర్ లోపల ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటింగ్ సిస్టం

ఎంతో ప్రయోజనం



కంటైనర్ సబ్‌స్టేషన్ల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా గొల్లపూడిలో ప్రయోగాత్మకంగా దీనిని నిర్మించాం. వీటివల్ల డిస్కంలకు నిర్వహణ వ్యయం తగ్గుతుంది. వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. జనావాసాల్లో స్తంభాలతో పనిలేకుండా ఈ కంటైనర్ సబ్‌స్టేషన్లు ఆకర్షణీయంగా పనిచేస్తాయి.

– జె.పద్మ జనార్దనరెడ్డి, సీఎండీ, ఏపీ సీపీడీసీఎల్

గొల్లపూడి ప్రాంతానికి వరం



గొల్లపూడి ప్రాంత ప్రజలకు కంటైనర్ సబ్ స్టేషన్ వరంలాంటిది. ఈ ప్రాంతం అతివేగంగా అభివృద్ధి చెందుతోంది. నూతన గృహ, వాణిజ్య సముదాయాలు విస్తరిస్తున్నాయి. భవిష్యత్‌లో వాటికి నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకు రావడానికి కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మించారు. విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే నిర్మాణానికి సహకరించిన మంత్రి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– తలశిల రఘురాం, ఎమ్మెల్సీ, ఉమ్మడి కృష్ణా జిల్లా

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943